పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు



సంపుటి : 1 సంచిక : 78 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు (ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ గురువారం 29 జనవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 78 PAGES : 12 EDITOR : G. A. RAO (ANAND GANTYADA) PUBLISHED : HYDERABAD THU 29 JANUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

మేడారానికి సారలమ్మ..
మహాజాతరలో తొలిఘట్టం

- కన్నెపల్లి నుంచి తీసుకొచ్చిన పూజారులు.. మంత్రులు సీతక్క, అడ్లూరి
- మేడారంలో గద్దెలపై కొలువైన సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు
- సమ్మక్క రాక నేడు

హైదరాబాద్ పెన్ పవర్: తెలంగాణ కుంభమేళా బుధవారం జనసంద్రమైంది. మేడారం వనజాతరలో తొలిరోజు సారలమ్మను గద్దెల ప్రాంగణానికి కోలాహలంగా ఆహ్వానించారు. ఈ మహాక్రతువును కనులారా తిలకించేందుకు లక్షల మంది భక్తులు పిల్లాపాపలతో కలిసి ఎడ్లబండ్లు, బస్సులు, వాహనాల్లో తరలివచ్చారు. మొదట... మేడారానికి మూడున్నర కిలోమీటర్ల దూరంలో కన్నెపల్లిలో ఉన్న ఆలయంలో ఉదయం ప్రధాన పూజారి కాక సారయ్య ఆధ్వర్యంలో

మిగతా 2లో

మహారాష్ట్రలో కుప్పకూలిన విమానం
డిప్యూటీ సీఎం అజిత్ పవార్ దుర్మరణం

ప్రాణాలు కోల్పోయిన మరో నలుగురు

ఎన్నికల ప్రచారానికివెళ్తుండగా ఘటన

- సీఎం ఫడ్నవీస్‌కు ప్రధాని మోదీ, అమిత్ షా ఫోన్
- ప్రమాదంలో అజిత్ పవార్ సహా ఐదుగురు మృతి చెందినట్లు డీజీసీఏ ధ్రువీకరణ
- ల్యాండింగ్ సమయంలో అదుపుతప్పి కూలిపోయిన విమానం
- సీఎం ఫడ్నవీస్‌కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్న ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా
- స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారానికి వెళ్తుండగా జరిగిన దుర్ఘటన

ముంబై: పెన్ పవర్ మహారాష్ట్రలో విమానం కుప్పకూం ఘటనలో ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ (66) సహా మరో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. జిల్లా పరిషత్ ఎన్నికల ప్రచారం నిమిత్తం ముంబై నుంచి బారామతి వెళ్తుండగా ఉదయం 8.45 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది.

మిగతా 2లో

ఇది ప్రమాదమే.. కుట్ర కాదు
అజిత్ మృతిపై శరద్ పవార్ భావోద్వేగం

- విమాన ప్రమాదంలో మహారాష్ట్ర నేత అజిత్ పవార్ దుర్మరణం
- ఇది కేవలం ప్రమాదమేనని, కుట్ర కాదని శరద్ పవార్ స్పష్టీకరణ
- సమర్థుడైన నాయకుడిని కోల్పోయామంటూ భావోద్వేగం
- ఈ విషయాన్ని రాజకీయం చేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి

మిగతా 2లో

ఈ ఒప్పందం ద్వారా భారత్‌దే పైచేయి అవుతుంది

- భారత్-యూరోపియన్ యూనియన్ వాణిజ్య ఒప్పందం.. అమెరికా వాణిజ్య ప్రతినిధి కీలక వ్యాఖ్యలు
- ఈ ఒప్పందానికి సంబంధించిన వివరాలను పరిశీలించానన్న అమెరికా వాణిజ్య ప్రతినిధి
- దీని వల్ల భారత్‌కే ఎక్కువ ప్రయోజనం ఉంటుందన్న జెమిసన్ గ్రీర్

మిగతా 2లో

వికసిత్ భారత్‌కు 2026 పునాది సంవత్సరం

- పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం
- ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్.. ఈ నెల 29న ఆర్థిక సర్వే ప్రవేశపెట్టనున్న నిర్మల

హైదరాబాద్ పెన్ పవర్: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఈరోజు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఢిల్లీలోని పార్లమెంట్‌లో లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో కూడిన ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ నెల 29న (గురువారం) ఆర్థిక సర్వేను, ఫిబ్రవరి 1న (ఆదివారం) కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ముర్ము మాట్లాడుతూ.. గడిచిన ఏడాది వేగవంతమైన ప్రగతి, గొప్ప సాంస్కృతిక వారసత్వానికి గుర్తుగా నిలిచిపోయిందన్నారు. 'వికసిత్ భారత్' నిర్మాణంలో 2026వ సంవత్సరం ఒక కీలకమైన పునాది సంవత్సరంగా

మిగతా 2లో

గల్లీ నుంచి ఢిల్లీ వరకు కేసీఆర్ మీద చెప్పే అబద్ధం అదే

- కేసీఆర్ ఏడెనిమిది లక్షల కోట్ల అప్పులు చేశారని చెబుతున్నారని ఆగ్రహం
- పార్లమెంటులో బీజేపీ ఎంపీ అప్పు గురించి అడిగితే రూ.3.5 లక్షల కోట్లు అని తేలిందని వెల్లడి
- ఈరోజు ఓపిక లేని వ్యక్తి తెలంగాణను పాలిస్తున్నారని సీఎంపై ఆగ్రహం

హైదరాబాద్ పెన్ పవర్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఒకటే అబద్ధం చెబుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ పదేళ్ల కాలంలో ఏడెనిమిది లక్షల కోట్ల రూపాయల అప్పు చేశారని వారు చెబుతున్నారని, కానీ పార్లమెంటులో బీజేపీ ఎంపీ ఒకరు అడిగిన ప్రశ్నకు స్పష్టమైన సమాధానం వచ్చిందని అన్నారు.

మిగతా 2లో

ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసేందుకు బీజేపీ కుట్ర పన్నుతోంది

హైదరాబాద్ పెన్ పవర్: బుధవారం (జనవరి 28) మీడియాతో మాట్లాడుతూ బీజేపీపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు ఏఐసీసీ తెలంగాణ ఇంచార్జి మీనాక్షి నటరాజన్. ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేయడానికి బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నుతుందని అన్నారు. మా హక్కులను హరిస్తామంటే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని.. ఉపాధి హామీ పని చేయడం చాలా కష్టమని.. నేను కూడా ఉపాధి పనికి వెళ్ళానని అన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కూలీలలకు సరైన వేతనాలు ఇచ్చేవాళ్లమని.. బీజేపీ ప్రభుత్వం ఉపాధి కూలీలను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. గ్రామాలలో ఉండే అభివృద్ధి పనులను గ్రామ సర్పంచ్ తో చేసుకోవాలని.. ఢిల్లీ వాడు,

హైద్రాబాద్ వాడు గ్రామాలకు వచ్చి ఎం చేస్తాడని అన్నారు. గ్రామాలలో ఏం పనులు కావాలో ఢిల్లీలో ఉన్న బిజెపి ప్రభుత్వం నిర్ణయం తీసుకునే రోజులు వస్తాయని అన్నారు మీనాక్షిజీ నటరాజన్.

కడియం శ్రీహరి కారణంగానే పార్టీ నుంచి వెళ్లిపోయా:
బీఆర్ఎస్‌లో చేరిన ఆరూరి రమేశ్

- అనేకమంది మీద బురద జల్లి రాజకీయంగా ఎదగకుండా చేసిన వ్యక్తి అని ఆరోపణ
- ఎన్నికలకు ముందు రేవంత్ రెడ్డితో ములాకత్ కుదుర్చుకున్నారని విమర్శ
- కడియం శ్రీహరి వల్లే రమేశ్ పార్టీ మారినట్లు చెప్పిన ఎర్రబెల్లి దయాకర రావు

మిగతా 2లో

అమెజాన్‌లో 16వేల మంది ఉద్యోగులు తొలగింపు

హైదరాబాద్ పెన్ పవర్: ప్రముఖ ఇ-కామర్స్ సంస్థ అమెజాన్ మరోసారి భారీ సంఖ్యలో లేఆఫ్ ప్రకటించింది. గతేడాది అక్టోబర్‌లో 14 వేల మంది కార్పొరేట్ ఉద్యోగులను తొలగించగా.. తాజాగా 16వేల మంది ఉద్యోగులకు ఉద్వాసన పలుకుతున్నట్లు పేర్కొంది.

మిగతా 2లో

ఆకాశవాణి తొలి స్వరకర్త బాలాంత్రపు రజనీ కాంతరావు

బాలాంత్రపు రజనీ కాంతరావు సుప్రసిద్ధ వాగ్గేయకారునిగా, స్వరకర్తగా, గీత రచయితగా, విజయవాడలోని ఆకాశవాణి సంచాలకులుగా రేడియో శ్రోతలకు చిరపరిచితులు. అయన తొలితరం సంగీత దర్శకుల్లో ఒకరు. ఆయన రచించిన వాగ్గేయకార చరిత్ర 20వ శతాబ్దంలో తెలుగులో వచ్చిన గొప్ప పుస్తకాల్లో ఒకటి. 1947 లో దేశం స్వాతంత్ర్యం పొందిన అర్ధరాత్రి భారత ప్రధాని సుప్రసిద్ధ ప్రసంగం పూర్తవగానే రజనీ రచించి, స్వరపరచిన 'మాదీ స్వతంత్రదేశం, మాదీ స్వతంత్ర జాతి' టంగుటూరి సూర్యకుమారి గానం ఆసేతుహిమాచలం ప్రతిధ్వనించింది. తొలి స్వాంత్ర్య దినోత్సవం రోజున స్వయంగా రచించి స్వరపర్చిన "జయభేరి, వాయించు నగారా గీతం" మద్రాసు ఆకాశవాణి కేంద్రం నుంచి ప్రసారమయ్యాయి. ఆ తర్వాత అర్ధశతాబ్దం పైగా ఆయన తెలుగునాట లలిత సంగీతమనే ఒక నూతన గాన సంప్రదాయాన్ని సృష్టించి, పెంపొందించి, తానొక వాగ్గేయ కారుడిగా అవతరించడమే కాక, మరెందరో వాగ్గేయకారులకు మార్గదర్శకులుగా ఉన్నారు. 1920 జనవరి 29న పశ్చిమ గోదావరి జిల్లా నిడదోలులో రజనీకాంత రావు జన్మించారు. ఆయన తండ్రి బాలాంత్రపు వేంకటరావు ప్రసిద్ధి చెందిన వేంకట పార్వతీశ కవుల్లో ఒకరు కావడం విశేషం. 1940-41 ప్రాంతంలో ఇరవయ్యేళ్ల నాడు ఆల్ ఇండియా రేడియో సంస్థలో ఉద్యోగంలో చేరగా, నాటి నుండి రిటైరయ్యే వరకూ దేశంలోని వివిధ ప్రాంతాల్లోని కేంద్రాల్లో పనిచేసి 1978లో రేడియో స్టేషన్ డైరెక్టరుగా రిటైరయ్యారు. ఆకాశవాణిలో తొలి స్వరకర్తగా శ్రోతలను అలరించారు. విజయవాడ ఆకాశవాణి కేంద్రానికి జాతీయస్థాయి గుర్తింపు తెచ్చిన వారిలో రజనీకాంతరావు కీలకమైన వారు. అలాగే తొలితరం సంగీత దర్శకుల్లోనూ బాలాంత్రపు కూడా ఒకరు. రజనీ" అని పిలుచుకునే బాలాంత్రపు రజనీ కాంతరావు ఒక వ్యక్తి కాదు, ఆయన ఏదో ఒక కళకే పరిమితం కాదు. ఆయన ఒక రచయిత, వాగ్గేయ కారుడు, రేడియో కళాకారుడు, సినీ పాటల – మాటల రచయిత, సంగీత దర్శకుడు. సంగీతంలో , సాహిత్యంలో, ముఖ్యంగా కవిత్వంలో రజనీది ఒక ప్రత్యేక శైలి. సాధారణత్వం – సంక్లిష్టత, ప్రాచీనత – ఆధునికత, అచ్చ తెలుగు మాటలు – సంస్కృత భూయిష్ట సమాసాలు, అనేక పరస్పర విరుద్ధ విషయాలు అయన కవిత్వంలో పదబంధాల్లో చోటు చేసుకున్నాయి. ప్రయోగాలు – సంగీత రూపకాలు, యక్షగానాలు, నాటికలు, సంగీత శిక్షణ, ఉషశ్రీ గారి ధర్మ సందేహాలు, ఈ మాసపు పాట, బావగారి కబుర్లు, ఇంకా ఎన్నో కార్యక్రమాల రూపకర్త ఆయన. వీటికి సంబంధించిన రచనలు చేయడం, బాణీలు సమకూర్చడం ఒక ఎత్తు, వాటిని గాయనీ గాయకులతో, వాద్య బృందంతో నిర్వహించడం మరొక ఎత్తు, రేడియో కోసం రచయిత గుడిపాటి వెంకటాచలంను అయన చేసిన ఇంటర్వ్యూ ఈ నాటికి కూడా అపురూపమైనదిగా పరిగణిస్తారు. ఆలిండియా రేడియో లలిత సంగీత విభాగాన్ని తన ప్రతిభతో సుసంపన్నం చేశారు. రజనీ రచించి, స్వరపరిచిన అనేక కృతులు తెలుగు వారి సాంస్కృతిక, సంగీత రంగాల్లో నిలిచి పోయాయి. ప్రఖ్యాత కర్ణాటక సంగీత విద్వాంసుడు మంగళంపల్లి బాలమురళీకృష్ణ తన సంగీతంలో లిరిసిజం రజనీ ప్రభావమేనన్నారు. లలిత సంగీతానికి, తెలుగు సాహిత్యానికి మధ్య సంబంధాన్ని నెలకొల్పి, దానికి రూపకల్పన చేసిన గొప్ప సంగీత కారులుగా ఘంటసాల వెంకటేశ్వరరావు, సాలూరి రాజేశ్వరరావులతో పాటు రజనీకాంతరావు తెలుగు సంగీత చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తారు.ఠాగూర్ అకాడమీ రత్న – రవీంద్రనాథ్ ఠాగూర్ 150 జయంతి సందర్భంగా సంగీత నాటక అకాడమీ ప్రదానం, కళాప్రపూర్ణ – ఆంధ్ర విశ్వ విద్యాలయం 1981 లో బహుకరించిన గౌరవ డాక్టరేట్, కళారత్న అవార్డు – ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2007 లో ఇచ్చిన పురస్కారం, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం – 1961. ఆంధ్ర వాగ్గేయకారుల చరిత్ర ఉత్తమ పరిశోధనా గ్రంథానికి? ప్రతిభా మూర్తి జీవితకాల సాఫల్య బహుమతి – అమెరికాలోని అప్పజోస్యుల విష్ణుభొట్ల ఫౌండేషన్ వారి పురస్కారం, నాథ సుధార్ణవ – మదరాసు మురళీరవళి ఆర్ట్ అకాడమీ, పుంభావ సరస్వతి, నవీన వాగ్గేయకార, 2008లో తెలుగు విశ్వ విద్యాలయం నుండి సాంస్కృతిక రంగంలో విశిష్ట పురస్కారాలు ఆయనకు లభించాయి. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ, రజనీకాంతరావు 2018, ఏప్రిల్ 22 ఆదివారం రోజున మరణించాడు

మేడారానికి సారలమ్మ..
మహాజాతరలో తొలిఘట్టం

- మొదటి పేజీ తరువాయి

సారలమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ ఆడపడుచులు ప్రాంగణంలో రంగురంగుల ముగ్గులు వేశారు. మంత్రులు సీతక్క, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ములుగు కలెక్టర్ దివాకర, ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అధికార యంత్రాంగంతో కన్నెపల్లి చేరుకొన్నారు. రాత్రి 7:40 గంటలకు కన్నెపల్లి ఆలయం నుంచి సారలమ్మను బయటకు తీసుకొచ్చే సమయంలో శివసత్తులు పూనకాలతో ఊగిపోయారు. ఆదివాసీలు నృత్యాలు చేస్తూ, కొమ్ము బూర ఊదుతుండగా మంత్రులు, అధికారులు సైతం తన్మయత్వంతో పరవశిస్తూ అమ్మవారికి ఆహ్వానం పలికారు.ఆలయం బయట భక్తులు వరం పడుతూ, పొర్లుదండాలు పెడుతుండగా... పూజారులు వెదురుబుట్టలో సారలమ్మను తీసుకొని వారి పైనుంచి నడుచుకుంటూ వచ్చారు. అత్యంత భావోద్వేగంతో సాగిన ఈ ఘట్టాన్ని చూసి పులకరించిన భక్తులు వనదేవతకు జేజేలు పలికారు. అక్కడి నుంచి మూడంచెల పోలీసుల భద్రత మధ్య పూజారులు మేడారానికి బయలుదేరారు. మార్గంమధ్యలో జంపన్నవాగును దాటుకుంటూ... మేడారంలోని సమ్మక్క గుడికి చేరుకున్నారు. అప్పటికే అక్కడ పగిడిద్దరాజు, గోవిందరాజులతో వారి పూజారులు సిద్ధంగా ఉన్నారు. సారలమ్మ రాగానే ముగ్గురు దేవతల పూజారులు ప్రత్యేక పూజలు చేశాక గద్దెల వద్దకు తరలారు. ప్రాంగణం వద్ద ఎదుర్కోలు నిర్వహించి, ముగ్గురినీ అర్ధరాత్రి దాటాక గద్దెలపై కొలువు దీర్చారు. వనదేవతల ప్రతిష్ఠ కార్యక్రమాన్ని కనులారా తిలకించేందుకు భక్తులు పోటీపడ్డారు.

సేవలో 40 వేల సిబ్బంది

ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి నేతృత్వంలో 13 వేల మంది పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన భద్రతను కల్పించింది. మరోవైపు 42 సెక్టార్లలో 21 శాఖలకు చెందిన 40 వేల మంది సిబ్బంది జాతర విధుల్లో భాగస్వాములయ్యారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి హై ఫ్రీక్వెన్సీ వాకీటాకీతో మేడారంలో ట్రాఫిక్ విధుల్లో ఉన్న సిబ్బందితో మాట్లాడారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పనిచేయాలని సూచించారు.

వేల వాహనాలు... లక్షల్లో భక్తులు

జాతర మొదటి రోజునే భక్తులు భారీగా తరలివచ్చారు. 50 ఎకరాల్లో ఏర్పాటు చేసిన ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణానికి వందలాది బస్సులు వచ్చాయి. ప్రైవేటు వాహనాల కోసం ఏర్పాటుచేసిన 1,462 ఎకరాల పార్కింగ్ స్థలాలు పూర్తిగా నిండిపోయాయి. జంపన్న వాగు వద్ద భక్తులు భారీ సంఖ్యలో పుణ్యస్నానాలు ఆచరించారు. ఆలయం వద్ద క్యూలైన్లు కిక్కిరిసి పోయాయి.

మహారాష్ట్రలో కుప్పకూలిన విమానం
డిప్యూటీ సీఎం అజిత్ పవార్ దుర్మరణం

- మొదటి పేజీ తరువాయి

సాంకేతిక లోపం కారణం గానే ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తోం ది. ముంబై నుంచి బయల్దేరిన గంట తర్వాత విమానంలో సమస్య తలెత్తింది. ఎమర్జెన్సీ ల్యాండింగ్ సమయంలో విమానం అదుపుతప్పి కూలిపోయింది. ఆ వెంటనే భారీగా మంటలు చెలరేగాయి. ప్రమాద తీవ్రతకు విమానం రెండు ముక్కలైనట్లు సమాచారం. విమాన ప్రమాదం పై డీజీసీఏ స్పందించింది. విమానంలో ఎవరూ బతికి లేరని వెల్లడించింది. అజిత్ పవార్, ఇద్దరు వ్యక్తిగత సిబ్బంది, ఇద్దరు విమాన సిబ్బంది ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపింది. అజిత్ పవార్ 1959 జులై 22న జన్మించారు. ఆయన తండ్రి అనంత్‌రావ్ పవార్.. మహారాష్ట్ర మాజీ సీఎం శరద్ పవార్కు సోదరుడు. బాబాయి శరద్ పవార్ అడుగుజాడల్లో రాజకీయాల్లో కి అడుగుపెట్టిన అజిత్పవార్.. 1982లో తొలిసారి కార్పొరేటివ్ షుగర్ ఫ్యాక్టరీ బోర్డుకు ఎన్నికయ్యారు. ఆ తర్వాత 16 ఏళ్ల పాటు పుణె జిల్లా సెంట్రల్ కోఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మ న్గా వ్యవహరించారు. 1991లో తొలిసారి బారామతి పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి లోక్సభకు ఎన్నికయ్యారు. అనంతరం శరద్ పవార్ కోసం ఆ సీటును త్యాగం చేసి.. రాష్ట్ర రా జకీయాల్లోకి వచ్చారు. 1991 ఉప ఎన్నికల్లో బారామతి అసెంబ్లీ స్థానం నుంచి గెలుపొం దారు. ఈ నియోజకవర్గం నుంచి ఏడుసార్లు మహారాష్ట్ర ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ప్రస్తుతం సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ నేతృత్వంలోని మహాయుతి ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు.

ఇది ప్రమాదమే.. కుట్ర కాదు

మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఎన్సీపీ అధినేత అజిత్ పవార్ విమాన ప్రమాదంలో మృతి చెందిన ఘటనపై సీనియర్ నాయకుడు శరద్ పవార్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. ఇది కేవలం ప్రమాదం మాత్రమేనని, దీని వెనుక ఎలాంటి కుట్ర లేదని ఆయన స్పష్టం చేశారు. "అజిత్ పవార్ మరణంతో మహారాష్ట్రకు తీరని నష్టం వాటిల్లింది. ఒక సమర్థుడైన నాయకుడిని ఈ రోజు మనం కోల్పోయాం. ఈ లోటు ఎప్పటికీ పూడ్చలేనిది" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు."అన్నీ మన చేతుల్లో ఉండవు. కొన్ని సంఘటనల వెనుక ఎలాంటి రాజకీయం ఉండదు. దయచేసి ఈ విషయాన్ని రాజకీయం చేయవద్దు. ఈ బాధను మహారాష్ట్ర, మనమందరం ఎప్పటికీ భరించాల్సిందే" అని శరద్ పవార్ అన్నారు. కాగా, అజిత్ పవార్ ప్రయాణిస్తున్నది వీఎస్ఆర్ ఏవియేషన్‌కు చెందిన బాంబార్డియర్ లియర్ జెట్- 45 విమానంగా అధికారులు గుర్తించారు. ప్రమాద స్థలంలో దట్టమైన పొగలు కమ్ముకున్న దృశ్యాలు టీవీ ఛానళ్లలో ప్రసారమయ్యాయి.

ఈ ఒప్పందం ద్వారా భారత్‌దే పైచేయి అవుతుంది

భారత్-యూరోపియన్ యూనియన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై అమెరికా స్పందించింది. ఈ మేరకు అగ్రరాజ్యం వాణిజ్య ప్రతినిధి జెమిసన్ గ్రీర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి సంబంధించి కొన్ని వివరాలను పరిశీలించానని, దీని వల్ల భారత్‌కే ఎక్కువ ప్రయోజనం ఉంటుందని అన్నారు. ఐరోపా మార్కెట్‌లో భారత్‌కు ఎక్కువ అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. దీంతో ఈ ఒప్పందం ద్వారా భారత్‌ది పైచేయి అవుతుందని అన్నారు.భారతీయ నిపుణులకు ఐరోపా దేశాల్లో ఎక్కువ అవకాశాలు లభిస్తాయని ఆయన అన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దేశీయ ఉత్పత్తులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని గుర్తు చేశారు. మా దేశంలోకి దిగుమతి అయ్యే ఉత్పత్తులపై అధిక టారిఫ్ విధిస్తుండటంతో పలు దేశాలు తమ ఉత్పత్తుల కోసం ఇతర మార్కెట్ల వైపు చూస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ఈయూ, భారత్ మధ్య ఒప్పందం కుదిరినట్లు వెల్లడించారు.

గల్లీ నుంచి ఢిల్లీ వరకు కేసీఆర్ మీద చెప్పే అబద్ధం అదే

- మొదటి పేజీ తరువాయి

కేసీఆర్ హయాంలో రూ.3.5 లక్షల కోట్ల అప్పులు అయ్యాయని తేలిందని, అందులో కేసీఆర్ గద్దెను ఎక్కే నాటికి రూ.72 వేల కోట్ల అప్పు తెలంగాణకు ఉందని తెలిపారు. అంటే కేసీఆర్ పదేళ్ల కాలంలో చేసిన అప్పు రూ.2.5 లక్షల కోట్లు మాత్రమే అన్నారు. ఆ అప్పు తో కూడా ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారని తెలిపారు.ఆరూరి రమేశ్ 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజారిటీతో విజయం సాధించారని, కానీ 2023లో 16 వేల ఓట్లతో ఓడిపోయారని అన్నారు. కానీ ఈసారి భారీ మెజారిటీతో వర్ధన్నపేటలో ఆరూరి రమేశ్ గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అయితే దయచేసి కొత్త, పాత అని చూడవద్దని, అందరినీ సమన్వయం చేసుకుని ముందుకు వెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ఈ రోజు ఓపిక లేని, తెలివి లేని వ్యక్తి రాష్ట్రాన్ని పాలిస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి అన్నారు.నిత్యం కేసీఆర్‌పై విమర్శలు చేయడం తప్ప ఏదీ లేదని అన్నారు. రేవంత్ రెడ్డి ఈ రెండున్నర సంవత్సరాలలో లక్షల కోట్ల అప్పులు చేసి ఏం చేశారని ప్రశ్నించారు. రైతు బంధు ఎగ్గొట్టారని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూడా అమలు చేయలేదని అన్నారు. అయినప్పటికీ అప్పులు ఎందుకయ్యాయని ప్రశ్నించారు.మున్సిపల్ ఎన్నికలు మొదలు ప్రతి ఎన్నికల్లో ప్రజలు కేసీఆర్‌ను చూసి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. టిక్కెట్ ఎవరికి ఇచ్చారనే విషయం ఆలోచించవద్దని, గులాబీ కండువా కప్పుకుని వస్తే కేసీఆర్‌గా భావించి ఓటు వేయాలని సూచించారు. కుటుంబం అన్నాక విభేదాలు ఉంటాయని, కానీ బీఫామ్ ఇచ్చాక అందరూ కలిసి పోవాలని అన్నారు. 'గులుగుడు గులుగుడే గుద్దుడు గుద్దుడే' అని వ్యాఖ్యానించారు.

కడియం శ్రీహరి కారణంగానే పార్టీ నుంచి వెళ్లిపోయా:
బీఆర్ఎస్‌లో చేరిన ఆరూరి రమేశ్

- మొదటి పేజీ తరువాయి

మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్ బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ, కడియం శ్రీహరి లాంటి వ్యక్తుల వల్లే తాను పార్టీ నుంచి బయటకు వెళ్లవలసి వచ్చిందని అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో అనేక మంది మీద బురద చల్లి వారు రాజకీయంగా ఎదగకుండా చేసిన వ్యక్తి కడియం శ్రీహరి అని ఆరోపించారు. ఎన్నికల ముందు రేవంత్ రెడ్డితో ములాకత్ కుదుర్చుకొని, వరంగల్ జిల్లాలో అనేక మంది ఓటమికి కారణమైన వ్యక్తి కడియం శ్రీహరి అన్నారు. ఆయన కాంగ్రెస్ పార్టీ కోసం కోవర్టుగా పని చేశారని ఆరోపించారు. ఆయన చేసిన మోసం వల్ల ఫలితాలు బీఆర్ఎస్‌కు ఎలా వచ్చాయో అందరికీ తెలుసని, అందుకే పార్లమెంట్ ఎన్నికల సమయంలో తాను బయటకు వెళ్లానని అన్నారు. ఇప్పుడు ఆ పాపాత్ముడు బయటకు పోయాడు కాబట్టి తిరిగి సొంత ఇంటికి వచ్చానని అన్నారు. చిన్నప్పుడు పిల్లవాడు తప్పిపోయిన తర్వాత తిరిగి ఇంటికి వస్తే ఎలా సంబరం ఉంటుందో ఇప్పుడు పార్టీలో, తనకు అంతటి సంతోషం ఉందని అన్నారు.

ఆరూరి రమేశ్ పోవడానికి కారణం అదే: ఎర్రబెల్లి దయాకర్ రావు

ఆరూరి రమేశ్ బీఆర్ఎస్ నుంచి వెళ్లిపోవడానికి కడియం శ్రీహరి కారణమని ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. కడియం శ్రీహరి వంటి మోసపూరిత వ్యక్తికి టిక్కెట్ ఇచ్చారనే ఆవేదనతోనే అతను పార్టీ నుంచి వెళ్లిపోయాడని అన్నారు. కానీ కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులపై ఎప్పుడూ ఆయనకు కోపం లేదని అన్నారు. భవిష్యత్తులో ఎన్నిక ఏదైనా బీఆర్ఎస్‌ను గెలిపించుకుంటామని అన్నారు.

వికసిత్ భారత్‌కు 2026 పునాది సంవత్సరం

- మొదటి పేజీ తరువాయి

నిలుస్తుందని ఆమె అభివర్ణించారు. గత దశాబ్ద కాలంలో భారత్ అన్ని ప్రధాన రంగాలలో తన పునాదులను పటిష్ఠం చేసుకుందని, భవిష్యత్ వృద్ధికి బలమైన మార్గాన్ని నిర్మించుకుందని పేర్కొన్నారు.బంకించంద్ర ఛటర్జీ రచించిన 'వందేమాతరం' గీతం 150 ఏళ్లు పూర్తి చేసుకున్న వేడుకలను ఆమె గుర్తుచేశారు. శ్రీ గురు తేజ్ బహదూర్ జీ 350వ షహీదీ దివస్, బిర్సా ముండా, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాలను ప్రస్తావించారు. దేశం తన పూర్వీకుల సేవలను గౌరవించుకున్నప్పుడు, యువతరంలో స్ఫూర్తి రగులుతుందని, అది అభివృద్ధి చెందిన భారత్ దిశగా దేశ ప్రయాణాన్ని వేగవంతం చేస్తుందని రాష్ట్రపతి తెలిపారు. కాగా, సమావేశాలకు ముందు మంగళవారం

రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం జరిగింది. సభా కార్యకలాపాలు సజావుగా సాగేందుకు సహకరిస్తామని నేతలు హామీ ఇచ్చారు. ఓట్ల దొంగతనం ఆరోపణలు, ఓటర్ల జాబితా సవరణ, ధాన్యం సేకరణ, ఉపాధి హామీ పథకం వంటి ప్రజా సమస్యలపై దృష్టి సారిస్తామని కాంగ్రెస్ పార్టీ ఈ సమావేశంలో తెలిపింది.

అమెజాన్‌లో 16వేల మంది ఉద్యోగులు తొలగింపు

- మొదటి పేజీ తరువాయి

ఈ విషయాన్ని సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ బెత్ గలెటీ అధికారికంగా వెల్లడించారు. 2023 తర్వాత ఈ స్థాయిలో ఉద్యోగులను తొలగించడం ఇదే తొలిసారి. అప్పుడు దాదాపు 27వేల మందికి అమెజాన్ లేఆఫ్‌లు ప్రకటించిన విషయం తెలిసిందే.తొలగింపు ప్రక్రియలో భాగంగా.. కార్పొరేట్ ఉద్యోగుల స్థానంలో జనరేటివ్ ఏఐను వినియోగించే యోచనలో ఉన్నట్లు అమెజాన్ పేర్కొంది. కరోనా సమయంలో తీసుకున్న ఉద్యోగుల సంఖ్యలో భారీగా కోత విధిస్తున్నట్లు తెలిపింది. పలు విభాగాలను తగ్గించి, భాగస్వామ్యం పెంచడం, పాలనా వ్యవస్థలను తొలగించే ప్రక్రియ చేపట్టినట్లు వెల్లడించింది. అయితే, ఏయే విభాగాల్లో ఈ తొలగింపులు ఉంటాయనే విషయంపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు.అక్టోబర్‌లో చేపట్టిన సంస్థాగత మార్పులు పూర్తయ్యాయని వెల్లడించిన గలెటీ.. అంతర్గతంగా కొత్త రోల్ వెతుక్కునేందుకు అమెరికా ఉద్యోగులకు 90 రోజుల గడువు ఇస్తున్నామని చెప్పారు. ఆలోగా కొత్త రోల్‌ను ఎంచుకోని వారికి నిబంధనల ప్రకారం ఇతర ప్రయోజనాలు అందిస్తామన్నారు. ఈ మార్పులు చేస్తూనే వ్యూహాత్మక విభాగాల్లో నియామకాలు కొనసాగిస్తామన్నారు.

బీఆర్ఎస్‌కు రాజీనామా చేయలేదు..

వ్యక్తిగత హోదాలో కాంగ్రెస్ సమావేశానికి వెళ్లా: దానం నాగేందర్

బీఆర్ఎస్ పిటిషన్‌పై అఫిడవిట్ దాఖలు చేసిన దానం నాగేందర్

మీడియాలో వచ్చిన కథనాల ఆధారంగా బీఆర్ఎస్ నేను పార్టీ మారినట్లు భావిస్తోందని వెల్లడి

బీఆర్ఎస్ పార్టీకి తాను రాజీనామా చేయలేదన్న దానం నాగేందర్

హైదరాబాద్ పెన్ పవర్:నేను బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేయలేదని, 2024 మార్చిలో వ్యక్తిగత హోదాలో కాంగ్రెస్ పార్టీ సమావేశానికి వెళ్లానని, దీంతో మీడియాలో వచ్చిన కథనాల ఆధారంగా నేను పార్టీ మారినట్లు బీఆర్ఎస్ భావిస్తోందని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పీకర్ ప్రసాద్ కుమార్ వద్ద అఫిడవిట్ దాఖలు చేశారు. బీఆర్ఎస్ దాఖలు చేసిన అనర్హత పిటిషన్‌పై ఆయన ఈ అఫిడవిట్ దాఖలు చేశారు. పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డారన్న పిటిషన్‌ను కొట్టివేయాలని సభాపతిని కోరారు. 2023లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసి గెలిచానని, ఆ పార్టీకి తాను రాజీనామా చేయలేదని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. పార్టీ నుంచి తనను సస్పెండ్ చేసిన విషయం కూడా తనకు తెలియదని అన్నారు. ఓసారి కాంగ్రెస్ సమావేశానికి వెళ్లినప్పటికీ వ్యక్తి గత హోదాలో వెళ్లానని పేర్కొన్నారు. ఆ పార్టీ అనర్హత పిటిషన్‌లోని అంశాలపై మాత్రమే వివరణ ఇస్తున్నట్లు తెలిపారు. గతంలో కోర్టు తీర్పులను అనుసరించి తన అనర్హత పిటిషన్ చెల్లుబాటు కాదని అన్నారు.అనర్హత పిటిషన్ తర్వాత పరిణామాలను అనుబంధ సమాచారంగా అంగీకరించవద్దని దానం నాగేందర్ తన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. కాగా, ఈ నెల 30న విచారణకు హాజరు కావాలని దానం నాగేందర్‌కు స్పీకర్ ప్రసాద్ కుమార్ నోటీసులు జారీ చేశారు.

చిన్నారిపై వీధి కుక్కల దాడి ఘటన.. మానవ హక్కుల కమిషన్ సీరియస్

హైదరాబాద్ పెన్ పవర్:ఖైరతాబాద్ లో చిన్నారిపై వీధి కుక్క దాడి ఘటనపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ సీరియస్ అయ్యింది. దినపత్రికల్లో వచ్చిన న్యూస్ ఆధారంగా కేసును సుమోటోగా విచారణకు స్వీకరించింది కమిషన్. చిన్నారిని తీవ్రంగా గాయపరిచిన ఘటనపై విచారణకు ఆదేశించారు కమిషన్ జ్యుడీషియల్ సభ్యులు శివాడి ప్రవీణ . ఈ దాడి పిల్లల భద్రత , జీవించే హక్కును పరిగణలోకి తీసుకుంది కమిషన్. జీహెచ్ఎంసి పరిధిలో వీధి కుక్కల దాడులు , వాటి నియంత్రణకు తీసుకున్న చర్యలపై నివేదికను కోరింది కమిషన్ . ఫిబ్రవరి 24లోగా నివేదిక సమర్పించాలని జీహెచ్ఎంసి కమిషనర్ కు ఆదేశాలు జారీ చేసింది కమిషన్ .జనవరి 27న ఖైరతాబాద్ బడా గణేష్ వెనుక శ్రీనివాస్ నగర్‌ఎలో ఓ చిన్నారిపై కుక్కల దాడిలో చిన్నారి గాయపడిన ఘటన స్థానికంగా విషాదం నింపింది. ఇంటి ముందు అడుకుంటుండగా వీధి కుక్కలు దాడి చేశాయి. ప్రస్తుతం బంజారాహిల్స్‌శ్రీలోని రెయిన్ బో ఆసుపత్రిలో చిన్నారి శార్విక చికిత్స అందిస్తున్నారు. చిన్నారి యూకేజీ చదువుతున్నట్లు స్థానికులు తెలిపారు.

హైదరాబాద్ నగరంలో చాలా కాలనీల్లో రాత్రయితే చాలు కుక్కలు వీర విహారం చేస్తున్నాయి. గుంపులుగుంపులుగా తిరుగుతూ కనిపించిన వారిపై మూకుమ్మడిగా వేటాడి కరుస్తున్నాయి. ముఖ్యంగా నగరంలోని జంక్షన్లు, మురుగు కాలువలు, చెత్తకుప్పల వద్ద నుంచి నడుచుకుంటూ వెళ్లే వారిని వదలకుండా దాడులు చేస్తున్నాయి.కుక్కల దాడుల్లో అనేకమంది చిన్నారులు, మహిళలు గాయాలపాలవ్వడంతో ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు కూడా ఉన్నాయి. బైక్‌ఎలపై వెళ్లే వారి వెంట బడడంతో అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి.

మేడారంలో భక్తులకు ధరల షాక్..

ఆకాశాన్నంటిన రేట్లు.. చెట్టు నీడకూ అద్దె వసూలు!

- ప్రారంభమైన మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతర
- భక్తులను బెంబేలెత్తిస్తున్న ఆకాశాన్నంటిన ధరలు
- కోళ్లు, మేకల ధరలు రెట్టింపు.. గదుల అద్దెలు వేలల్లో
- చెట్టు కింద నీడకు కూడా అద్దె వసూలు చేస్తున్న వైనం
- ధరల నియంత్రణకు అధికారులు చర్యలు చేపట్టాలని భక్తుల విజ్ఞప్తి

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధి చెందిన మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతర అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. నాలుగు రోజుల పాటు జరిగే ఈ వేడుకకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. అయితే, వనదేవతలను దర్శించుకోవడానికి వచ్చిన భక్తులకు ధరల మోత తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. జాతర పరిసరాల్లో నిత్యావసరాల నుంచి బస చేసే గదుల వరకు అన్ని ధరలు ఆకాశాన్నంటడంతో సామాన్య భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కోడి, మేకల ధరలు రెట్టింపు.. భక్తుల జేబులకు చిల్లు

జాతరలో అమ్మవార్లకు మొక్కుగా బెల్లం (బంగారం)తో పాటు కోళ్లు, మేకలను సమర్పించడం ఆనవాయితీ. దీన్నే అదునుగా చేసుకున్న వ్యాపారులు ధరలను

-4 లో

గిన్నిస్ రికార్డులకు ఎక్కేలా 'గనుల మూసివేత' చేపట్టాలి

కలెక్టర్లకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సూచన

- మిగతా 4లో...

కరీంనగర్ కార్పొరేషన్ లో కాంగ్రెస్ జెండా ఎగరాలి

హైదరాబాద్ పెన్ పవర్:బుధవారం (జనవరి 28) కరీంనగర్ డీసీసీ ఆఫీసులో మున్సిపల్ ఎన్నికల్లో పోటీకి ఆశావహులతో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు మంత్రి పొన్నం ప్రభాకర్. ఈ సమావేశంలో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు పొన్నం ప్రభాకర్. ప్రజా పాలన ప్రభుత్వం లో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో గ్రామాల వలె పట్టణాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక తో ముందుకు పోతున్నామని అన్నారు. ఇప్పటికే పట్టణాల్లో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని... కరీంనగర్ కార్పొరేషన్ లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని అన్నారు పొన్నం ప్రభాకర్.కరీంనగర్ కార్పొరేషన్ లో అభ్యర్థుల ఎంపికకు 66 సీట్లలో సర్వే జరుగుతుందని.. ఎవరికివారు అంచనా వేసుకోండని ఆశావహులకు సూచించారు. రాష్ట్రంలో ఎక్కడికెళ్లినా ప్రజా పాలనపై ప్రజలు పాజిటివ్ గా ఉన్నారని.. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజల్లో వివరిస్తూ పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని అన్నారు. ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించామని.. ఇప్పటి వరకు ప్రభుత్వం ఆర్టీసీకి 9 వేల కోట్లు చెల్లించిందని అన్నారు.200 యూనిట్ల ఉచిత విద్యుత్,సన్న బియ్యం పంపిణీ,నూతన రేషన్ కార్డులు పంపిణీ, రైతులకు రైతు భరోసా, రైతు రుణమాఫీ,ఉద్యోగాల నియామకాలు , సన్న వడ్లు బోనస్, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, నియోజకవర్గానికి 3, 500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు, లాంటి ఎన్నో పథకాలు అమలు చేస్తుందని అన్నారు. పోటీ చేసే ఆశావహులు వార్డుల్లో తిరుగుతూ బలోపేతం చేయాలని..టికెట్ ఎవరికి వచ్చినా..అందరూ కలిసి సమన్వయం చేసుకుంటూ గెలవాలని అన్నారు.

-4 లో

బేగంపేటలో ఆసియాలోనే అతిపెద్ద ఎయిర్ షో ప్రారంభం

హైదరాబాద్ పెన్ పవర్:ఆసియాలోనే అతిపెద్ద ఎయిర్ షో 'వింగ్స్ ఇండియా 2026' కు హైదరాబాద్ వేదిక అయ్యింది. హైదరాబాద్ బేగంపేటలో జనవరి 28 నుంచి 31 వరకు జరగనున్న ఈ ఎయిర్ షోను పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన రామ్మోహన్ నాయుడు ఈ ఏడాది విమానయాన రంగానికి గొప్పగా ఉంటుందన్నారు. ఆసియాలోనే అతిపెద్ద సదస్సులలో ఇదొకటని చెప్పారు.'భారతీయ విమానయానం' థీమ్ తో కేంద్ర పౌర విమానయాన శాఖ ఈ వేడుక నిర్వహిస్తోంది. డిజైన్ నుంచి విస్తరణ, తయారీ నుంచి నిర్వహణ, చేరిక నుంచి ఆవిష్కరణ, భద్రత నుంచి స్థిరత్వం వరకు ఈ కార్యక్రమం సాగనుంది. ఈ నాలుగు రోజుల వేడుకలో దేశంలో వేగంగా విస్తరిస్తున్న విమానయాన రంగం, ప్రపంచ వ్యాప్తంగా విజయాలు, తయారీ, సేవలు, ఆవిష్కరణ తదితర అంశాలను హైలెట్ చేయనుంది

అంతర్జాతీయ విమానరంగ దిగ్గజ సంస్థలు ఈ వింగ్స్ ఇండియా షోలో పాల్గొనున్నాయి. విమాన ఇంజిన్ తయారీదారులు, ఎంఆర్వోలు, విమానాశ్రయ డెవలపర్లు, ఓఈఎంలు, సాంకేతిక నిపుణులు, శిక్షణ సంస్థలు తరలివచ్చాయి. ఎయిర్ షో తో పాటు స్టాటిక్ ఎయిర్ క్రాఫ్ట్ డిస్ ప్లే, ఫ్లయింగ్, ఏరో బాటిక్ షోలు, సీఈఓ రౌండ్ టేబుల్ మీటింగ్స్, బీ2 బీ, బీ2 జీ సమావేశాలు జరగనున్నాయి. ఏవియేషన్ జాబ్ ఫెయిర్, అవార్డుల ప్రదానం, సాంస్కృతిక నృత్యాలు నిర్వహించనున్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

మేడారంలో భక్తులకు ధరల షాక్..
ఆకాశాన్నంటిన రేట్లు.. చెట్టు నీడకూ అద్దె వసూలు!

-3 పేజీ తరువాయి

విపరీతంగా పెంచేశారు. సాధారణంగా కిలో రూ. 420 పలికే మేకపోతు లైవ్, మేడారంలో రూ. 900 నుంచి రూ. 1000 వరకు విక్రయిస్తున్నారు. ఇక, మటన్ ధర అయితే ఏకంగా రూ. 1500కు చేరింది. బయట మార్కెట్‌లో కిలో రూ. 170–180 ఉండే బ్రాయిలర్ కోడిని ఇక్కడ రూ. 300 నుంచి రూ. 350కి అమ్ముతున్నారు. నాటుకోడి ధర రూ. 700 దాటిపోయింది. జాతర చివరి రోజుల్లో ఈ ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని భక్తులు వాపోతున్నారు.

చుక్కలు చూపిస్తున్న గదుల అద్దెలు

మాంసం ధరలే కాకుండా, బస కోసం ఏర్పాటు చేసుకునే గదుల అద్దెలు కూడా చుక్కలు చూపిస్తున్నాయి. కనీస సౌకర్యాలు లేని చిన్న గదులకు సైతం రోజుకు రూ. 6,000 వరకు వసూలు చేస్తున్నారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. కేవలం ఒక్క ఫ్యాన్ మాత్రమే ఉన్న గదికి వేలకు వేలు చెల్లించాల్సి వస్తోంది.

చెట్ల కింద నీడకు సైతం అద్దె

ఇక ఇళ్లు, గదులు దొరకని వారు సేద తీరేందుకు చెట్ల నీడను ఆశ్రయిస్తుంటే, అక్కడ కూడా దోపిడీ తప్పడం లేదు. జాతర పరిసరాల్లోని తోటల యజమానులు చెట్ల కింద నీడను సైతం అద్దెకు ఇస్తున్నారు. ఓ కుటుంబం వంట చేసుకుని, భోజనం చేయడానికి ఒక చెట్టు కింద నీడ కోసం రూ. 1000 వరకు వసూలు చేస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారు తప్పనిసరి పరిస్థితుల్లో స్థానికంగానే కొనుగోలు చేయాల్సి రావడంతో, వ్యాపారులు ఈ విధంగా ధరలు పెంచి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ దోపిడీని అరికట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

గిన్నిస్ రికార్డులకు ఎక్కేలా 'గనుల మూసివేత' చేపట్టాలి

హైదరాబాద్ పెన్ పవర్: ఖనిజాలు వెలికి తీసిన తర్వాత గనులను పర్యావరణహితంగా మూసేయాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉందని కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని గిన్నిస్‌బుక్ రికార్డుల్లోకి ఎక్కేలా ఉద్యమంలా చేపట్టాలని పిలుపునిచ్చారు. ఆయన బుధవారం దిల్లీలోని తన కార్యాలయం నుంచి దేశవ్యాప్తంగా ఉన్న గనుల ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. జిల్లాల్లో చేపడుతున్న గనుల మూసివేత కార్యక్రమాలు, ఆ అంశంలో గతంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాల అమలు తీరు గురించి అడిగి తెలుసుకున్నారు.

'గనుల మూసివేత తవ్వకాల ముగింపునకు చిహ్నం కాదు. పర్యావరణం, సమాజం, భవిష్యత్తు పట్ల మనం క్రమశిక్షణతో నిర్వహించాల్సిన బాధ్యత. కలెక్టర్లు ప్రత్యేక వ్యూహంతో పర్యావరణ పునరుజ్జీవం, జలవనరుల సంరక్షణ, వాయుకాలుష్య నియంత్రణ, వాతావరణ సమతౌల్యం ఉండేలా మూసివేతను చేపట్టాలి. మూసివేతకు ముందు, తర్వాతి పరిస్థితులకు సంబంధించిన ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో ఉంచాలి' అని సూచించారు. జిల్లా మినరల్ ఫౌండేషన్(డీఎంఎఫ్) నిధులతో గనుల ప్రభావిత ప్రాంతాల్లోని నివాసాలకు సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన కింద సౌర విద్యుత్తు కనెక్షన్లు ఇచ్చేందుకయ్యే ఖర్చును భరించే విషయంపై ఆలోచించాలని కలెక్టర్లకు సూచించారు.

మన శరీరానికి ఎంతో మేలు చేసే అవకాడో.. జామ కాయ
గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడం రోగనిరోధక శక్తిని పెంచడంలో దోహదం

హైదరాబాద్ పెన్ పవర్:

మన శరీరానికి జామ, అవకాడో రెండు కూడా ఎంతో మేలు చేస్తాయి. అలాగే ఇవి ఎన్నో పోషకాలను కలిగి ఉంటాయి. ఇవి రెండు కూడా వేరు వేరు ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. జామకాయలలో ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ సి వంటి పోషకాలతో పాటు తక్కువ క్యాలరీలు ఉంటాయి. రోగనిరోధక శక్తిని పెంచడంలో, జీర్ణక్రియను మెరుగుపరచడంలో, బరువు తగ్గడంలో ఇలా అనేక రకాలుగా జామకాయలు మన ఆరోగ్యానికి మేలు చేస్తాయి. అలాగే అవకాడో కూడా మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. దీనిలో ఆరోగ్యకరమైన కొవ్వులతో పాటు పొటాషియం, మెగ్నీషియం, విటమిన్ ఇ వంటి పోషకాలు ఉంటాయి. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో, రోగనిరోధక శక్తిని పెంచడంలో అనేక రకాలుగా అవకాడో మనకు సహాయపడుతుంది. ఇవి రెండు కూడా మన ఆరోగ్యానికి మేలు చేసేవే అయినప్పటికి బరువు తగ్గడంలో, చర్మ ఆరోగ్యాన్ని పెంపొందించడంలో, శరీర ఆరోగ్యానికి ఏది మేలు చేస్తుందో ఇప్పుడు తెలుసుకుందాం.

బరువు తగ్గేందుకు..

పోషకాల పరంగా 100 గ్రాముల జామకాయలో 68 క్యాలరీలు, మన శరీర అవసరాలకు మించిన విటమిన్ సి, ఫోలేట్, పొటాషియం, లైకోపీన్, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. 100 గ్రాముల అవకాడోలో 160 కిలో క్యాలరీలు, ఒలీక్ ఆమ్లం, ఆరోగ్యకరమైన కొవ్వులు, మెగ్నీషియం, బి కాంప్లెక్స్ విటమిన్స్ తో పాటు విటమిన్ కె, ఇ వంటి పోషకాలు ఉంటాయి. జామకాయలో తక్కువ క్యాలరీలతో పాటు ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. రోగనిరోధక శక్తికి, జీర్ణక్రియకు జామకాయ అనువైనది అయితే మెదడు, గుండె ఆరోగ్యానికి అవకాడో అనువైనది. కనుక మన శరీర అవసరాలకు తగినట్టు ఎంపిక చేసుకోవడం మంచిది. బరువు తగ్గాలనుకునే వారు జామకాయను తీసుకోవడం మంచిది. దీనిలో క్యాలరీలు తక్కువగా, ఫైబర్ ఎక్కువగా ఉంటుంది కనుక దీనిని తీసుకోవడం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. త్వరగా ఆకలి వేయకుండా ఉంటుంది. దీనిని తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెరలు కూడా వేగంగా పెరగకుండా ఉంటాయి. ఇక అవకాడో ఆరోగ్యకరమైనదే అయినప్పటికీ దీనిలో 250 నుండి 300 క్యాలరీల వరకు ఉంటాయి. దీనిని తీసుకోవడం వల్ల శరీర బరువు పెరిగే అవకాశం ఉంది. కనుక దీనిని పావు లేదా అర ముక్క మోతాదులో మితంగా తీసుకోవాలి. బరువు తగ్గాలనుకునే వారు అవకాడోను చిన్న మొత్తంలో తీసుకోవడం మంచిది.

రోగనిరోధక శక్తి, చర్మం, జుట్టు ఆరోగ్యం..

అదే విధంగా శరీర రోగనిరోధక శక్తిని పెంచడంలో జామకాయ ముందు ఉంటుందని చెప్పవచ్చు. దీనిలో అధిక మొత్తంలో ఉండే విటమిన్ సి తెల్లరక్తకణాల ఉత్పత్తిని పెంచడంలో, కొల్లాజెన్ ఉత్పత్తిలో, రోగనిరోధక శక్తిని పెంపొందించడంలో సహాయపడుతుంది. జామకాయను తీసుకోవడం వల్ల వృద్ధాప్య ఛాయలు తగ్గడంతో పాటు కంటి ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. చర్మం, జుట్టు ఆరోగ్యాన్ని కాపాడడంలో అవకాడో ముందంజలో ఉంటుందని చెప్పవచ్చు. దీనిలో ఉండే ఆరోగ్యకరమైన కొవ్వులు చర్మం, జుట్టు ఆరోగ్యాన్ని కాపాడడంలో సహాయపడతాయి. రోగనిరోధక శక్తి, చర్మం, జుట్టు ఆరోగ్యాన్ని కాపాడడంలో దాదాపు రెండు పండ్లు కూడా మనకు మేలు చేస్తాయి.

దేనిని ఎంచుకోవాలి..

జామ, అవకాడో రెండు కూడా మనకు అనేక భిన్నమైన ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. జామకాయ మనకు అందరికీ అందుబాటు ధరల్లో లభిస్తుంది. అవకాడో కొద్దిగా ధర ఎక్కువగా ఉంటుంది. దీనిని అందరూ కొనుగోలు చేసి తీసుకోలేరు. బరువు తగ్గాలనుకునే వారు, జీర్ణక్రియను మెరుగుపరుచుకోవాలనుకునే వారు జామకాయను ఎంచుకోవడం మంచిది. గుండె ఆరోగ్యం కోరుకునే వారు, చర్మం, జుట్టు ఆరోగ్యాన్ని కోరుకునే వారు అవకాడోను తీసుకోవడం మంచిది. జామకాయను అల్పాహారంలో భాగంగా లేదా మధ్యాహ్నం రిఫ్రెష్ ఫ్రూట్ గా తీసుకోవచ్చు. భోజనం లేదా స్నాక్స్ గా అవకాడోను తీసుకోవచ్చు. మన శరీర అవసరాలను బట్టి మన ఆర్థిక పరిస్థితిని బట్టి సరైన ఆహారాన్ని ఎంచుకోవడం ముఖ్యమని వైద్యులు సూచిస్తున్నారు.

నామినేషన్ ప్రక్రియను సందర్శించిన
జిల్లా కలెక్టర్ కె. హైమావతి

సిద్దిపేట: పెన్ పవర్:సాధారణ మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి చేర్యాల పట్టణంలోని పాత ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన పురపాలక సంఘం మరియు దుబ్బాక మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన నామినేషన్ ప్రక్రియను ను జిల్లా ఎన్నికల అధికారి మరియు కలెక్టర్ కె. హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ. మునిపాలిటీ ఎన్నికలు నిర్వహించడానికి రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేశారు. మన జిల్లాలో చేర్యాల, గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్ మున్సిపాలిటీలో బుధవారం నుండి 3 రోజుల పాటు ఉదయం 10.30 నుండి సాయంత్రం 5 గంటల వరకు ఆయా మున్సిపల్ సెంటర్ లో నామినేషన్ స్వీకరించడం జరుగుతుంది. 4 మున్సిపాలిటీల్లో 72 వార్డులలో 176 పోలింగ్ స్టేషన్ లలో ఫిబ్రవరి 11 వ తేదీన పోలింగ్, 13 వ తేదీన కౌంటింగ్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. స్టేట్ ఎలక్షన్ కమిషన్ నియమావళి ప్రకారం సెంటర్ చుట్టు 100 మీటర్లలో 144 సెక్షన్ అమలుతో పాటు నామిని అభ్యర్థితో పాటు ఇద్దరిని మాత్రమే లోపలికి పంపించాలని పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. నామిని అభ్యర్థి సెంటర్ కి వచ్చిన సమయం నుండి నామినేషన్ వేసి బయటికి వెళ్ళే సమయాన్ని నోట్ చేసుకుని మొత్తం ప్రక్రియను వీడియో తీయించాలని మున్సిపల్ కమిషనర్లు ఆదేశించారు. నామినేషన్ సెంటర్ లో ఫోన్ అనుమతి లేదని అన్ని సెంటర్లలో 100 శాతం వెబ్ కాస్టింగ్ చేస్తున్నామని తెలిపారు.

53లైసెన్స్ తుపాకులు కలిగి ఉన్న వ్యక్తులు స్థానిక పోలీస్ స్టేషన్ లో డిపాజిట్ చేయాలి

సిద్దిపేట పెన్ పవర్:

పోలీస్ కమిషనర్ ఎస్. రష్మీ పెరుమాళ్ మాట్లాడుతూ స్థానిక సంస్థల సాధారణ మున్సిపల్, ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున లైసెన్స్ తుపాకులు కలిగి ఉన్న వ్యక్తులు వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ లో 31-01-2026 రోజు లోపు డిపాజిట్ చేయాలి. ఎన్నికల కోడ్ పూర్తయిన తర్వాత తిరిగి నిబంధనల ప్రకారం తీసుకొని వెళ్లవచ్చును. 31.01.2026 లోపు తుపాకులు డిపాజిట్ చేయని వారిపై రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ ఆదేశానుసారం తగు చర్యలు తీసుకోవడం జరుగుతుంది. పారదర్శకంగా నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణ గురించి అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ఎలక్షన్ కమిషన్ ఆదేశాలను ప్రజలు, ప్రజా ప్రతినిధులు, తూచా తప్పకుండా పాటించాలని సూచించడమైనదని, ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్న మండలాల హుస్నాబాద్, చేర్యాల, దుబ్బాక, గజ్వేల్, సరిహద్దులో నాలుగు చెక్ పోస్టులు ఏర్పాటు చేయడం జరిగింది, 24శ7 వాహనాలు తనిఖీ నిర్వహించడం జరుగుతుందని కమిషనర్ అన్నారు.

విచారణకు రండి...
దానం, పాడె కౌశిక్ లకు స్పీకర్ ఆఫీసు నోటీసులు

హైదరాబాద్, జనవరి 28: పెన్ పవర్:తెలంగాణ రాజకీయాల్లో ఫిరాయింపుల వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ బుధవార నోటీసులు జారీ చేశారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి సైతం స్పీకర్ నోటీసులు జారీ చేయడం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ అవుతోంది. జనవరి 30న విచారణకు హాజరు కావాలని తన నోటీసుల్లో స్పీకర్ పేర్కొన్నారు. దానం నాగేందర్ బీఆర్ఎస్ గుర్తు మీద గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరారని, ఆయనపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి గతంలో ఫిర్యాదు చేయడం తెలిసిందే. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరపున గెలిచిన దానం నాగేందర్, అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరారు. దానం నాగేందర్ 2024 పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ సైతం చేయడం అప్పట్లో రాజకీయ వర్గాల్లో దుమారం రేపింది. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం ఆయనపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ నేతలు స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. మరోవైపు, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై కూడా క్రమశిక్షణారాహిత్యం,ఇతర రాజకీయ కారణాలతో ఫిర్యాదులు అందాయి. హైకోర్టు గతంలోనే ఫిరాయింపుల ఫిర్యాదులపై నిర్ణీత కాలపరిమితి లోగా చర్యలు తీసుకోవాలని స్పీకర్ కార్యాలయాన్ని ఆదేశించిన క్రమంలో దానం నాగేందర్‌తో పాటు కౌశిక్ రెడ్డికి సైతం నోటీసుల జారీకి ప్రాధాన్యత ఏర్పడింది.మొత్తం 10 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ పార్టీ నుంచి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు ఫిర్యాదులు వచ్చాయి. విషయం సుప్రీంకోర్టు వరకు వెళ్లగా చర్యలు తీసుకోవాలని, లేక ఆయన నిర్ణయం తెలపాలని స్పీకర్ ను కోర్టు పలుమార్లు ఆదేశించింది. అనర్హత పిటిషన్లు ఎదుర్కొన్న వారిలో బండ్ల కృష్ణ మోహన్, అరికపూడి గాంధీ, గూడెం మహిపాల్ రెడ్డి, ప్రకాష్ గౌడ్, తెల్లం వెంకట్రావు, పోచారం శ్రీనివాస్ రెడ్డి, కాలే యాదయ్యలకు తెలంగాణ స్పీకర్ ఇదివరకే క్లీన్ చిట్ ఇచ్చారు. వీరిని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగా గుర్తిస్తున్నట్లు ప్రకటించడం తెలిసిందే. మిగతా ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, డాక్టర్ సంజయ్ లకు సంబంధించి స్పీకర్ విచారణ చేయాల్సి ఉంది.

ఫ్లాట్ల ధరావతు రిఫండ్‌లో తాత్సారం

అమీర్‌పేట, జనవరి 28 పెన్ పవర్:ఖైరతాబాద్‌కి చెందిన నాగరాజు ప్రైవేటు ఉద్యోగి. ఇటీవల గచ్చిబౌలిలో హౌసింగ్ బోర్డు నిర్వహించిన ఫ్లాట్ల లాటరీకి రెండు దరఖాస్తులు సమర్పించి, రూ.లక్ష చొప్పున ధరావతు (డిపాజిట్) చెల్లించాడు. అధికారులు తీసిన లాటరీలో ఫ్లాట్ దక్కలేదు. నాలుగైదు రోజుల్లో దరఖాస్తు రుసుం రిఫండ్ అవుతుందని భావించినా.. 20 రోజులు గడిచినా వెనక్కి రాలేదు. ఇలా చాలామంది తాము చెల్లించిన ధరావతు సొమ్ము కోసం ఎదురుచూస్తున్నారు. గచ్చిబౌలిలోని మూడు ప్రదేశాల్లో తెలంగాణ హౌసింగ్ బోర్డు (టీజీహెచ్‌బీ) దిగువ ఆదాయ వర్గాలకు (ఎల్ఐజీ) ఫ్లాట్లను విక్రయించింది. ఈనెల 6న జరిగిన లాటరీలో 111 మందికి ఫ్లాట్లను కేటాయించింది. లాటరీలో ఫ్లాటు దక్కనివారికి వారంరోజుల్లో ధరావత్తు సొమ్ము తిరిగి ఇస్తామని టీజీహెచ్‌బీ అధికారులు అప్పట్లో చెప్పారు. ఇప్పటికీ రిఫండ్ కాకపోవడంతో దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు.

పశువులకు ఉచిత వైద్యం: కోయిలదిన్నెలో శిబిరం

ఆలంపూర్, జనవరి 2 పెన్ పవర్:జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలంలోని కోయిలదిన్నె గ్రామంలో బుధవారం ఉచిత పశు వైద్య, గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం జరిగింది. మండల పశు వైద్య అధికారి డాక్టర్ స్వరూపరాణియాదవ్ మాట్లాడుతూ, పాడి పశువుల సంక్షేమానికి, రైతు కుటుంబాల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ శిబిరంలో 13 పశువులకు గర్భకోశ పరీక్షలు, 12 లేగదూడలకు నట్టల నివారణ మందులు, 7 పశువులకు సాధారణ చికిత్సలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ గోకారి, లైవ్ స్టాక్ అధికారి పి. వరప్రసాద్, గోపాలమిత్ర సూపర్ వైజర్ సూర్యారెడ్డి, అటెండర్లు, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామోహన్ రెడ్డికి రథోత్సవానికి ఆహ్వానం

మక్తల్, జనవరి 28 పెన్ పవర్:నారాయణ పేట జిల్లా మక్తల్ మండలం గుర్లపల్లి గ్రామ ఎల్లాలింగేశ్వర కల్మరం జాతర సందర్భంగా శనివారం నిర్వహించే రథోత్సవ కార్యక్రమానికి హాజరుకావాలని కోరుతూ మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామోహన్ రెడ్డికి గ్రామ పెద్దలు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా జాతరలో స్వామివారికి ప్రత్యేక పూజలతో పాటు విశేష కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. మాజీ ఎమ్మెల్యే ఈ ఆహ్వానానికి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి గ్రామ పెద్దలు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

కృత్రిమ మేధతో ఉపాధి అవకాశాలు మెరుగే

ఖైరతాబాద్, జనవరి 28 పెన్ పవర్: ఈనాడు,హైదరాబాద్: కృత్రిమమేధతో సాఫ్ట్‌వేర్ సహా ఇతర రంగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు తగ్గిపోతాయన్నది అపోహ మాత్రమేనని, కృత్రిమమేధ సహకారంతో ఉద్యోగాలు పెరుగుతాయని హైదరాబాద్‌లోని నెక్ట్‌వేవ్ సంస్థ సహ వ్యవస్థాపకుడు రాహుల్ అట్లూరి అన్నారు. సాఫ్ట్‌వేర్ సంస్థల్లో 9.2మిలియన్ల ఉద్యోగాలు తగ్గిపోతుండగా... కొత్తగా 17.2 మిలియన్ల ఉద్యోగాలు రాబోతున్నాయని వివరించారు. దావోస్‌లోని వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో పాల్గొని హైదరాబాద్‌కు తిరిగి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా భారత్, ఇతర దేశాల్లో ఇంజినీరింగ్ విద్యలో మార్పులు వస్తున్నాయని భారత్ సహా విదేశాల్లోని విశ్వవిద్యాలయాలు, విద్యా సంస్థలు విద్యతోపాటు నైపుణ్యాలపై శిక్షణ ఇచ్చేందుకు కొత్త కోర్సులను ప్రవేశపెడుతున్నారని తెలిపారు.

కరీంనగర్ కార్పొరేషన్ లో కాంగ్రెస్ జెండా ఎగరాలి

-3 పేజీ తరువాయి

రాజకీయాల్లో విశేష అనుభవం ఉన్న తుమ్మల నాగేశ్వరరావు కరీంనగర్ ఇంచార్జి గా ఉన్నారని..సెలెక్ట్ ఎలెక్ట్ ద్వారా మీకు మీరే వార్డుల్లో అభ్యర్థులను ఎంపిక చేసుకోవాలని అన్నారు. కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ కైవసం చేసుకునేలా కృషి చేయాలని అన్నారు పొన్నం ప్రభాకర్.

నేర రహిత సమాజానికి సీసీ కెమెరాలు చాలా ముఖ్యం:

మహబూబాబాద్ టౌన్ ఇన్స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి

మహబూబాబాద్: పెన్ పవర్: ప్రజల భద్రత, నేరాల నియంత్రణ కోసం మహబూబాబాద్ బస్టాండ్ వద్ద మహబూబాబాద్ టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో స్థానిక రోటరీ క్లబ్ సహకారంతో నాలుగు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టౌన్ ఇన్స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి మాట్లాడుతూ బస్ స్టాండ్ పరిసరాల్లో ప్రయాణికుల భద్రతను పెంపొందించేందుకు మరియు నేరాలను నియంత్రించేందుకు, ప్రధాన ప్రవేశ/నిష్క్రమణ ద్వారాలు, మరియు ప్లాట్ఫారమ్లపై ఆధునిక సిసిటివి కెమెరాలను ఏర్పాటు చేశామని. ఇవి అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడంలో, నేరస్థులను వేగంగా గుర్తించడంలో పోలీస్ శాఖకు సహాయపడతాయని, మహిళలు, వృద్ధుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన రోటరీ క్లబ్ సభ్యులను ఇన్స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి అభినందించారు.

మహారాష్ట్ర నుంచి యాదాద్రికి పులి జర్నీ

నల్గొండ, జనవరి 28, పెన్ పవర్:
మహారాష్ట్ర సరిహద్దుల నుంచి బయలుదేరిన ఓ మగ పులి.. తెలంగాణలోని 19 జిల్లాల మీదుగా 375 కిలోమీటర్లు ప్రయాణించి యాదాద్రి జిల్లాకు చేరుకుంది. గత 50 ఏళ్లలో ఈ ప్రాంతంలో పులి ఆనవాళ్లు కనిపించడం ఇదే తొలిసారి. అటవీ శాఖ అధికారులు అప్రమత్తమై ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు.మహారాష్ట్ర సరిహద్దుల నుంచి బయలుదేరిన ఒక మగ పులి.. తెలంగాణ అడవుల గుండా సుమారు 375 కిలోమీటర్ల సుదీర్ఘ ప్రయాణం చేస్తూ ప్రస్తుతం యాదాద్రి జిల్లాకు చేరుకుంది. తిప్పేశ్వర్ వన్యప్రాణి అభయారణ్యం నుంచి ప్రారంభమైన ఈ పులి ప్రయాణం.. గత రెండు నెలలుగా రాష్ట్రంలోని సుమారు 19 జిల్లాల మీదుగా సాగుతూ ఇప్పుడు యాదాద్రి భువనగిరి జిల్లాలో అడుగుపెట్టింది. రాజధాని హైదరాబాద్‌కు కేవలం 60 కిలోమీటర్లు, ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్టకు కేవలం 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న దత్తాయిపల్లి రిజర్వ్ ఫారెస్ట్‌లో పులి పాదముద్రలు కనిపించడంతో అటవీ శాఖ యంత్రాంగం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. గడిచిన 50 ఏళ్ల కాలంలో ఈ ప్రాంతంలో పులి ఆనవాళ్లు కనిపించడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం.

వన్యప్రాణి నిపుణుల విశ్లేషణ ప్రకారం.. మగ పులులు సాధారణంగా తమకంటూ ఒక ప్రత్యేకమైన సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేసుకోవడానికి లేదా ఆడ తోడు కోసం ఇలాంటి సుదీర్ఘ ప్రయాణాలు చేస్తుంటాయి. అందుకోసమే మహారాష్ట్రలోని తిప్పేశ్వర్ నుంచి పెన్‌గంగా నదిని దాటి ఆదిలాబాద్‌లోని బోథ్ మండలంలోకి ప్రవేశించిన ఈ పులి.. అక్కడి నుంచి నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి, సిద్దిపేట జిల్లాల గుండా ప్రయాణించింది. ఒకానొక దశలో పులి తిరిగి మహారాష్ట్రకు వెళ్ళిపోయిందని అధికారులు భావించినప్పటికీ.. అది అనూహ్యంగా రూట్ మార్చుకుని దట్టమైన పొదలు, వాగుల గుండా యాదాద్రి జిల్లాకు చేరుకుంది. సాధారణంగా ఇలాంటి ప్రయాణాల్లో పులులు పగటిపూట విశ్రాంతి తీసుకుంటూ.. రాత్రి వేళల్లోనే సగటున 18 నుంచి 20 కిలోమీటర్లు నడుస్తుంటాయి.పులి సంచారంపై సమాచారం అందిన వెంటనే పీసీసీఎఫ్ నుంచి క్షేత్రస్థాయి సెక్షన్ ఆఫీసర్ల వరకు అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. దత్తాయిపల్లి, గంధమల్ల, కోనాపూర్, ఇబ్రహీంపూర్ వంటి సమీప గ్రామాల ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు. ముఖ్యంగా రైతులు పొలాలకు వెళ్లేటప్పుడు సమూహాలుగా వెళ్లాలని.. పశువులను అడవికి సమీపంలో కట్టేయకూడదని సూచించారు. ఈ పులి తన ప్రయాణ మార్గంలో ఇప్పటికే సుమారు 5 నుంచి 10 పశువులను వేటాడి ఉండవచ్చని పాదముద్రలు, మల విసర్జితాల ఆధారంగా అంచనా వేస్తున్నారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. అధికారులు ఎన్ని కెమెరా ట్రాప్‌లు, బోనులు ఏర్పాటు చేసినా ఈ పులి ఇప్పటివరకు వాటికి చిక్కకుండా తన ఉనికిని చాటుతోంది.
తెలంగాణలో ఇటీవల కాలంలో పులుల సంఖ్య, సంచారం గణనీయంగా పెరగడం సానుకూల పరిణామంగా కనిపిస్తోంది. ప్రస్తుతం అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో సుమారు 37 పులులు ఉండగా.. కవ్వాల్ రిజర్వ్‌లో 6 నుంచి 8 వరకు ఉన్నట్లు సమాచారం. వీటితో పాటు పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌ల నుంచి పులులు రాకపోకలు సాగిస్తున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో ఒక పులి 8 నెలలుగా, మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేటలో మరో పులి 6 నెలలుగా స్థిర నివాసం ఏర్పరుచుకోవడం రాష్ట్ర అటవీ సంపదకు నిదర్శనం. పులుల కదలికలను నిరంతరం పర్యవేక్షించేందుకు అటవీ శాఖ ప్రతి డివిజన్‌కు 10 నుంచి 15 కెమెరా ట్రాప్‌లను ఏర్పాటు చేసి ప్రత్యేక నిఘా ఉంచింది.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్ కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

మూసాపేటలో ముక్తదీర్ బాబా ఉర్సు ఉత్సవాలు ఘనంగా

దేవరకద్ర, జనవరి 28 పెన్ పవర్: మూసాపేట మండల కేంద్రంలో రాత్రి హజరత్ ముక్తదీర్ బాబా ఉర్సు ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. బాబా ఇంటి నుంచి ఊరేగింపుగా బయలుదేరిన గ్రంథం దర్గా చేరుకోగా, నైవేద్యం, ఫతేహ దువా, పూల సమర్పణ వంటి కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం గ్రామ పెద్దలను సన్మానించారు. ప్రతి ఏటా కులమతాలకు అతీతంగా మతసామరస్యానికి ప్రతీకగా ఈ ఉత్సవాలు జరుగుతాయి. బుధవారం దర్గాలో దీపారాధన కార్యక్రమం కూడా జరిగింది.

సీఎం కప్ పోటీలు ప్రారంభం: క్రీడాకారులకు ప్రోత్సాహం

దేవరకొండ, జనవరి 28 పెన్ పవర్: నాంపల్లి మండలంలోని జడ్.పి.హెచ్.ఎస్ లో బుధవారం చీఫ్ మినిస్టర్ కప్ మండల స్థాయి పోటీలను నాంపల్లి ఎంపీడీవో రామకృష్ణ శర్మ, ఎంఈఓ మల్లికార్జునరావు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. గ్రామీణ స్థాయిలో క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసి అంతర్జాతీయ స్థాయికి చేర్చాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సీఎం కప్ చేపట్టిందని, ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని వారు తెలిపారు. ఈ పోటీలు ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యాయి.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన తాసిల్దార్ శాంత

నిజామాబాద్ అర్బన్, జనవరి 28 పెన్ పవర్: ధర్పల్లి మండలంలోని రామడుగు ప్రాజెక్టు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మధ్యాహ్నం తాసిల్దార్ శాంత విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని, వంటశాల వార్డులతో మాట్లాడి పరిశీలించారు. ప్రతిరోజూ పౌష్టికాహారం అందించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని వంటశాల సిబ్బందికి ఆమె సూచించారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యాన్ని సహించబోనని తాసిల్దార్ శాంత స్పష్టం చేశారు.

ఉత్తర తిరుమలలో వార్షికోత్సవాలు

నిజామాబాద్ రూరల్, జనవరి 28 పెన్ పవర్: నిజామాబాద్‌లోని గంగస్థాన్ ఫేజ్-2లో ఉత్తర తిరుమల వార్షికోత్సవాలు నేటి నుంచి ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ సభ్యుల తెలిపిన వివరాల ప్రకారం, ఈ వారోత్సవాల్లో భాగంగా ఫిబ్రవరి 29న శ్రీనివాసుని శేష వాహన ఊరేగింపు, మార్చి 30న హనుమంతుని వాహన సేవ, 31న శ్రీనివాస కళ్యాణం, ఫిబ్రవరి 2న చక్రతీర్థం, మహా పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించబడతాయి. ఈ వార్షికోత్సవాలు భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని అందించనున్నాయి.

నామినేషన్ల ప్రక్రియ షురూ

వికారాబాద్, జనవరి 28 పెన్ పవర్: మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా వికారాబాద్ మున్సిపల్ కార్యాలయం ఆవరణలో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. పట్టణంలో మొత్తం ఓటర్లు 58,013 ఉండగా అందులో పురుషులు 28,701, మహిళలు 29,285, ఉన్నట్లు మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి తెలిపారు. నామినేషన్ల స్వీకరణ కోసం పటిష్ట ఏర్పాట్లు చేశామని ఆయన పేర్కొన్నారు.

మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే

మేడ్చల్, జనవరి 28 పెన్ పవర్: మున్సిపల్ ఎన్నికల ప్రచార నోటిఫికేషన్ వెలువడటంతో భారాస నేతలు ప్రచారంలో దూకుడు పెంచారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి ఎల్లంపేట మున్సిపాలిటీల్లో బుధవారం నిర్వహించిన ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. పుర పరిధిలోని ఎల్లంపేట్, లింగాపూర్, బర్మాజిగూడ, శ్రీరంగవరం వార్డుల్లో భారాస అభ్యర్థుల తరపున ఆయన ప్రచారం చేశారు. భారాస అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

పార్టీలు హైడ్రామా.. అభ్యర్థుల్లో టెన్షన్

అదిలాబాద్, జనవరి 28, పెన్ పవర్:
రాష్ట్ర ఎన్నికల కమిషన్ మున్సిపల్ ఎన్నికల గంట మోగించింది. ఎన్నికల కోడ్ అమలు చేయడమేకుండా ఎన్నికల షెడ్యూల్ అధికారికంగా ప్రకటించింది. ఎన్నికల ప్రక్రియ బుధ వారంతో ప్రారంభమై వచ్చేనెల 13న ఎన్నికల ఫలితాలతో ముగిసే విధంగా షెడ్యూలు ఖరారైంది. దీంతో జిల్లాలో మున్సిపల్ ఎన్నికల హడావుడి ప్రారంభం అయింది .నిర్మల్ జిల్లా లో నిర్మల్, బైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీ లు ఉండగా నిర్మల్ జనరల్ మహిళకు ఖానాపూర్ బైంసా మున్సిపాలిటీలను జనరల్ కు కేటాయించారు. నిర్మల్ మున్సిపాలిటీలో మొ త్తం 42 వార్డులు, బైంసాలో 26 ఖానాపూర్ లో 12 వార్డులు ఉండగా ఇప్పటికీ ఎస్సీ ఎస్టీ బీసీ జనరల్ స్థానాలను అధికారికంగా ప్రకటించారు. నిర్మల్ జిల్లాలో మొత్తం 1,69,285 ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. నిర్మల్‌లో 42 వార్డులు, బైంసాలో 26, ఖానాపూర్‌లో 12 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి.రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ ఎన్నికలకు షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో రాజకీయ పార్టీలో హైడ్రామా నెలకొనగా పోటీ చేసే అభ్యర్థులు టెన్షన్ పరమమైంది. మున్సిపల్ ఎన్నికలను అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు బిజెపి భారత రాష్ట్ర సమితి ఎంఐఎం ప్రధాన పార్టీలతో పాటు ఆమ్ ఆద్మీ కమ్యూనిస్టులు జనసేన తదితర పార్టీలు ఎన్నికల బరిలో తమ అభ్యర్థులను నిలబెట్టేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నాయి. ఇప్పటికే బీఆర్ఎస్ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా మార్గండా యోగిత పేరును అధికారికంగా ప్రకటించడం కాంగ్రెస్ పార్టీ నుంచి దాదాపు అప్పల గణేష్ చక్రవర్తి పేరు ఖరారైంది. ఇక సెట్టింగ్ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి నిర్మల్‌లో బిజెపి అభ్యర్థిత్వంపై ఇంకా స్పష్టత ఇవ్వలేదు.ఖానాపూర్, భైంసా మున్సిపాలిటీలో అక్కడ సెట్టింగ్ ఎమ్మెల్యేలు రామారావు పటేల్, బొజ్జు పటేల్ మున్సిపల్ స్థానాలను కైవసం చేసుకునేందుకు అభ్యర్థుల ఎంపికపై దృష్టి పెట్టారు. కాంగ్రెస్ బిజెపిలో ఆశావాదులు ఎక్కువగా ఉండటంతో ఒక్కొక్క వార్డు నుంచి నలుగురు పోటీ చేసేందుకు దరఖాస్తు చేసుకున్నారు అయితే నామినేషన్ల ప్రక్రి య బుధవారం నుండి ప్రారంభ కాలు నేపథ్యంలో అభ్యర్థుల ఎంపికపై

పార్టీలో ప్రతిష్ట నెలకొంది. ఇప్పటికే ఆయా వార్డుల్లో తమకి టికెట్లు వస్తాయన్న ధీమతో పార్టీ అభ్యర్థులు ప్రచారం కూడా చేపడుతున్నారు. అయితే ఇందులో ఎవరికి బీఫామ్ వస్తే వారే ఆ పార్టీ అభ్యర్థిగా బరిలో దిగనున్నారు. నామినేషన్ల ప్రక్రియ మూడు రోజుల్లో మిగిలి ఉన్న నేపథ్యంలో పార్టీ ఫిరాయింపుల అంశం పార్టీలకు కీలకంగా మారే అవకాశం ఉంది.
రాష్ట్ర ఎన్నికలకు సంఘం మున్సిపల్ ఎన్నికలకు షెడ్యూలు ప్రకటించడంతో నామినేషన్ల స్వీకరిస్తున్నారు. ఈనెల 20 నుంచి 30 వరకు నామినేషన్ల స్వీకరణ, 31 31న పరిశీలన చేపట్టనున్నారు. 1న తప్పుడు నామినేషన్ల రిజెక్ట్ చేయనున్నారు. వచ్చేనెల 2న అప్పిల్ అవకాశం అవకాశం కల్పించారు. 3 న నామినేషన్ల ఉపసంహరణ, అదే రోజు సాయంత్రం పోటీచేసే అభ్యర్థుల జాబితా విడుదల చేయనున్నారు. 11న కౌం టింగ్ నిర్వహించి 13న ఫలితాలను వెల్లడించనున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్మల్ జిల్లాలో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియను సమర్థవంతం గా నిర్వహించుకునేందుకు అన్ని శాఖ ల సమన్వయంతో జిల్లా అధికారులు చర్య లు ప్రారంభించారు.

పట్టు కోసం గులాబీ ఎత్తులు

అదిలాబాద్, జనవరి 28, పెన్ పవర్:
'పోగొట్టుకున్న చోటనే వెతుక్కోవాలన్నట్టు' గులాబీపార్టీ పుర ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా భావిస్తుంది. చేజారిన పురపాలన పగ్గాలను తిరిగి సాధించుకోవ డం కోసం మాస్టర్ ప్లాన్‌తో ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ రంగంలోకి దూకుతుంది. మున్సిపాలి టీలోని 34 వార్డుల్లో బలమైనా, ప్రజల్ని ప్రభావితం చేసే యువకులను అభ్యర్థులుగా పోటీ లోకి దింపనున్నట్లు సమాచారం. 2023 శాసనసభ ఎన్నికల్లో పరాభవానికి గురైన బీఆర్ఎస్ స్థానిక ఎన్నికలను పూర్వవైభవం తెచ్చుకోవడానికి ప్రతిష్టాత్మకంగా భావి స్తున్నదనీ విశ్లేషకులు అంటున్నారు. స్థానిక ఎన్నికలు సర్పంచ్, వార్డ్ మెంబర్ల ఎన్నికల అంకంతో స్థానిక పోరు మొదలైంది. దాని కొనసాగింపుగా.. మరో స్థానిక ఎన్నికలు రానే వచ్చాయి. పంచాయతీ ఎన్నికల్లో బిఆర్ఎస్ సాధించిన ఫలితాలు, అధికార పార్టీకి ఇచ్చిన గట్టిపోటీ రాజకీయ భవిష్యత్తుకు ఆశాజనకంగా గులాబీ శ్రేణులు భావిస్తున్నారు. మున్సి పల్ ఎన్నికల్లో మరింత దూకుడు పెంచే అవకాశం ఉంది. అందుకోసం వ్యూహ ప్రతి వ్యూహాల్లోనూ.. బీఆర్ఎస్ బిజీగా ఉంది. బలమైన గెలుపు గుర్రాలు అందుకు ప్రధాన ఆయుధాలుగా ఎంచుకుంటున్నది.కాంగ్రెస్ పార్టీ అధికా రంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు దాటిన నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే గడ్డం వినోద్ పనితీరు పట్ల సహజంగానే కొంత అసంతృప్తులు, అసమ్మతులు, విమర్శలను మూటకట్టుకున్నారని కాంగ్రెస్ శ్రేణుల్లోనే అభిప్రాయాలున్నాయి. స్థానికంగా ఎమ్మెల్యే ఉండకపోవడం, అతని పీఏల పనితీరుకు తోడు కాంగ్రెసులోని సీనియర్లను పట్టించుకోవడం లేదని అసంతృప్తులు ఆయనను విమర్శలకు గురిచేశాయి. ఈ గ్యాప్‌ను కూడా ప్రతిపక్ష పార్టీగా

బీఆర్ఎస్ వ్యూహాత్మకంగా పూర్తి స్థాయిలో వినియోగించుకొని ఎన్నికల్లో పై చేయి సాధించటానికి ప్రయత్నిస్తోంది. అయితే అది అంత సులువుగా జరిగే పని కాద నీ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇంతకాలంగా బీఆర్ఎస్ ప్రేక్షక పాత్రలో ఉండ టం కూడా కొంత మైనస్‌గా ఆ పార్టీకి లేకపోలేదు.
మారిన రిజర్వేషన్ల నేపథ్యంలో బెల్లంపల్లి మున్సిపాలిటీలో కొత్త అభ్యర్థులే అన్ని పార్టీలకు దిక్కయ్యారు. ప్రధాన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు జనరంజకమైన, సమర్థవంతమైన అభ్యర్థుల వేటలో ఉన్నాయి. కొన్ని వార్డుల్లో అభ్యర్థుల కొరత కూడా ఇరు పార్టీలకు ఇబ్బందికరంగా పరిణమించింది. మున్సిపల్ ఎన్నిక ల్లో నువ్వా నేనా అనే రీతిలో తలపడే పరిస్థితి ఈ రెండు పార్టీల మధ్యనే కనిపిస్తోంది. ఎలాం టి పరిస్థితులు ఎదురైన గట్టి పోటీ ఇచ్చి, మెజార్టీ స్థానాలు కైవసం చేసుకుని పురపాలన పగ్గాలను తిరిగి చేపట్టాలన్నదే బీఆర్ఎస్ ప్రధా న టార్గెట్‌గా కనిపిస్తుంది. మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఈ దిశగా అభ్యర్థుల జాబితాను ఇప్పటికే రెడీ చేసుకున్నట్లు తెలుస్తుంది.అధికార పార్టీపై స్థానికంగా తలెత్తిన వ్యతిరేకత, ఎమ్మెల్యే గడ్డం వినోద్ రాజకీయ, వ్యవహారిక బలహీనతలు మునిసిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పై ప్రభావం చూపే పరిస్థితీ కనిపిస్తోంది. ఈ అసంతృప్తి బీఆర్ఎస్‌కు ఏ మేరకు లాభిస్తాయో? బిఆర్ఎస్ పట్ల ప్రజల ఆదరణ ఈ ఎన్నికల్లో ఎన్ని స్థానాల్లో నిలబెడుతుందోనన్నది ఆసక్తిగా మారింది. ఒకటి మాత్రం నిజం. ఈ ఎన్నికలు అటు ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు ఇటు బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యకు రాజకీయంగా జీవన్మరణమని పరిశీలకులు భావిస్తున్నారు.

కారులో బయల్దేరిన 8 మంది స్నేహితులు.. గమ్యం చేరకుండానే..

హైదరాబాద్, జనవరి 28 పెన్ పవర్:
హైదరాబాద్ నగర సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఉప్పల్-నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ పై వేగంగా దూసుకొచ్చిన ఓ కారు అదుపుతప్పి పిల్లర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఇద్దరు యువకులు అక్కడి కక్కడే మృతి చెందగా.. మరి కొందరు గాయపడ్డారు. గమనించిన స్థానికులు వారిని హాస్పిటల్‌కు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.బుధవారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులు మృతి చెందిన ఘటన హైదరాబాద్ నగర సమీపంలోని ఉప్పల్-నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ పై వెలుగు చూసింది. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను స్వాధీనం చేసుకొని పోస్ట్‌మార్టం నిమిత్తం హాస్పిటల్‌కు తరలించారు. అయితే ప్రమాద సమయంలో సుమారు 8 మంది విద్యార్థులు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. ప్రమాదంలో గాయపడిన వారిని స్థానిక హాస్పిటల్‌కు తరలించారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సాయి వరుణ్, నిఖిల్, వెంకట్, రాకేశ్, యశ్వంత్, సాత్విక్, హర్షవర్ధన్, అభినవ్ అనే 8 మంది యువకులు కారులో బుధవారం ఉదయం మౌలాలి నుంచి పోచారం వైపు వెళ్తున్నారు. అయితే కారు వేగంగా ఉండడంతో ఉప్పల్-నారపల్లి ఎలివేటెడ్ కారిడార్‌పైకి రాగానే అదుపుతప్పి 97వ పిల్లర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సాయి వరుణ్, నిఖిల్ ది
అక్కడికక్కడే మృతి చెందగా.. వెంకట్, రాకేష్ స్వల్పంగా గాయపడ్డారు. మిగతా స్నేహితులకు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు.స్థానికుల సమాచారంతో వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు గాయపడిన వెంకట్, రాకేశ్‌ను సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మృతదేహాలను వెలికితీసి పోస్ట్‌మార్టం నిమిత్తం గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. ఘటనా స్థలంలో ఉన్న కారును తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణ బరిలో ఎవరికి వారే... మిత్రపక్షాల మధ్య బేధాలు

హైదరాబాద్, జనవరి 28, పెన్ పవర్:

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల వేళ జనసేన పార్టీ తీసుకున్న నిర్ణయం రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. జనసేన పార్టీ ఒంటరిగా రంగంలోకి దిగాలని నిర్ణయించుకోవడం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారి తీస్తోంది. జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి నేతృత్వంలో పార్టీ ఇప్పటికే దూకుడు పెంచింది. బుధవారం నుంచే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుండటంతో, పార్టీ అభ్యర్థుల ఎంపికను దాదాపు పూర్తి చేసింది. ఇప్పటికే ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించిన పార్టీ బరిలోకి దిగేదుకు సిద్ధమైంది. ఏపీలో అద్భుతమైన స్ట్రైక్ రేట్ సాధించిన జోష్‌తో, తెలంగాణలోనూ తన సత్తా చాటాలని పవన్ కళ్యాణ్ భావిస్తున్నారుజాతీయ స్థాయిలో ఎన్డీఏ కూటమిలో భాగస్వామిగా ఉన్న జనసేన, తెలంగాణలో మాత్రం బీజేపీని కాదని ఒంటరిగా ముందుకు వెళ్లడం ఆశ్చర్యపరుస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తుతో పోటీ చేసిన ఈ రెండు పార్టీలు, ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల విషయంలో పరస్పరం దూరంగా ఉంటున్నాయి. బీజేపీ సైతం జనసేన పోటీపై ఇప్పటివరకు ఎటువంటి అధికారిక అభ్యంతరం వ్యక్తం చేయకపోవడం, పొత్తుల గురించి ప్రస్తావించకపోవడం చూస్తుంటే.. కమలం పార్టీ కూడా ప్రస్తుతానికి ఒంటరి పోరుకే మొగ్గు చూపుతున్నట్లు

అర్థమవుతోంది.జనసేన పోటీ ప్రధానంగా బీజేపీ ఓట్లకు గండి కొట్టే అవకాశం ఉంది. తెలంగాణలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో బీజేపీకి బలమైన ఓటు బ్యాంకు ఉంది. ఇప్పుడు అదే పట్టణ ఓటర్లలో పవన్ కళ్యాణ్‌కు ఉన్న ఇమేజ్, ముఖ్యంగా యువతలో ఉన్న క్రేజ్ కారణంగా ఓట్లు చీలిపోయే ప్రమాదం కనిపిస్తోంది. జనసేన చీల్చే కొద్దిపాటి ఓట్లయినా అది పరోక్షంగా అధికార కాంగ్రెస్ లేదా ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌కు లాభం చేకూర్చే అవకాశం ఉంది. ఒకవేళ జనసేన తన బలాన్ని నిరూపించుకుంటే, భవిష్యత్తులో తెలంగాణలో మూడో ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగేందుకు ఈ ఎన్నికలు పునాదిగా మారతాయి.జనసేన వ్యూహం కేవలం ఓట్లు చీల్చడమే కాదని, పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసుకోవడమే ప్రథమ లక్ష్యమని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఏపీలో అధికారంలో ఉన్న తమ పార్టీ ఇమేజ్ కీలక మున్సిపాలిటీలు, ఖమ్మం, నిజామాబాద్ వంటి చోట్ల తమకు కలిసి వస్తుందని వారు ఆశిస్తున్నారు. బీజేపీతో పొత్తు లేకపోవడం వల్ల ఆ పార్టీ అసంతృప్త నేతలు కూడా

జనసేన వైపు చూసే అవకాశం ఉందని చెబుతున్నారు. బీజేపీ నాయకత్వం మాత్రం జనసేన ప్రభావం పెద్దగా ఉండదని భావిస్తోంది. అయినప్పటికీ, పట్టణ ప్రాంతాల్లో చీలిపోయే ప్రతి ఓటు గెలుపోటములను తలకిందులు చేసే అవకాశం ఉన్న మున్సిపల్ పోరులో, జనసేన సై అనడం బీజేపీకి మింగుడుపడని విషయమే. ఈ ఫ్రెండ్లీ కాంటెస్ట్ ' మున్సిపల్ ఫలితాల తర్వాత తెలంగాణలో ఎన్డీఏ భవిష్యత్తును ఏ విధంగా మారుస్తుందో వేచి చూడాలి. గతంలో గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో జనసేన పార్టీ అభ్యర్థులు నామినేషన్లు వేశారు. అయితే బీజేపీ నేతలు విజ్ఞప్తి చేశారన్న కారణంగా పోటీ నుంచి విరమించుకున్నారు. ఈ సారి అలా నామినేషన్లు వేసిన తర్వాత ఉపసంహరించుకునే అవకాశం ఉండదని జనసేన వర్గాలు చెబుతున్నాయి.

అంతకంతకు పెరుగుతున్న గ్యాప్

హైదరాబాద్, జనవరి 28, పెన్ పవర్:

తెలంగాణ రాష్ట్రంలో ఒక విచిత్రమైన రాజకీయ పరిస్థితి నెలకొంది. వాస్తవానికి అధికారపక్షం వర్సెస్ ప్రతిపక్షం అన్నట్టుగా రాజకీయాలు సాగుతాయి. కానీ, తెలంగాణ రాష్ట్రంలో స్వపక్షంలోనే విపక్షం ఉండడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. దీనికి తోడు నేతలు ఎవరికి వారుగా మీడియాకు లీకులు ఇస్తున్న నేపథ్యంలో.. ఏం జరుగుతుందో అర్థం కావడం లేదు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పది సంవత్సరాలపాటు అధికారంలో భారత రాష్ట్ర సమితి ఉంది. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. సహజంగానే కాంగ్రెస్ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం అధికంగా ఉంటుంది. అందువల్ల నేతలు ఎవరికి వారు అన్నట్టుగా మాట్లాడుతుంటారు.హై కమాండ్ కూడా ఈ తరహా నేతల విషయంలో చూసీచూడనట్టు వ్యవహరిస్తూ ఉంటుంది. చర్యలు తీసుకునే విషయంలో కాస్త వెనకా ముందు ఆలోచిస్తూ ఉంటుంది. కాంగ్రెస్ పార్టీ హై కమాండ్ అలా చేయడం వల్లే పరిస్థితి ఇప్పుడు ఇక్కడ దాకా వచ్చింది.రేవంత్ రెడ్డి మధ్య, మిగతా మంత్రుల మధ్య గ్యాప్ ఉందని ప్రచారం జరుగుతుంది. అంతకుముందు కొండ సురేఖ, ఇటీవల కోమటిరెడ్డి వెంకటరెడ్డి, భట్టి విక్రమార్క.. వంటి మంత్రులతో రేవంత్ రెడ్డికి గ్యాప్ వచ్చిందని ప్రచారం జరుగుతుంది. ముఖ్యంగా గులాబీ పార్టీ మీడియా, సోషల్ మీడియా ఈ వ్యవహారాలను విపరీతంగా ప్రచారం చేస్తున్నాయి. ఇవి ఎంతవరకు వెళ్లాయంటే.. రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా భట్టి పావులు కదుపుతున్నారనే ప్రచారం దాకా చేరుకున్నాయి. అయితే వీటిని ఖండించాల్సిన నేతలు వినోదం చూస్తుండడంతో.. ఇదంతా నిజమేనని చాలామంది వ్యాఖ్యానిస్తున్నారు.వాస్తవానికి ఇటీవల నైనీ కోల్ వ్యవహారం తెరపైకి వచ్చిన తర్వాత అందరి దృష్టి భట్టివిక్రమార్క మీద కేంద్రీకృతమైంది. దీనికి ప్రధాన కారణం ఆంధ్రజ్యోతి పత్రిక అధిపతి వేమూరి రాధాకృష్ణ రాసిన కొత్త పలుకు. రాధాకృష్ణ ఆ స్థాయిలో రాయడం వెనుక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారని ప్రచారం జరుగుతోంది. దీనికి తోడు భట్టి విక్రమార్కతో కలిసి ఎన్టీవీ చైర్మన్ నరేంద్ర చౌదరి వ్యాపార సాగిస్తున్నారని ఆరోపణలు కూడా వినిపించాయి. ఇవన్నీ కూడా రేవంత్ రెడ్డి వల్ల జరుగుతున్నాయని గులాబీ పార్టీ మీడియా ఆరోపించడం మొదలుపెట్టింది. దీంతో తెరపైకి భట్టి రావాల్సి వచ్చింది. కాకపోతే ఆయన స్వీట్ వార్నింగ్ స్థాయిలో మాట్లాడుకుంటూ వెళ్లిపోయారు. వాస్తవానికి ప్రత్యర్థులు చేస్తున్న విమర్శలు.. మీడియా రాస్తున్న కథనాలు ఘాటుగా ఉంటే.. వాటికి

కాంగ్రెస్ నేతలు ఇస్తున్న బదులు మామూలుగా ఉంటున్నది. అందువల్లే జనాలలో, సమాజంలో రకరకాల ప్రచారాలు జరుగుతున్నాయి. అయితే వీటిని ఖండించాల్సిన సందర్భంలో కాంగ్రెస్ పార్టీ పెద్దలు మౌనాన్ని ఆశ్రయించడం అనేక అనుమానాలకు కారణమవుతోంది.ఇటీవల భట్టి మాట్లాడినప్పుడు ముఖ్యమంత్రికి తనకు మధ్య సానుకూల వాతావరణం ఉంది అన్నట్టుగా వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రిని వెనకేసుకొచ్చే ప్రయత్నం చేశారు. ముఖ్యమంత్రి కూడా వివిధ వేదికలలో మంత్రులకు అనుకూలంగా మాట్లాడారు. తమ ప్రభుత్వంపై ఏవైనా వ్యతిరేక కథనాలు రాయాలి అనుకుంటే తన వివరణ తీసుకోవాలని ముఖ్యమంత్రి ఇటీవల వ్యాఖ్యానించడం కొసమెరుపు. ఏది ఏమైనప్పటికీ మంత్రులతో రేవంత్ రెడ్డికి గ్యాప్ ఉందని గులాబీ పార్టీ మీడియా, గులాబీ నాయకులు అంటుంటే.. అదంతా ఉట్టి ప్రచారమని కాంగ్రెస్ పార్టీ నాయకులు కొట్టి పారేస్తున్నారు. కానీ ఈ గ్యాప్ లో మిగతా వారికి కావాల్సిన వినోదం.. అంతకుమించి అనే స్థాయిలో మసాలా లభిస్తోంది.

సీక్రెట్ కాదు.. అఫిషియల్

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నివాసంలో మంత్రుల భేటీపై సోషల్ మీడియాలో వస్తున్న వార్తలపై రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తీవ్రంగా స్పందించారు. లోక్ భవన్ నుంచి అందరి ముందే తామంతా ఒకే కారులో వెళ్లామని, అలా బహిరంగంగా వెళ్లినప్పుడు అది రహస్య భేటీ ఎలా అవుతుందని ఆయన ప్రశ్నించారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న వ్యక్తుల భేటీకి రాజకీయ రంగులు పులుముతూ విష ప్రచారం చేయడం సరికాదని మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో మండిపడ్డారు.మున్సిపల్ ఎన్నికల్లో అనుసరించాల్సిన పార్టీ వ్యూహాలపై చర్చించడమే ఈ భేటీ ప్రధాన ఉద్దేశమని శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికల సన్నద్ధత అనేది రాజకీయ పార్టీల ప్రాథమిక బాధ్యత అని, దీనిపై చర్చించుకోవడాన్ని తప్పు పట్టాల్సిన అవసరం లేదని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందేందుకే కొందరు కావాలనే ప్రభుత్వంపై అసత్య ప్రచారాలకు ఒడిగడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.పాలనలో సమన్వయం కోసమే తాము సమావేశమయ్యామని, క్యాబినెట్ అనేది ఒక యూనిట్ లాంటిదని మంత్రి వివరించారు. పాలనాపరమైన అంశాల్లో ఎక్కడా జాప్యం జరగకుండా చూడటం సీనియర్ మంత్రులుగా తమ బాధ్యత అని పేర్కొన్నారు. భట్టి విక్రమార్క నివాసంలో జరిగిన చర్చలన్నీ కేవలం ప్రభుత్వం మరియు పార్టీ సమష్టి బాధ్యతలో భాగమేనని, ఇందులో దాపరికాలు ఏమీ లేవని ఆయన తేల్చి చెప్పారు.నిర్మాణాత్మకమైన విమర్శలను తాము ఎప్పుడూ స్వాగతిస్తామని, అయితే కేవలం ఊహాజనిత కథనాలతో వ్యక్తిత్వ హననానికి పాల్పడటం ప్రజాస్వామ్యానికే ప్రమాదకరమని శ్రీధర్ బాబు హెచ్చరించారు. భావితరాల భవిష్యత్తు కోసం ప్రభుత్వం చేస్తున్న కృషిని అడ్డుకోకుండా, ఇలాంటి తప్పుడు ప్రచారాలు మానుకుని రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు.

జీహెచ్ఎంసీ పరిధిలో కొత్త సేవలు

హైదరాబాద్, జనవరి 28, పెన్ పవర్:

ఆధార్ కార్డు పొందాలన్నా లేదా ఆధార్‌లో డేట్ ఆఫ్ బర్త్ అప్డేట్ చేసుకోవాలన్నా జనన ధృవీకరణ పత్రం అనేది తప్పనిసరిగా అవసరం. ఇక పాస్‌పోర్ట్ పొందాలన్నా లేదా ఇతర ప్రభుత్వ సేవలకు జనన ధృవీకరణ పత్రం అనేది ఉపయోగపడుతుంది. డేట్ ఆఫ్ బర్త్ లేదా డెత్ సర్టిఫికేట్ పొందాలంటే ఇప్పటివరకు కఠిన నిబంధనలు అమల్లో ఉండేవి. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. అధికారులు పరిశీలన చేపట్టి డేట్ ఆఫ్ బర్త్ లేదా డెత్ సర్టిఫికేట్ జారీ చేయడానికి చాలా రోజుల సమయం పట్టేంది. ఇప్పుడు ఈ సర్టిఫికేట్ల జారీ మరింత వేగవంతం కానుంది. ప్రజలు సులవుగా వీటిని పొందేలా కొత్త సాఫ్ట్‌వేర్ అప్లికేషన్‌ను తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చింది. తొలుత జీహెచ్ఎంసీ పరిధిలో దీనిని తీసుకొచ్చారు.నగరవాసులు డేట్ ఆఫ్ బర్త్, డెత్ సర్టిఫికేట్లు సులభంగా పొందేలా జీహెచ్ఎంసీ కొత్త అప్లికేషన్ తీసుకొచ్చింది. సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ సహయంతో నూతన సాఫ్ట్‌వేర్‌ను ప్రవేశపెట్టింది. తాజాగా ఈ అప్లికేషన్‌ను జీహెచ్ఎంసీ పరిధిలో లాంచ్ చేశారు. ఈ సాఫ్ట్‌వేర్ ద్వారా నగరంలోని అన్ని ఆస్పత్రులు, నర్సింగ్ హోమ్‌లను అనుసంధానం చేశారు. దీంతో ఏదైనా ప్రాంతంలో జననం లేదా మరణం జరిగినా వెంటనే సంబంధిన వార్డు పరిధిలో ఆటోమేటిక్‌గా నమోదు అవుతుంది. జవసం లేదా మరణం జరిగిన 21 రోజుల్లో ఆస్పత్రులు లేదా కుటుంబసభ్యులు వివరాలను నమోదు చేయాలి. గతంలో ఆస్పత్రుల నుంచి నేరుగా అధికారులు సమాచారం అడగడం వల్ల ప్రక్రియ ఆలస్యమయ్యేది. కానీ ఈ సాఫ్ట్‌వేర్ ద్వారా ఆటోమేటిక్‌గా వివరాలను నమోదయ్యే ప్రక్రియ ప్రవేశపెట్టారు.ఈ కొత్త అప్లికేషన్ ద్వారా వివరాలు వెంటనే నమోదు కావడం వల్ల వెరిఫికేషన్ ప్రక్రియ త్వరగా పూర్తవుతుంది. దీంతో మీ సేవా కేంద్రాల ద్వారా ప్రజలు సులవుగా డేట్ ఆఫ్ బర్త్ లేదా డెత్ సర్టిఫికేట్లను పొందవచ్చన్నమాట. ఇక పేరు, అడ్రస్ మార్పులు కూడా ఈ సాఫ్ట్‌వేర్ వల్ల సులభతరం కానున్నాయి. హైదరాబాద్ ప్రజలందరూ ఈ సేవలను ఉపయోగించుకోవాలని అధికారులు చెబుతున్నారు. ఇటీవల జీహెచ్ఎంసీ పరిధిలోకి కొత్తగా 20 మున్సిపాలిటీలు వచ్చాయి. దీంతో వార్డు సంఖ్య కూడా పెరిగింది. గతంలో 150 వార్డులు ఉండగా.. ఇప్పుడు 300కి పెరిగాయి. దీంతో పాత విధానం ద్వారా సర్టిఫికేట్లను జారీ చేయడం కష్టతరంగా మారింది. దీంతో ప్రభుత్వం కొత్త సాఫ్ట్‌వేర్‌ను అందుబాటులోకి తెచ్చిందని చెప్పవచ్చు.

ప్రైవేట్ సహకారంతో రిజిస్టార్ కార్యాలయాలకు మహర్దశ

హైదరాబాద్, జనవరి 28, పెన్ పవర్:

తెలంగాణలో రెవెన్యూ సేవలను వేగంగా, పారదర్శకంగా అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 11 క్లస్టర్లుగా విభజించి, అత్యాధునిక సౌకర్యాలతో ప్రైవేటు భాగస్వామ్యంతో నిర్మిస్తున్నారు. వివాహ రిజిస్ట్రేషన్లకు మినీ మ్యారేజ్ హాల్, గర్భిణీలకు ఫీడింగ్ రూమ్స్, పిల్లలకు క్రెచ్ వంటి ప్రత్యేక వసతులు కల్పిస్తున్నారు. జిల్లా కేంద్రాల్లోనూ ఇలాంటి భవనాలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. తెలంగాణ ప్రజలకు రెవెన్యూ సేవలను మరింత వేగంగా, పారదర్శకంగా అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం సచివాలయంలో అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్లలో స్వార్థపూరిత నిర్ణయాల వల్ల చిన్నాభిన్నమైన రెవెన్యూ వ్యవస్థను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో సంస్కరిస్తున్నామని వెల్లడించారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో ఉన్న 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 11 క్లస్టర్లుగా విభజించినట్లు మంత్రి తెలిపారు. ప్రభుత్వానికి ఎలాంటి ఆర్థిక భారం పడకుండా, ప్రైవేటు నిర్మాణ సంస్థల సహకారంతో వీటిని అత్యాధునిక హంగులతో నిర్మిస్తున్నామన్నారు. సుమారు 3 నుంచి 5 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించే ఈ కార్యాలయాల్లో కేవలం రిజిస్ట్రేషన్లే కాకుండా, ప్రజల సౌకర్యార్థం అనేక ప్రత్యేక వసతులను కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఈ సమీకృత భవనాల్లో కేవలం ఆఫీసులే కాకుండా సామాజిక అవసరాలకు ప్రాధాన్యతనిచ్చినట్లు పొంగులేటి వివరించా రు. వివాహ రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే వారి కోసం ప్రత్యేకం గా 'మినీ మ్యారేజ్ హాల్' ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గర్భిణీలు, బాలింతల కోసం ఫీడింగ్ రూమ్స్, చిన్న పిల్లల కోసం క్రెచ్ సదుపాయం, వృద్ధులు, దివ్యాంగుల కోసం ఆధునిక లిఫ్ట్ సౌకర్యం, విశాలమైన వెయిటింగ్ ఏరియాలు. ఈ భవనాల నిర్మాణంతో పాటు ఐదేళ్ల నిర్వహణ బాధ్యతను కూడా సంబంధిత నిర్మాణ సంస్థలే చూసుకుంటాయని మంత్రి స్పష్టం చేశారు.రెండో విడతలో జిల్లా కేంద్రాల్లో కూడా ఇలాంటి ఇంటిగ్రేటెడ్ భవనాలను నిర్మించనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఇప్పటికే తాలిమ్‌లో పనులు ముమ్మరంగా సాగుతున్నాయని.. జూన్ 2 నాటికి వాటిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. బుధవారం పటాన్‌చెరు-శంకరపల్లి ప్రధాన రహదారి సమీపంలో రాజపుష్ప కన్‌స్ట్రక్షన్ నిర్మించే భవనానికి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో ఇప్పటికే తీసుకొచ్చిన స్లాట్ బుకింగ్, ఈ-ఆధార్ సంతకం వంటి సౌకర్యాలు ప్రజల సమయాన్ని ఆదా చేస్తున్నాయని, ఈ సంస్కరణలు ప్రజల జీవితాల్లో నిజమైన మార్పు తీసుకొస్తాయని పొంగులేటి ధీమా వ్యక్తం చేశారు

మున్సిపాలిటీని ఎమ్మెల్యే సంజయ్ బ్రష్టు పట్టించారు

ధర్మపురి, జనవరి 28 పెన్ పవర్: జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్ లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి మాట్లాడుతూ, జగిత్యాల మున్సిపాలిటీని ఎమ్మెల్యే సంజయ్ బ్రష్టు పట్టించారని, జగిత్యాలను అవినీతికి కేంద్రంగా మార్చారని ఆరోపించారు. ఏసీబీ దాడులు, విజిలెన్స్ విచారణలు అభివృద్ధికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. మున్సిపల్ ఛైర్పర్సన్ సీటు ఖాళీ అయినప్పుడు చట్టంలోని లొసుగులను ఆసరాగా చేసుకుని బలహీన వర్గాల హక్కులను కాజేశారని ఆయన ఆరోపించారు.

జగిత్యాల: మున్సిపల్ ఎన్నికల కోడ్ నియమావళిని పాటించాలి

కోరుట్ల, జనవరి 28 పెన్ పవర్: జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఎన్నికల కోడ్ నియమావళిని అందరూ తప్పనిసరిగా పాటించాలని సూచించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ శేషాద్రిని రెడ్డి, అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్ కూడా పాల్గొని పలు సూచనలు చేశారు.

ఖమ్మం మున్సిపల్ ఎన్నికల కోడ్ అమల్లోకి, పోలీస్ కమిషనర్ ప్రకటన

ఖమ్మం, జనవరి 28 పెన్ పవర్: ఖమ్మం జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో మున్సిపల్ ఎన్నికల ప్రవర్తనా నియమావళి నేటి నుంచి అమల్లోకి వచ్చిందని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. ఎన్నికల నిర్వహణను ప్రశాంతంగా, శాంతిభద్రతలకు ఎలాంటి ఆటంకం లేకుండా నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. కోడ్ ఉల్లంఘనలకు తావులేకుండా నిబంధనలు కఠినంగా అమలు చేస్తామని, అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తును పెంచామని ఆయన స్పష్టం చేశారు.

ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి: కమిషనర్

కొత్తగూడెం, జనవరి 28 పెన్ పవర్: కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలో ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని మున్సిపల్ కమిషనర్ సుజాత బుధవారం తెలిపారు. కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్లను పాల్వంచ, కొత్తగూడెం, సుజాతనగర్లుగా మూడు విభాగాలుగా విభజించారు. ఓటర్ల కోసం 201 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

కౌన్సిలర్ నామినేషన్లో మాజీ ఎమ్మెల్యే

అశ్వారావుపేట, జనవరి 28 పెన్ పవర్: అశ్వారావుపేట 3వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థిగా యు. ఎస్. ప్రకాశ్ రావు, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుతో కలిసి నామినేషన్ పత్రాలను సమర్పించారు. టీడీపీ మద్దతుతో బరిలోకి దిగుతున్న ప్రకాశ్ రావుకు మద్దతుగా మాజీ ఎమ్మెల్యే స్వయంగా హాజరయ్యారు. వార్డును ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని, బీఆర్ఎస్-టీడీపీ కూటమి శ్రేణుల సహకారంతో భారీ విజయం సాధిస్తామని వారు ధీమా వ్యక్తం చేశారు.

చింతకుంట ఆదివాసీ పిల్లల చదువుకు వాహనాలే ఆధారం కావాలి

పినపాక, జనవరి 28 పెన్ పవర్: అశ్వాపురం మండల పరిధిలోని మండల మడుగు పంచాయతీ శివారు చింతకుంటలో నివాసం ఉంటున్న వలస ఆదివాసుల పిల్లలు చదువు కోసం రెండు కిలోమీటర్లు నడిచి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. చదువుపై ఆసక్తి ఉన్నా, నడక భారంగా మారింది. ప్రభుత్వ అధికారులు, పాలకులు, స్వచ్ఛంద సంస్థలు స్పందించి, చిన్నారుల ప్రయాణానికి అవసరమైన వాహనాలను ఏర్పాటు చేసి, వారి చదువుకు ఆటంకం లేకుండా సౌకర్యాలు కల్పించాలని బుధవారం కాలనీవాసులు వేడుకుంటున్నారు.

'డ్యూస్' సర్టిఫికెట్ కోసం అభ్యర్థుల రద్దీ

నర్సాపూర్, జనవరి 28 పెన్ పవర్: నర్సాపూర్ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో, అభ్యర్థులు, ఆశావహులతో పురపాలిక కార్యాలయం కిటకిటలాడుతోంది. నామినేషన్‌కు అవసరమైన 'నో డ్యూస్' సర్టిఫికెట్ కోసం ఇంటి పన్ను, నల్లా పన్ను బకాయిలు చెల్లించి క్లియరెన్స్ పొందుతున్నారు. ఈ రద్దీ దృష్ట్యా అధికారులు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. బకాయిల వసూళ్ల ద్వారా పురపాలిక ఖజానాకు గణనీయమైన ఆదాయం సమకూరుతోంది.

ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి శంకుస్థాపన

పటాన్‌చెరు, జనవరి 28 పెన్ పవర్: ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా అత్యాధునిక వసతులతో నిర్మిస్తున్నామని రాష్ట్ర సమాచార, రెవెన్యూ గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సంగారెడ్డి జిల్లా కర్తనూరు గ్రామంలో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి జిల్లా ఇన్చార్జ్ మంత్రి వివేక్ వెంకట స్వామితో కలిసి శంకుస్థాపన చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చిందన్నారు. దానిలో భాగంగానే ధరణిని రూపుమాపి భూభారతి చట్టాన్ని అమలు చేస్తున్నామన్నారు. వినియోగదారులు ఇబ్బంది పడకుండా ఓఆర్ఆర్ పరిధిలో ఉన్న 39 సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలు.. 11 ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలుగా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. మరో ఆరు నెలల్లో అధునాతన వసతులతో 20వేల ఎస్ఎఫ్‌టీల విస్తీర్ణంతో ఈ భవన నిర్మిస్తున్నట్లు తెలిపారు. 11 కార్యాలయాలను కూడా పూర్తి చేస్తామన్నారు.

ఘోర రోడ్డు ప్రమాదం.. ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థులు మృతి

మేడ్చల్:పెన్ పవర్: మేడిపల్లి పీఎస్ పరిధిలో అర్ధరాత్రి అతివేగంగా వచ్చి నడుపుతూ పిల్లర్ నెంబర్ 97 ను కారు ఢీ కొంది. ప్రమాద సమయంలో కారులో 8 మంది విద్యార్థులు వున్నారు. ఇద్దరు విద్యార్థులు అక్కడికక్కడే మృతి చెందారు. ముగ్గురు విద్యార్థులకు తీవ్ర గాయాలు అయ్యాయి. మిగిలిన ముగ్గురు సురక్షితంగా బయటపడ్డారు. వీరంతా వనపర్తి జిల్లాకు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థులుగా గుర్తించారు. సంఘటనా స్థలాన్ని చేరుకున్న పోలీసులు గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను గాంధీ ఆసుపత్రికి తరలించారు.

నామినేషన్ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, ఎస్పీ

ఆదిలాబాద్, జనవరి 28 పెన్ పవర్: ఆదిలాబాద్ టీటీడీసీలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను బుధవారం కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్ సందర్శించారు. ప్రక్రియ సజావుగా సాగేలా అధికారులకు సూచనలు చేశారు. అభ్యర్థులకు ఇబ్బంది లేకుండా మౌలిక సదుపాయాలు కల్పించాలని, పటిష్ఠ భద్రత మధ్య పారదర్శకంగా నామినేషన్లు స్వీకరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, కమిషనర్ రాజు, డీఎస్పీ జీవన్ రెడ్డి పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులపై డీఎస్పీ హెచ్చరిక

బోధ్, జనవరి 2 8 పెన్ పవర్: ఆదిలాబాద్ పట్టణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో, సోషల్ మీడియాలో గెలుపోటములపై రెచ్చగొట్టే పోస్టులు, వ్యక్తులను కించపరిచే వ్యాఖ్యలు చేయడం చట్టరీత్యా నేరమని డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి హెచ్చరించారు. అనుమతులు లేకుండా ఫ్లెక్సీలు, తప్పుడు సర్వేలు, అసత్య ప్రచారాలు చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని, సోషల్ మీడియా పర్యవేక్షణకు ప్రత్యేక నిఘా సెల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

గిరిజన యోధుడు కొమురం భీమ్ విగ్రహావిష్కరణ

నిర్మల్, జనవరి 28 పెన్ పవర్: నిర్మల్ జిల్లాలోని వడ్యాల్ గ్రామంలో బుధవారం గిరిజన యోధుడు కొమురం భీమ్ విగ్రహాన్ని సర్పంచ్ నరేష్, వినయ్ రెడ్డిలు ఆవిష్కరించారు. “జల్–జంగిల్–జమీన్” నినాదంతో నిజాం పాలనను ఎదిరించి, భూమి, అడవి, నీరు తమవేనని పోరాడి వీరమరణం పొందిన కొమురం భీమ్ సేవలను వారు కొనియాడారు. ఆయన ఆశయాల స్ఫూర్తితో ముందుకు సాగుదామని వారు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కొమురం భీమ్ విగ్రహాన్ని ఆవిష్కరించి, ఆయన త్యాగాలను స్మరించుకున్నారు.

ముజ్గి మల్లన్న జాతరకు జాతరకు ఎస్పీకి ఆహ్వానం

ముథోల్, జనవరి 28 పెన్ పవర్: నిర్మల్ రూరల్ మండలం ముజ్గి గ్రామంలో వచ్చే నెల ఫిబ్రవరి 1, 2 తేదీల్లో నిర్వహించనున్న మల్లన్న జాతరకు హాజరుకావాలని ఆలయ కమిటీ సభ్యులు జిల్లా ఎస్పీ జానకి షర్మిలను బుధవారం ఆహ్వానించారు. ఈ జాతరకు రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారని, వారి కోసం పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తుందని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీనివాస్, ఆలయ అధ్యక్షులు మల్లేష్, ఎస్సై లింబాద్రి పాల్గొన్నారు.

నిర్మల్ పట్టణంలో ఎమ్మెల్యే ఏలేటి సమక్షంలో బీజేపీలోకి చేరికలు

ఖానాపూర్, జనవరి 28 పెన్ పవర్: నిర్మల్ పట్టణంలోని భాగ్యనగర్ కాలనీకి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కమ్మం సురేందర్, పసులోటి సంఘం అధ్యక్షులు పసులోటి శ్రీనివాస్, సంఘ నాయకులు తిరుపతి, రమణ, నారాయణ, శ్రీహరి, కాలనీవాసులు, యువకులు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి, బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి సమక్షంలో భారతీయ జనతా పార్టీలో బుధవారం చేరారు. ఈ సందర్భంగా వారికి కాషాయ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, నాయకులు రావుల రాంనాథ్, సాదం అరవింద్, భూపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాలుగు వాహనాలు ఒకదానికొకటి ఢీ

జగిత్యాల, జనవరి 28(పెన్ పవర్: జగిత్యాల జిల్లా కేంద్రంలోని కరీంనగర్ ప్రధాన రహదారి టివిఎస్ షోరూం వద్ద బుధవారం అధిక సంఖ్యలో ఉన్న స్పీడ్ బ్రేకర్ల కారణంగా ముందు వెళ్తున్న వాహనం అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో వెనుక వస్తున్న నాలుగు వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న వారికి గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి గాయపడిన వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్పీడ్ బ్రేకర్ల వల్ల తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన గోపన్న మాధవి లత

వేములవాడ, జనవరి 28 పెన్ పవర్: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మున్సిపల్ 28వ వార్డుకు చెందిన గోపన్నగారి మాధవి లత బుధవారం రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. విప్ ఆది శ్రీనివాస్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయం కోసం కృషి చేయాలని సూచించారు. గత పదేళ్లలో గత ప్రభుత్వం వేములవాడ అభివృద్ధిని విస్మరించిందని, ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి కాంగ్రెస్ అభ్యర్థులకు అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు.

వీర్నపల్లి మండల ఆదర్శ పాఠశాలలో సీఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభం

సిరిసిల్ల, జనవరి 28 పెన్ పవర్: వీర్నపల్లి మండల ఆదర్శ పాఠశాల ఆవరణలో బుధవారం సీఎం కప్ క్రీడా పోటీలను స్థానిక సర్పంచ్ మల్లారపు జ్యోత్స్న అరుణ్ కుమార్, ఏఎంసీ చైర్మన్ రాములు నాయక్, ఎంపిడివో శ్రీలేఖ ప్రారంభించారు. క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని, క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడా స్ఫూర్తిని చాటాలని వారు పిలుపునిచ్చారు. గ్రామీణ క్రీడాకారులలోని నైపుణ్యాన్ని వెలికితీయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ పోటీలను నిర్వహిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రీడల శాఖ స్టేట్ అబ్జర్వేషన్ అధికారి ఓంకార్, జిల్లా క్రీడల అధికారి రామ్ దాస్, ఎమ్మార్వో ముక్తార్ పాషా, ఎంపీవో బిరయ్య, అర్ ఐ శివ కుమార్, ఉప సర్పంచ్ నరేష్, వార్డు సభ్యులు భగవంతం, పిడి లు తదితరులు పాల్గొన్నారు.

మింట్ కాంపౌండ్‌లో విద్యుత్ శాఖ ఉద్యోగుల ధర్నా

ఖైరతాబాద్, జనవరి 28 పెన్ పవర్: విద్యుత్ పంపిణీ సంస్థల్లోని ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ విద్యుత్ జేఏసీ ఆధ్వర్యంలో మహాధర్నా చేపట్టారు. మింట్ కాంపౌండ్‌లోని టీజీ ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటుచేసిన మహా ధర్నాకు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి ఉద్యోగులు పెద్ద ఎత్తున చేరుకున్నారు. ఈ సందర్భంగా జేఏసీ నేతలు మాట్లాడారు. విద్యుత్ పంపిణీ సంస్థల్లో చేపడుతున్న బదిలీలు రెండేళ్లకు కాకుండా మూడేళ్ల సీనియార్టీని పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్ అమలు చేయాలన్నారు. యాజమాన్యం దృష్టికి సమస్యలు తీసుకెళ్లినా పట్టించుకోవట్లేదని.. అందుకే ఈ మహాధర్నాకు పిలుపునిచ్చినట్లు జేఏసీ నేతలు తెలిపారు.

03

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో

కోర్టు పబ్లికేషన్ యాడ్స్

కేవలం

యాడ్ 500/-

'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'

'మరిన్ని వివరాలకు సంప్రదించండి '

93948 55244

షరతులు వర్తిస్తాయి

కాంట్రావర్సీకి కేరాఫ్ అడ్రస్ గా మారుతున్న చిన్మయి...

హైదరాబాద్, జనవరి 28, పెన్ పవర్:
సినిమా ఇండస్ట్రీలో మన పని మనం చేసుకుంటూ ముందుకు సాగితే అందరికి మంచిది. అలా కాదని ఇష్టం వచ్చినట్టుగా మాట్లాడుతూ మనకు అవసరం ఉన్నా లేకపోయినా ఇతరుల విషయాల్లో జోక్యం చేసుకొని వాళ్ళు చేసే కామెంట్స్ కి రియాక్ట్ అవ్వడం వల్ల ప్రేక్షకుల దృష్టిలో బ్యాడ్ నేమ్ ని మూట కట్టుకొనే అవకాశం ఉంది. ఇండస్ట్రీ లో ఎలాంటి కాంట్రవర్సీ లేనివారికే అవకాశాలు వస్తాయి. ఇక సింగర్ చిన్మయి విషయానికి వస్తే సినిమా ఇండస్ట్రీ గురించి గాని, లేడీస్ కి సంబంధించిన విషయాల్లో గాని ఆమె చాలా తొందరగా రియాక్ట్ అవుతుంది. ఇక రీసెంట్ గా శివాజీ హీరోయిన్స్ డ్రస్సుల గురించి మాట్లాడినప్పుడు ఆమె పలు రకాల కామెంట్లు చేసింది. ఆమె మీద పలు విమర్శలు రావడంతో కామ్ అయిపోయింది. ప్రస్తుతం చిరంజీవి సైతం రీసెంట్ గా ఒక ఈవెంట్లో ఇండస్ట్రీ అందరిని ఆదరిస్తుంది. ఓన్ టాలెంట్ ని ప్రదర్శిస్తూ ముందుకు సాగాలి, కాస్టింగ్ కౌచ్ లు ఉండవు. మనం మన లక్ష్యం మీద ఫోకస్ పెట్టి ముందుకు సాగితే మనల్ని ఎవరూ ఆపలేరు అంటూ ఆయన కామెంట్స్ చేశారు.దానికి చిన్మయి కౌంటర్ ఇస్తూ ఇండస్ట్రీలో చాలామంది కాస్టింగ్ కౌచ్ ను ఎదుర్కొంటున్నారు. ప్రతి ఒక్క అమ్మాయికి అవకాశం రావాలంటే కాస్టింగ్ కౌచ్ పేరుతో చాలా రకాలుగా వాళ్లను వేధిస్తున్నారు అంటూ ఆమె కౌంటర్ అయితే ఇచ్చింది. దీని మీద నెటిజన్లు సైతం విమర్శలు చేస్తున్నారు.చిరంజీవి మాట్లాడింది ఏమిటి నువ్వు చెప్పిన సమాధానం ఏంటి నీ సంకల్పం గట్టిదైతే నువ్వు టాప్ లెవెల్ కి వెళ్ళిపోతావు. అంటూ చిరంజీవి చెబితే నువ్వు మాత్రం ఎంత టాలెంట్ ఉన్నా కాస్టింగ్ కౌచ్ లు ఎదుర్కోక తప్పదు అంటూ మాట్లాడడం సరైనది కాదు అంటూ కామెంట్స్ చేస్తున్నారు.అయిన అవసరం ఉన్నా లేకున్నా ప్రతి విషయంలో నువ్వు తల ఎందుకు తలదురుస్తున్నావ్ అంటు చిన్మాయి ని సోషల్ మీడియాలో విపరీతంగా ట్రోల్ చేస్తున్నారుఇక ఇప్పటికైనా చిన్మయి తన వైఖరిని మార్చుకొని ముందుకు సాగితే మంచిది. లేకపోతే ఆమెకు ఇండస్ట్రీలో అవకాశాలు వచ్చే ఛాన్సులైతే లేవు

ఫిబ్రవరి 26న రష్మిక, విజయ్ మ్యారేజ్

హైదరాబాద్, జనవరి 28, పెన్ పవర్:
టాలీవుడ్ లో అందరికీ తెలిసిన ఓపెన్ సీక్రెట్ విజయ్ దేవరకొండ, రష్మిక లు ప్రేమించుకుంటున్నారు, త్వరలోనే ఈ జంట పెళ్లి కూడా చేసుకోబోతున్నారు అని. గత మూడు నాలుగేళ్లుగా ఈ వార్త వినిపిస్తూనే ఉంది. విజయ్ దేవరకొండ మొదట్లో ఫేక్ న్యూస్ అని కొట్టి పారేసేవాడు. కానీ ఇప్పుడు అసలు స్పందించడం లేదు. ఇక రష్మిక అయితే రీసెంట్ గా జరిగిన ఒక ఇంటర్వ్యూ లో ఈ విషయం పై సమయం వచ్చినప్పుడు నేనే మాట్లాడుతాను అని చెప్పుకొచ్చింది. అంటే ఆ వార్త నిజమే అని అనధికారికంగా రష్మిక ఒప్పుకున్నట్టే. ఈ జంటకు గత ఏడాది నిశ్చితార్థం కూడా జరిగిపోయింది. ఫిబ్రవరి నెలలో పెళ్లి ఉంటుందని ఇండస్ట్రీ వర్గాల్లో గట్టిగా వినిపించిన వార్త. కానీ ఇప్పుడు ఆ వార్త నూటికి నూరు శాతం నిజమే అని తెలుస్తోంది.వచ్చే నెల 26న , అనగా ఫిబ్రవరి 26న ఈ క్రేజీ జంట మూడు ముళ్ల బంధం తో శాశ్వతంగా ఒక్కటి కాబోతున్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లు మొత్తం పూర్తి అయ్యిందట. త్వరలోనే ఈ జంట ఈ విషయాన్నీ అధికారికంగా అభిమానులకు ప్రకటించే అవకాశం ఉంది. ఈ వివాహాన్ని ఉదయ్ పూర్ లో జరిపించనున్నారు అట. నాగబాబు కూతురు నిహారిక కొణిదెల పెళ్లి ఉదయ్ పూర్ లోని ఒక ప్యాలస్ లో ఎంత గ్రాండ్ గా జరిగిందో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. అదే ప్యాలస్ లో ఈ క్రేజీ జంట వివాహం కూడా జరగబోతున్నట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ పెళ్ళికి టాలీవుడ్ కి చెందిన ప్రముఖులు తక్కువగానే హాజరయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇరు కుటుంబ సభ్యులు, అదే విధంగా ఇద్దరికీ ఎంతో సన్నిహితంగా ఉన్న వాళ్ళు మాత్రమే ఈ వివాహ మహోత్సవానికి హాజరయ్యే అవకాశాలు ఉన్నాయి.గీత గోవిందం చిత్రం తో వీళ్లిద్దరి మధ్య పరిచయం ఏర్పడింది. ఆ సినిమా పెద్ద హిట్ కూడా అయ్యింది. అప్పట్లో ఏర్పడిన స్నేహం, 'డియర్ కామ్రేడ్' చిత్రం తో ప్రేమగా మారింది. ఇక ఆ తర్వాత కొన్నేళ్ల నుండి ఒకే ఇంట్లో ఉంటూ డేటింగ్ చేస్తున్న ఈ చిత్రం, రీసెంట్ గా కలిసి 'రణబలి' చిత్రం లో హీరో హీరోయిన్లు గా నటిస్తున్నారు. నిన్న ఈ చిత్రానికి సంబంధించిన గ్లింప్స్ వీడియో కూడా విడుదలై అద్భుత్యమైన రెస్పాన్స్ ని సొంతం చేసుకుంది. వచ్చే నెలతో ఈ సినిమాలోని రష్మిక పాత్రకు సంబంధించిన షూటింగ్ పూర్తి అవుతుందట. అందుకే పెళ్ళికి సిద్ధమయినట్టు తెలుస్తోంది. మరి పెళ్లి తర్వాత రష్మిక సినిమాలు చేస్తుందా , లేదా అనేది ప్రస్తుతానికి సస్పెన్స్.

మొదలైన మేడారం మహాజాతర వనదేవతల కొలువుకు వేళాయె

వరంగల్, జనవరి 28, పెన్ పవర్:
ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా ప్రసిద్ధి చెందిన మేడారం సమ్మక్క–సారలమ్మ మహాజాతర నేటి నుంచి ప్రారంభమైంది. నాలుగు రోజుల పాటు జరిగే ఈ వేడుకకు ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేసింది. సాంకేతికతను ఉపయోగించి భద్రతను పటిష్టం చేశారు. భక్తుల సౌకర్యార్థం అనేక వసతులు కల్పించారుఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా ప్రసిద్ధి చెందిన మేడారం సమ్మక్క–సారలమ్మ మహాజాతర నేటి నుంచి నాలుగు రోజుల పాటు ఘనంగా జరగనుంది. రెండేళ్లకోసారి జరిగే ఈ ఆధ్యాత్మిక వేడుక ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం అడవుల్లో కోలాహలంగా ప్రారంభమైంది. కోట్ల మంది భక్తుల కొంగుబంగారమైన వనదేవతలు గద్దెలపై కొలువుదీరే శుభఘడియలు ఆసన్నమవడంతో.. అటవీ ప్రాంతమంతా భక్తజన సంద్రమైంది. నేటి నుంచి ఈ నెల 31 వరకు నాలుగు రోజుల పాటు వైభవంగా సాగే ఈ జాతరకు ప్రభుత్వం సుమారు రూ.251 కోట్ల నిధులతో భారీ ఏర్పాట్లు చేసింది.మేడారం జాతరలో మొదటి ఘట్టం సారలమ్మ రాకతో మొదలవుతుంది. ఇవాళ సాయంత్రం కన్నెపల్లి నుంచి సారలమ్మను ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం పూజారులు గద్దెపైకి తీసుకొస్తారు. అదే సమయంలో మహబూబాబాద్ జిల్లా పూనుగొండ్ల నుంచి సమ్మక్క భర్త పగిడిద్దరాజు, కొండాయి నుంచి గోవిందరాజులు పెళ్లికొడుకుల రూపంలో కాలినడకన మేడారానికి చేరుకుంటారు. జాతరలో అత్యంత కీలక ఘట్టం గురువారం నాడు జరిగే సమ్మక్క ఆగమనం. చిలుకలగుట్టపై నుంచి కుంకుమభరిణ రూపంలో ఉన్న సమ్మక్కను పూజారులు గద్దెపైకి తెచ్చే సమయంలో పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపి గౌరవ వందనం సమర్పిస్తారు. శుక్రవారం నాడు భక్తులు దేవతలకు నిలువెత్తు 'బంగారం' (బెల్లం) సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. శనివారం దేవతల 'వన ప్రవేశం'తో ఈ మహాక్రతువు ముగుస్తుంది.ఈ ఏడాది సుమారు కోటిన్నర మంది భక్తులు మేడారానికి వస్తారని అంచనా. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం గద్దెల ప్రాంగణాన్ని పునర్నిర్మించడంతో పాటు, జంపన్న వాగు వద్ద స్నాన ఘట్టాలను ఆధునీకరించింది. రవాణా సౌకర్యం కోసం ఆర్టీసీ వేల సంఖ్యలో ప్రత్యేక బస్సులను నడుపుతోంది. వైద్యారోగ్య శాఖ ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేయగా.. విద్యుత్, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా కోసం 21 శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారు. గిరిజన సంప్రదాయాలను గౌరవిస్తూనే.. ఆధునిక వసతులతో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా యంత్రాంగం అప్రమత్తంగా ఉంది.

ఈసారి మేడారం జాతరలో సాంకేతికత ప్రధాన ఆకర్షణగా నిలిచింది. శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు తొలిసారిగా కృత్రిమ మేధ (ూ×) పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. జనసమూహాన్ని పర్యవేక్షించడంతో పాటు, జాతరలో తప్పిపోయిన చిన్న పిల్లలను, వృద్ధులను ముఖ గుర్తింపు ద్వారా త్వరగా గుర్తించేందుకు ఈ టెక్నాలజీ తోడ్పడుతోంది. వేల సంఖ్యలో సీసీ కెమెరాలు, డ్రోన్ల నిఘాతో జాతరను హైటెక్ హంగులతో నిర్వహిస్తున్నారు.

పూనుగొండ్ల నుంచి పగిడిద్దరాజు పయనం

జాతరలో భాగంగా మంగళవారమే పగిడిద్దరాజు పయనం మొదలైంది. పూనుగొండ్ల గ్రామంలోని పెనుక వంశీయుల ఆధ్వర్యంలో పగిడిద్దరాజును పెళ్లికొడుకుగా ముస్తాబు చేసి, సుమారు 62 కిలోమీటర్ల మేర అటవీ మార్గంలో కాలినడకన మేడారానికి తీసుకువస్తున్నారు. ఆదివాసీల డోలు వాయిద్యాలు, శివసత్తుల పూనకాల మధ్య సాగే ఈ ఊరేగింపు భక్తిభావంతో సాగుతోంది. ఇవాళ సాయంత్రానికి పగిడిద్దరాజు మేడారం చేరుకోవడంతో జాతరలో తొలి ప్రధాన ఘట్టం పూర్తవుతుంది.

కార్పొరేట్ల లాభాల కోసం.. అమెరికా సామ్రాజ్యవాదం

హైదరాబాద్ పెన్ పవర్: ప్రపంచంలో ప్రజాస్వామ్యం, మానవహక్కులు అనే పేర్లతో నడుస్తున్నది వాస్తవానికి కార్పొరేట్ సామ్రాజ్యవాదమే. చమురు, సహజ వనరులు, డాలర్ ఆధిపత్యం కోసం అమెరికా అనేక దేశాల సార్వభౌమత్వాన్ని దెబ్బతీస్తూ దాడులు, ఆంక్షలు, రాజకీయ జోక్యాలను సాధనాలుగా మార్చుకుంది. వెనిజులా వంటి దేశాలపై జరుగుతున్న పరిణామాలు ఈ సామ్రాజ్యవాద విధానానికి స్పష్టమైన ఉదాహరణలు.. అణ్వాయుధాల యుగంలో ప్రపంచం మౌనం వహిస్తే, రేపటి మానవ భవిష్యత్తే ప్రశ్నార్థకమవుతుంది. చమురు కోసం, సహజ వనరుల కోసం, ప్రపంచ రిజర్వ్ కరెన్సీగా డాలర్ హోదా కోసం అమెరికా అగ్రరాజ్యం అనేక దేశాలపై దాడులు దండయాత్రలు చేస్తూ తన సామ్రాజ్యవాదాన్ని కార్పొరేట్ల లాభాల కోసం విచ్చలవిడిగా బరితెగించి ప్రపంచ దేశాలను అతలాకుతలం చేస్తున్నాయి. వలస పాలన కన్నా సామ్రాజ్యవాదం నేడు ప్రపంచ దేశాలను వణికిస్తూ అణ్వాయుధాలతో బెదిరిస్తూ ఉన్నందున ప్రపంచ దేశాలు కొన్ని ఈ సామ్రాజ్యవాదులపై తిరగబడితే ప్రపంచ భవిష్యత్తు ఎటుపోతుందో చెప్పడం కూడా భయమేస్తుంది. ఇతర దేశాలపై ఆధారపడి అభివృద్ధి చెందిన అమెరికా, ఇప్పుడు ప్రపంచ దేశాలను తన కనుసన్నల్లో పెట్టుకోవాలని ప్రయత్నిస్తోంది. మానవ వనరులు, సాంకేతిక నైపుణ్యం, వాణిజ్యం, పెట్టుబడులు అన్నీ విదేశాలతో ముడిపడి ఉన్నప్పటికీ, ఆ ఆధారాన్నే సామ్రాజ్యవాదంగా మార్చుకుంటోంది. అమెరికా అభివృద్ధిలో భారతీయుల మేధస్సు, చైనా తయారీ, మెక్సికో వ్యవసాయం, కెనడా ఇంధనం, జర్మనీ యంత్రాలు, జపాన్-దక్షిణ కొరియా సాంకేతికత కీలక పాత్ర పోషిస్తున్నాయి. అయినా ఈ ఆర్థిక ఆధిపత్యం ద్వారా ఇతర దేశాల సార్వభౌమత్వాన్ని దెబ్బతీస్తోంది. ట్రంప్ ప్రకటనలను పరిశీలిస్తే వెనిజులా చమురు సంపదపై నియంత్రణే అసలు లక్ష్యమని స్పష్టమవుతుంది. ఇరాన్, సిరియా, నైజీరియా, తాజాగా వెనుజులా అధ్యక్షుడు నికలాస్ మధురో అతని భార్యను కూడా అమెరికా బంధించి నార్కో టెర్రరిజం అని ఆరోపించి న్యూయార్క్ తరలించడం ప్రపంచ దేశాలను దిగ్భ్రాంతికి గురి చేసింది. ఇలా ఇతర దేశాల్లో జోక్యంతో ట్రంప్ అమెరికా చరిత్రలోనే అత్యంత జోక్యందారి అధ్యక్షుడిగా మారి, సామ్రాజ్యవాద విజృంభనకు దారితీస్తున్నాడు. సోషలిజం కంటే పెట్టుబడిదారీ వ్యవస్థ మేలని, స్వేచ్ఛ, ఆర్థిక అభివృద్ధి, ప్రపంచ శాంతి వస్తాయని ప్రచారం చేశారు. కానీ వాస్తవంలో పెట్టుబడిదారులు పాలకులతో చేతులు కలిపి దేశాలను దోచుకుంటున్నారు. ప్రభుత్వాలను కూల్చడం, తమకు అనుకూలమైన వారిని అధికారంలో కూర్చోబెట్టడం ద్వారా వనరులను కైవసం చేసుకుని దేశాల భవిష్యత్తును నియంత్రిస్తున్నారు. పాలకులేమో అన్ని రంగాలను కార్పొరేట్లకు అప్పగించి రాజుల్లా వ్యవహరిస్తున్నారు. ఇలా నిస్సహాయ స్థితిలో ప్రజాస్వామ్య వ్యవస్థ ఉన్నది. నిజానికి పెట్టుబడిదారుడే పాలకుడైనప్పుడు దోపిడీ తప్ప మరో లక్ష్యం ఉండదు. ప్రజలకు అవసరం లేని ఉత్పత్తులు కొనసాగిస్తూ దేశ సంపదను తమ గుప్పెట్లో పెట్టుకుంటున్నారు. ఈ విధంగా ప్రజాస్వామ్యం నిస్సహాయంగా మారి, దాని పేరుతోనే ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారీ దోపిడీ జరుగుతోంది. ఈ పెట్టుబడిదారులకు పెద్ద దిక్కు అమెరికా. అమెరికా తన సామ్రాజ్యవాద ప్రయోజనాల కోసం తన చట్టాలకు గానీ అంతర్జాతీయ చట్టాలకు గానీ కట్టుబడి ఉండదు. మార్కెట్ విస్తరణ కోసం దిగజారుతున్న తన ఆర్థిక వ్యవస్థను నిలబెట్టుకోవడం కోసం బలహీన దేశాలపై సైనిక దాడి, రాజ్యాంగం మార్పు పేరుతో ప్రజల రక్షణ కోసం అంటూ రాజకీయ బ్లాక్ మెయిలింగ్ విధానాన్ని అమెరికా అనుసరిస్తున్నది. తన ఆర్థిక ప్రయోజనాలకు భిన్నంగా వ్యవహరించే దేశాలను అమెరికా సహించదు వాటి మీద ఆర్థిక ఆంక్షలు విధిస్తుంది. ఇది ప్రత్యక్ష యుద్ధానికి మరో రూపం. వెనిజులాపై సైనిక దాడి చేసి అధ్యక్షుడు నికోలస్ మధురో అపహరించడానికి కారణం సామ్రాజ్యవాదం ప్రయోజనాలే అని అమెరికా అధ్యక్షుడు తానే వివరించి చెప్పారు. నేటి ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థలో నిజమైన పోటీ మార్కెట్లు లేవు. ఫైనాన్స్ క్యాపిటల్, స్టాక్ మార్కెట్ల ఆధిపత్యంలో దేశాల ప్రజాస్వామ్య స్వాతంత్ర్యం క్రమంగా నశిస్తోంది. సాంకేతికంగా, సైనికంగా, ఆర్థికంగా అమెరికా అగ్రరాజ్యంగా మారి కార్పొరేట్ రంగానికి పెద్దదిక్కుగా ఉంది. ఎఓఈ, వరల్డ్ బ్యాంక్, ఐఎంఎఫ్, డబ్ల్యూటీఓ వంటి సంస్థలను తన ప్రయోజనాలకు అనుగుణంగా ఉపయోగిస్తోంది. అణ్వాయుధాల యుగంలో యుద్ధం అంటే మానవజాతి అంతమే. ఈ పరిస్థితిలో ప్రపంచం మౌనం వహిస్తే భవిష్యత్తే ప్రమాదంలో పడుతుంది. కాబట్టి నేడు ప్రపంచం అగ్రదేశాల ఆయుధ సంపత్తి కింద నడవకూడదు. వీటి నుంచి బయటపడాలంటే డీ గ్లోబలైజేషన్, డీ డాలరైజేషన్, డీ ప్రైవేటైజేషన్ అయితే తప్ప మన దేశంతో పాటు ప్రపంచ దేశాలు కూడా అభివృద్ధి చెందే పరిస్థితి లేదు.

ఏజెన్సీ ప్రాంతాలను హడలెత్తిస్తున్న పులి

ఏలూరు, జనవరి 28 పెన్ పవర్:
తెలంగాణలోని కావడిగుడ్ల ప్రాంతం నుండి ఏపీలోకి ప్రవేశించిన ఒక పెద్ద పులి, గత నాలుగు రోజులుగా ఏలూరు జిల్లా బుట్టాయిగూడెం, కొయ్యలగూడెం మండలాల్లోని ఏజెన్సీ గ్రామాలను వణికిస్తోంది. పందిరిమామిడిగూడెం, ఇనుమూరు, గాడిదబోరు, అంతర్వేదిగూడెం వంటి ప్రాంతాల్లో సంచరిస్తూ ఇప్పటికే కొన్ని పశువులపై దాడి చేసిన ఈ పులి, తాజాగా కన్నాపురం ఫారెస్ట్ పరిధిలోని బిలిమిల్లి గ్రామంలో మరో రెండు పశువులను హతమార్చింది. దాంతో ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో పొలాలకు వెళ్లడానికి కూడా రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎవరూ పనికి వెళ్లడం లేదని, పులిని త్వరగా పట్టుకోవాలని అటవీశాఖ అధికారులను కోరారు.కొయ్యలగూడెం, బుట్టాయగూడెం పరిసర ప్రాంతాలవారు సాయంత్రం తరువాత ఒంటరిగా తిరగవద్దని, పొలాలకు కూడా వెళ్లవద్దని కన్నాపురం రేంజ్ అధికారి భానుప్రకాశ్, ఎమ్మార్వో నాగరాజు, సబ్ డీఎఫ్ఓ వెంకట సుబ్బయ్య ప్రజలను హెచ్చరించారు. ఈ క్రమంలోనే దిప్పకాయలపాడు - బిలిమిల్లి మధ్య రోడ్డు పక్కన ఉన్న మొక్కజొన్న తోటలో పులి కదలికలు డ్రోన్ కెమెరాకు చిక్కాయి. కెమెరా అలజడికి పులి పరుగులు తీయడంతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు.పులి సంచారం దృష్ట్యా అటవీశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. పులి ఆచూకీని నిరంతరం పర్యవేక్షించేందుకు 19 ట్రాప్ కెమెరాలను ఏర్పాటు

చేయడమే కాకుండా, దానిని బంధించేందుకు రెండు బోనులను కూడా సిద్ధం చేశారు. రాత్రి వేళల్లో పులి సుమారు 15 కిలోమీటర్ల మేర ప్రయాణించే అవకాశం ఉందని, అది కరగపాడు, కొవ్వాడ మీదుగా నేషనల్ పార్కులోకి ప్రవేశించవచ్చని డీఎఫ్ఓ పి.వి. సందీప్‌రెడ్డి అంచనా వేశారు. ఈ లోపు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.మరోవైపు, పులి ఆవాస ప్రాంతాలకు చేరువలో ఉండటంతో అధికారులు ప్రజలను హెచ్చరించారు. సబ్ డీఎఫ్ఓ వెంకట సుబ్బయ్య, తహసీల్దారు నాగరాజు ఆధ్వర్యంలో గ్రామాల్లో టాంటాం వేయించి, ప్రజలు రాత్రి వేళల్లో ఒంటరిగా బయటకు రావద్దని, పొలాలకు వెళ్లవద్దని సూచించారు.

బుట్టాయగూడెం-కన్నాపురం మార్గంలో పులి రహదారి దాటుతుండగా కారు యజమానులు గమనించినట్లు సమాచారం అందడంతో, ఆ పరిసర ప్రాంత వాసులు మరింత అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరుతున్నారు.ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలంలో బిల్లిమిల్లిలో పెద్ద పులి సంచరిస్తుండటంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. దిప్పకాయలపాడు, బిల్లిమిల్లి మధ్యలో రోడ్డు పక్కన తోటలో డ్రోన్ కెమెరాకు చిక్కిన పులి చిక్కింది. అయితే కెమెరా అలజడికి భయపడిన పులి అక్కడినుంచి పరుగులు తీసినట్లు అధికారులు గుర్తించారు. చుట్టుపక్కల ప్రాంతాలవారు పులి ఎప్పుడు తమపై దాడి చేస్తుందేమోనని భయంతో వణికిపోతున్నారు.

జగన్ లో ఎంత మార్పో

విజయవాడ, జనవరి 28చపెన్ పవర్:
గత ఎన్నికలలో తెచ్చిన ఓటమి వైసీపీ అధినేత జగన్ లో మార్పు తెచ్చినట్లు కనపడుతుంది. వైసీపీ అధికారంలోకి రాకముందు, తర్వాత కూడా జగన్ ను నేరుగా కార్యకర్తలను కలిసే అవకాశముండేది కాదు. ఏదైనా జిల్లాల పర్యటనలకు వచ్చినప్పుడు మాత్రమే అదీ వాహనంలో ఉండి పలకరింపులు తప్పించి జగన్ ను ముఖ్య కార్యకర్తలు నేరుగా కలిసే అవకాశముండేది కాదు. ఇక 2019 నుంచి 2024 వరకూ అధికారంలో ఉన్న సమయంలో జగన్ నేతలను, ఎమ్మెల్యేలను, మంత్రులను కూడా కలిసేవారు కాదు. ఆయన చుట్టూ ఉన్న కోటరీ నేతలను కలవనివ్వకుండా చేసేదని సాక్షాత్తూ విజయసాయిరెడ్డి లాంటి నేతలే బయటకు వచ్చిన తర్వాత ఆరోపణలు చేశారు.అయితే జగన్ ఓటమి తర్వాత కొంత మార్పు వచ్చినట్లు కనపడుతుంది. ఇప్పుడు జగన్ బెంగళూరు నుంచి తాడేపల్లికి ఎప్పుడు వచ్చిన నేతలతో పాటు ఇతర నియోజకవర్గాల నుంచి వచ్చిన కార్యకర్తలకు కూడా ప్రత్యేకంగా సమయాన్ని కేటాయిస్తున్నారు. వారితో ముచ్చటిస్తున్నారు. కార్యకర్తలతో ఫొటోలు దిగుతున్నారు. ఓటమి తర్వాత ఇప్పటికే బెంగళూరుకు మకాం మార్చిన జగన్ నెలలో రెండు సార్లు తాడేపల్లికి వస్తారు. ఆయన వస్తారని రాష్ట్రం నలుమూలల నుంచివచ్చిన వారిని నిరాశపర్చకుండా జగన్ వారితో ప్రత్యేకంగా సమావేశమవుతున్నారు. వారి వ్యక్తిగత సమస్యలను కూడా అడిగి తెలుసుకుంటున్నారు. దీంతో క్యాడర్ లో భరోసా నింపే అవకాశముంటుందని ఆయన భావించి కార్యకర్తలకు కలుసుకునే అవకాశం కల్పించారు.కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత వరసగా కార్యకర్తలపై కేసులు నమోదవుతుండటం, ఇక ఎన్నికలకు మూడేళ్లు మాత్రమే సమయం ఉండటంతో పాటు స్థానిక సంస్థల ఎన్నికలు కూడా జరుగుతుండటంతో కార్యకర్తలు ఖచ్చితంగా పార్టీ విజయానికి దోహదపడతారని ఆయన గుర్తించినట్లుంది. అందుకే గత కొన్నేళ్లుగా దూరం పెట్టిన కార్యకర్తల భుజం పైన చేతులు వేసి మరీ ఫొటోలు దిగుతున్నారంటే ఖచ్చితంగా జగన్ లో మార్పు వచ్చిందంటున్నారు. ఇక నేతలయితే ఎలాంటి అపాయింట్ మెంట్ లేకపోయినా అప్పటికప్పుడు కలవాలన్నావెళ్ళి కలిసే వీలు కల్పించారు. దీంతో క్యాడర్ నుంచి లీడర్ల వరకూ జగన్ లో వచ్చిన మార్పును చూసి ఆశ్చర్యపోతున్నారట. ఇదే పరిస్థితి భవిష్యత్ లోనూ కొనసాగాలని కోరుకుంటున్నారు.

లోకేష్ కు, పవన్ కు ప్రమోషన్

విజయవాడ, జనవరి 28 పెన్ పవర్: ఏపీలో రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చి 20 నెలలు అవుతోంది. మరో నెలలో రెండేళ్ల పాలన పూర్తవుతుంది. ఇప్పటివరకు సజావుగా పూర్తి చేసామన్న సంతృప్తి కూటమిలో ఉంది. కానీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మాత్రం ప్రభుత్వంపై వ్యతిరేకత ప్రారంభమైందని చెబుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో రాజకీయ నిర్ణయాల దిశగా కూటమి ముందుకు వెళ్తున్నట్లు ప్రచారం నడుస్తోంది. మంత్రి నారా లోకేష్ ప్రమోషన్, పట్టాభిషేకం వంటి ప్రచారం సోషల్ మీడియాలో హల్చల్ చేస్తోంది. ఇటువంటి తరుణంలో పవన్ పాత్ర ఎలా ఉండబోతుంది అనేది చర్చ. ఒకవేళ లోకేష్ కు ప్రమోషన్ కల్పించాలంటే పవన్ నుంచి అభ్యంతరం రాదా? అనే చర్చ కూడా బలంగా సాగుతోంది. అయితే ఏది ఏమైనా మూడు పార్టీలు కలిసి ముందుకెళ్లాలని బలంగా నిర్ణయించుకున్నాయి. అందుకే కూటమి అంతర్గత నిర్ణయాలు సైతం మూడు పార్టీల మధ్య జరగాలన్నది ఒక ప్రతిపాదనగా ఉన్నట్లు తెలుస్తోంది.2027 ద్వితీయార్థంలో మంత్రి నారా లోకేష్ ప్రమోషన్ ఉంటుందన్న చర్చ నడుస్తోంది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవితో పాటు డిప్యూటీ సీఎం హోదా కల్పిస్తారని టాక్ నడుస్తోంది. కానీ ఇప్పటికే పార్టీ పై పూర్తిస్థాయిలో పట్టు సాధించారు లోకేష్. ఆపై తన మంత్రి పదవి విషయంలో సైతం సక్సెస్ అయ్యారు. పెట్టుబడుల సాధన, పరిశ్రమల ఏర్పాటు వంటి విషయంలో విజయం సాధించారు. తనను తాను ప్రూవ్ చేసుకున్నారు. అదే సమయంలో బిజెపి అగ్ర నేతల ఆశీస్సులు కూడా అందుకున్నారు. వారి అభిమానాన్ని చూరగొన్నారు. అయితే ఏకంగా లోకేష్ కు ముఖ్యమంత్రి పదవి కట్ట పెడతారన్న ప్రచారం నడుస్తోంది. అయితే అంతటి సాహసానికి దిగుతారా అనేది చర్చ. ఎందుకంటే అమరావతి రాజధానిని ప్రాధాన్యత ప్రాజెక్టుగా తీసుకున్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు చేపడుతున్నారు. ప్రపంచ దిగ్గజ సంస్థల ఏర్పాటు జరుగుతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో అధికార మార్పిడి జరిపితే దాని ప్రభావం తప్పకుండా ఉంటుంది. అందుకే ఇందులో ఎంత మాత్రం నిజం లేదని తెలుస్తోంది.రాష్ట్రంలో లోకేష్ ప్రమోషన్, పవన్ కళ్యాణ్ కు ప్రత్యామ్నాయ అవకాశాలు జరగాలంటే 2029 ఎన్నికల తరువాతే. ప్రస్తుతం పవన్ కళ్యాణ్ ఏపీలో మంత్రిగా ఉన్నారు. ఆపై డిప్యూటీ సీఎం హోదాలో కొనసాగుతున్నారు. మరోవైపు సనాతన ధర్మం అంటూ జాతీయ స్థాయిలో సైతం ప్రభావం చూపుతున్నారు. తరచూ వివిధ రాష్ట్రాలను సందర్శిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన చేస్తున్న వ్యాఖ్యలు జాతీయ స్థాయిలో సైతం వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా దక్షిణ భారత దేశంలో పవన్ కళ్యాణ్ ద్వారా రాజకీయం చేయాలని చూస్తోంది భారతీయ జనతా పార్టీ. ఈ పరిస్థితులు చూస్తుంటే 2029 ఎన్నికల్లో పవన్ కళ్యాణ్ ఎంపీగా పోటీ చేసి కేంద్ర రాజకీయాల్లోకి వెళ్లడం ఖాయమని తెలుస్తోంది. కేంద్ర క్యాబినెట్ లో కీలక బాధ్యతలు కట్టబెట్టి జాతీయస్థాయి రాజకీయాల కోసం పవన్ కళ్యాణ్ ను వాడుకుంటారు అన్న చర్చ జోరుగా సాగుతోంది.2029 సార్వత్రిక ఎన్నికలతోపార్టీ ఏపీ అసెంబ్లీకి ఎన్నికలు జరుగుతాయి. మూడు పార్టీలు ఉమ్మడిగా ముందుకు వెళ్తాయి. పవన్ కళ్యాణ్ ఎంపీగా పోటీ చేస్తారు. లోకేష్ తిరిగి అసెంబ్లీకి పోటీ చేస్తారు. కూటమి తప్పకుండా అధికారంలోకి వస్తుందన్న నమ్మకం వారిలో ఉంది. అప్పుడు కూడా చంద్రబాబు మరోసారి ముఖ్యమంత్రి పదవి చేపట్టడం ఖాయం. కేంద్రంలో పవన్ కళ్యాణ్ తిరుగులేని శక్తిగా ఉంటారు. ఏపీలో కూటమికి రక్షణ కవచంగా నిలుస్తారు. అటువంటి సమయంలో చంద్రబాబు వయసు దృష్ట్యా సీఎం పదవి నుంచి తప్పుకుంటే లోకేష్ కు పట్టాభిషేకం చేయడం ఖాయం. కేంద్ర పెద్దల భరోసాతో, పవన్ కళ్యాణ్ సమ్మతితో ఇది జరిగే అవకాశం ఉంది. అంటే రాష్ట్రంలో పదవుల మార్పు అనేది 2029 ఎన్నికల్లో విజయాలను అనుసరించి ఉంటుంది. అంతవరకు ఎటువంటి మార్పు ఉండదు అన్నది విశ్లేషకుల మాట. చూడాలి మరి ఏం జరుగుతుందో.

అమరావతికి బాలయ్య దూరం

అనంతపురం, జనవరి 28 పెన్ పవర్: హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కొంత ఏపీ రాజకీయాలకు దూరంగా ఉంటున్నట్లు కనపడుతుంది. ఆయన హిందూపురం నియోజకవర్గానికే పరిమితమవుతున్నారు. ఆయన త్వరలో జరగనున్న అసెంబ్లీ సమావేశాలకు వస్తారా? అన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. నందమూరి బాలకృష్ణ ఉన్నది ఉన్నట్లు మాట్లాడతారు. ఏదీ మనసులో ఉంచుకోరు. అది శాసనసభ అయినా.. బహిరంగ సభ అయినా ఆయనకు ఒక్కటే. తాను అనుకున్నది బయటకు చెప్పేయడమే బాలకృష్ణకు అలవాటు. అదే అనేక సార్లు రాజకీయంగా పార్టీకి ఇబ్బందులు తెచ్చిపెడుతుంది. గత నవంబర్ లో జరిగిన శాసనసభ సమావేశాల్లో నందమూరి బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలు కూటమిలోని పార్టీలను షేక్ చేశాయి.శాసనసభలో చిరంజీవిని ప్రస్తావన తెచ్చి టీడీపీ నాయకత్వానికి ఇబ్బందిగా మారారు. . ఇక అదే సమయంలో దీనిపై ఎవరు ఎంత రచ్చ చేసినా ఆయన నోటి నుంచి ఎటువంటి క్షమాపణ అన్న పదం రాలేదు. అందుకే నాడు చంద్రబాబు నాయుడు స్వయంగా పవన్ కల్యాణ్ ఇంటికి వెళ్లి మాట్లాడాల్సి వచ్చింది. ఇక ఆ వివాదం సద్దుమణిగిన తర్వాత నందమూరి బాలకృష్ణ ఏపీ రాజకీయాల గురించి పెద్దగా పట్టించుకోవడం లేదు. అసలు విజయవాడ కు రావడమే మానేశారు. తనకు ఏదైనా పనులు ఉన్నా హిందూపురం నియోజకవర్గంలో సమస్యలున్నా నేరుగా చంద్రబాబుకో, లోకేశ్ కో ఫోన్ చేసి పరిష్కరించుకుంటున్నారు కానీ అమరావతిలో మాత్రం అడుగు పెట్టలేదు.ఇటీవల ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్ లో ఎన్టీఆర్ ఘాట్ వద్దకు వచ్చిన నందమూరి బాలకృష్ణ నివాళులర్పించి కేవలం ఎన్టీఆర్ గురించి నాలుగు మంచి మాటలు మీడియాతో మాట్లాడారు. అంతకు మించి రాజకీయాల జోలికి ఆయన వెళ్లలేదు. ప్రతిసారీ అక్కడ కూడా రాజకీయాలు మాట్లాడే నందమూరి బాలకృష్ణ ఈసారి మాత్రం ఆ పనిచేయకపోవడంపై అందరిలోనూ చర్చ మొదలయింది. నందమూరి బాలకృష్ణను పార్టీ నాయకత్వం దూరంగా ఉండాలని చెప్పిందని అనుకోలేం. ఎందుకంటే బాలకృష్ణను అలా నియంత్రించలేరు. కానీ నందమూరి బాలకృష్ణ మాత్రం మౌనంగా ఉండటం వెనక ఏదో ఒకటి జరిగి ఉంటుందన్న ప్రచారం బాలయ్య బాబు ఫ్యాన్స్ లో అనుమానం కలుగుతుంది. ఇంతకీ లెజెండ్ సైలెన్స్ వెనక సినిమా షూటింగ్ లే కారణమా? లేక తన మాట కూటమి ప్రభుత్వంలో చెల్లుబాటు కావడం లేదన్న అసహనమా? అన్న చర్చ జరుగుతుంది.

ఏపీకి కేంద్రం శుభవార్త..

భారీగా నిధులు విడుదల,

విజయవాడ, జనవరి 28పెన్ పవర్: నరేగా పనులకు కేంద్రం తీపికబురు చెప్పింది. మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ.740 కోట్లు విడుదల చేసింది. దీంతో సామగ్రి కొనుగోలుకు డబ్బులు అందుబాటులోకి వచ్చి, పనులు వేగవంతం అవుతాయి. కార్మికులకు సకాలంలో చెల్లింపులు జరగడంతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తుంది. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కేంద్రం ఈ నిధుల విడుదల చేయడాన్ని స్వాగతించారు.ఏపీకి కేంద్రం తీపికబురు చెప్పింది.. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (నరేగా) కింద మెటీరియల్ కాంపోనెంట్ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి విడుదల చేశాయి. ఈ నిధుల విడుదలతో నరేగా పనులకు అవసరమైన సామాగ్రి కొనుగోలుకు డబ్బులు అందుబాటులోకి వచ్చాయి. గతంలో బిల్లులు చెల్లించడంలో జాప్యం జరిగేది. ఇప్పుడు ఈ నిధులతో ఆ సమస్య తీరుతుంది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన రూ.480.87 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన రూ.259.13 కోట్లు కలిపి మొత్తం రూ.740 కోట్లు మెటీరియల్ కాంపోనెంట్ కింద ఖర్చు చేస్తారు.ఈ ఆర్థిక సంవత్సరంలో ఇది నాలుగో విడతలో మొదటి విడతగా ఈ నిధులను విడుదల చేశారు. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతం అవుతాయి. కార్మికులకు సకాలంలో చెల్లింపులు జరగడానికి కూడా ఇది దోహదపడుతుంది. రాష్ట్రానికి కేంద్రం మెటీరియల్ నిధులు విడుదల చేయడంపై కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ నిధుల విడుదల గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తుందన్నారు.కేంద్రం 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పథకం కింద రాష్ట్రానికి విడుదల చేసింది. ఈ నిధుల విడుదల ఉపాధి హామీ పథకం అమలులో కీలకమైన మెటీరియల్ పనులకు ఊతమిస్తుంది. కేంద్రం విడుదల చేసిన రూ.556 కోట్లలో, నాలుగో విడతగా రూ.480 కోట్లు, గతంలో చెల్లించాల్సిన బకాయిలు రూ.75 కోట్లు ఉన్నాయి. ఈ మొత్తాన్ని స్పర్శ అకౌంట్ ద్వారా రాష్ట్రానికి పంపించారు. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా 25 శాతం నిధులను, అంటే రూ.185 కోట్లను జమ చేయాల్సి ఉంటుంది. అప్పుడు మొత్తం రూ.740 కోట్లు మెటీరియల్ పనుల కోసం అందుబాటులోకి వస్తాయి. ఈ నిధులతో అక్టోబర్ వరకు పూర్తయిన మెటీరియల్ పనులకు సంబంధించిన బిల్లులను చెల్లించవచ్చని అధికారులు పేర్కొన్నారు. ఇది కూలీలకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చూడటానికి సహాయపడుతుంది.'ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధికి కీలక ముందడుగు. 202526 ఆర్థిక సంవత్సరానికి గాను వీ+చీ=ఙ+ూ పథకం కింద మెటీరియల్ భాగానికి కేంద్ర ప్రభుత్వం ₹480.87 కోట్ల సహాయాన్ని మంజూరు చేసింది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో దీర్ఘకాల ప్రయోజనం కలిగించే పనులు వేగంగా, నిరంతరంగా చేపట్టేందుకు బలమైన మద్దతు లభించింది. ఈ నిధులు రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ మౌలిక వసతులను బలోపేతం చేస్తూ, గ్రామస్థాయి అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ అంకితభావాన్ని స్పష్టంగా ప్రతిబింబిస్తున్నాయి. గౌరవ ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ గారి దూరదృష్టి నాయకత్వంలో, కేంద్ర మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ గారి మార్గదర్శకత్వంలో, అలాగే గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు మరియు ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారి సమర్థ అమలుతో ఈ సహాయం గ్రామీణ ప్రాంతాల్లో గణనీయమైన మార్పును తీసుకురానుంది' అంటూ కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ట్వీట్ చేశారు.

తుని రైల్వేస్టేషన్ లో కొత్త శోభ

విజయవాడ, జనవరి 28 పెన్ పవర్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రైల్వే స్టేషన్ల రూపురేఖలు మారుతున్నాయి. అమృత్ భారత్ స్టేషన్ల పథకం కింద అనేక రైల్వే స్టేషన్లలో అభివృద్ధ పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే కాకినాడ జిల్లా తుని రైల్వే స్టేషన్ కొత్త శోభను సంతరించుకుంది. రూ.19 కోట్ల నిధులతో స్టేషన్‌లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ప్లాట్ ఫామ్‌ల ఆధునీకరణ, వెయిటింగ్ హాళ్ల అభివృద్ధి, ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి అయ్యాయి. ఈ ఫోటోలను రైల్వేశాఖ షేర్ చేసింది.ఏపీలోని పలు రైల్వే స్టేషన్ల రూపురేఖలు మారుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం పథకమైన అమృత్ భారత్ స్టేషన్ల పథకం కింద రాష్ట్రంలో 70కి పైగా రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నారు. ఈ క్రమంలోనే కాకినాడ జిల్లా తుని రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనులు చేపట్టడంతో.. తుని రైల్వే స్టేషన్ కొత్త రూపు సంతరించుకుంది. అమృత్ భారత్ స్టేషన్ల పథకం కింద తుని రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫామ్‌లు అభివృద్ధి చేశారు. అలాగే కొత్తగా మరో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించారు. ప్రయాణికులు నిరీక్షించేందుకు నిర్మించిన వెయిటింగ్ హాళ్లను ఆధునిక టాయిలెట్లతో అప్ గ్రేడ్ చేశారు. తుని రైల్వే స్టేషన్ ముఖద్వారంతో పాటుగా స్టేషన్ ప్రాంగణాన్ని రీ డిజైన్ చేశారు. దీంతో తుని రైల్వే స్టేషన్ రూపురేఖలే మారిపోయాయని రైల్వే ప్రయాణికులు చెప్తున్నారు. అభివృద్ధి చేసిన రైల్వే స్టేషన్ ఫోటోలను భారతీయ రైల్వే ఎక్స్ వేదికగా పంచుకుంది.మరోవైపు అమృత్ భారత్ స్టేషన్ల పథకం కింద ఏపీలోని 73 రైల్వే స్టేషన్ల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.2,051 కోట్లు కేటాయించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే తుని రైల్వే స్టేషన్ అభివృద్ధికి ఈ పథకం కింద రూ.19.13 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఈ నిధులతో కొత్తగా ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం, స్టేషన్ ఎంట్రీ రీ డిజైన్, రైల్వే స్టేషన్ ఆవరణలో పనులు చేపట్టారు. తుని రైల్వే స్టేషన్‌లోని ఒకటి, రెండు ప్లాట్‌ఫామ్‌లను కలుపుతూ కొత్తగా ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించారు. ప్రధాన ద్వారం నుంచి కాకుండా బయటి వ్యక్తులు రైల్వే స్టేషన్‌లోకి రాకుండా కాంపౌండ్ వాల్ నిర్మిస్తున్నారు. పనులు దాదాపుగా పూర్తికావటంతో స్టేషన్ కొత్త శోభను సంతరించుకుంది.మరోవైపు అమృత్ భారత్ స్టేషన్ల పథకంలో భాగంగా రైల్వే స్టేషన్లలో కొత్త భవనాల నిర్మాణంతో పాటుగా ప్రయాణికులకు వీలుగా ఉండేందుకు లిఫ్టులు, ఎస్కలేటర్లు ఏర్పాటు చేస్తారు. రైల్వే స్టేషన్ వచ్చే ప్రయాణికుల రద్

పజిల్లతో వినోదమూ, విజ్ఞానమూ

ప్రతి సంవత్సరం జనవరి 29న ప్రపంచ వ్యాప్తంగా జరుపుకునే జాతీయ పజిల్ దినోత్సవం, మొదట చూస్తే ఒక సాధారణ వినోద దినంలా అనిపించవచ్చు. కానీ లోతుగా పరిశీలిస్తే, ఈ దినోత్సవం మానవ మేధస్సు వికాస చరిత్రను, ఆలోచనా క్రమాల పరిణామాన్ని, సమస్య పరిష్కార సంస్కృతిని గుర్తు చేసే ఒక మేధో ప్రతీకగా నిలుస్తుంది. పజిల్ అనేది కేవలం విడి ముక్కలను కలిపే ఆట కాదు; అది మానవ ఆలోచనల నిర్మాణాన్ని పరీక్షించే ఒక మానసిక వ్యాయామం. అందుకే జాతీయ పజిల్ దినోత్సవం అనేది ఆటకు అంకితం చేసిన రోజు కాకుండా, ఆలోచనకు అంకితం చేసిన రోజు అని చెప్పుకోవచ్చు. పజిల్ భావన మానవ నాగరికతతో సమకాలీనంగా పుట్టిందని చరిత్ర చెబుతోంది. ప్రాచీన ఈజిప్టు నాగరికతలో గణిత సమస్యలు, కొలతల ఆధారంగా రూపొందించిన మేధో పరీక్షలు పజిల్ స్వరూపాలుగా కనిపిస్తాయి. క్రీ.పూ. 1650 నాటికి చెందిన రైండ్ మ్యాథమెటికల్ పాపిరస్‌లో ఇప్పటికీ పరిష్కరించగలిగే గణిత పజిళ్లు లభించడం, ఆ కాలంలోనే సమస్యల పరిష్కారానికి తార్కిక ఆలోచనకు ఎంత ప్రాధాన్యం ఇచ్చారో సూచిస్తుంది. గ్రీకు తత్వవేత్తలు ప్లేటో, అరిస్టాటిల్ తమ శిష్యులకు తర్కాన్ని అలవర్చేందుకు ప్రశ్నోత్తర పద్ధతిని ఉపయోగించేవారు. ఇవన్నీ ఆధునిక పజిల్ సంస్కృతికి పునాదులుగా నిలిచాయి.

భారతీయ సంస్కృతిలో పజిల్ భావన మరింత జీవంతో కనిపిస్తుంది. వేదకాలం నుంచే సూక్తుల రూపంలో, సూత్రాల రూపంలో ప్రశ్నలు, సంకేతాలు ఉపయోగించారు. ఉపనిషత్తులలో కనిపించే 'కో అహం?', 'తత్త్వమసి' వంటి ప్రశ్నలు మానవ ఆలోచనను లోతుగా కదిలించే మేధో పజిళ్లే. పురాణాల్లో బేతాళ ప్రశ్నలు, పంచతంత్ర కథల్లో నైతిక పజిళ్లు, తెనాలి రామకృష్ణుడి కథల్లో తక్షణ బుద్ధిని పరీక్షించే సంఘటనలు ? ఇవన్నీ భారతీయ పజిల్ సంప్రదాయానికి సజీవ సాక్ష్యాలు. ఈ కథలన్నింటిలో ఒకే లక్షణం స్పష్టంగా కనిపిస్తుంది ? సమస్యకు బలం కంటే బుద్ధే పరిష్కారం. ఆధునిక అర్థంలో పజిల్ చరిత్రను పరిశీలిస్తే, క్రీ.శ. 1760లో లండన్‌కు చెందిన జాన్ స్పిల్స్‌బరీ రూపొందించిన చెక్క మ్యాప్ పజిల్ ఒక కీలక మలుపుగా నిలుస్తుంది. విద్యార్థులకు భూగోళ విజ్ఞానం నేర్పాలనే ఉద్దేశంతో ఆయన తయారు చేసిన ఈ పజిల్, కాలక్రమేణా జిగ్‌సా పజిల్‌గా రూపాంతరం చెందింది. 19వ శతాబ్దం చివరికి యూరప్, అమెరికాలో పజిళ్లు కుటుంబ వినోదంగా మారాయి. 1900ల ప్రారంభంలో పత్రికల్లో క్రాస్‌వర్డ్ పజిళ్లు ప్రవేశించడం ద్వారా పజిల్ సంస్కృతి సామాన్య ప్రజల జీవితంలోకి అడుగు పెట్టింది. 1913లో 'న్యూయార్క్ వరల్డ్' పత్రికలో ప్రచురితమైన తొలి క్రాస్‌వర్డ్ పజిల్, అమెరికాలో పజిల్ విప్లవానికి నాంది పలికింది. జాతీయ పజిల్ దినోత్సవం ఆవిర్భావం కూడా ఈ పజిల్ విస్తరణకు అనుసంధానమే. అమెరికాలో మేధో వికాసాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో, పజిళ్ల సామాజిక ప్రాధాన్యాన్ని గుర్తుచేసేందుకు జనవరి 29ను ప్రత్యేక దినంగా ఎంపిక చేశారు. ఈ తేదీ ఎంపిక వెనుక స్పష్టమైన భావన ఉంది. శీతాకాలంలో శారీరక చురుకుదనం తగ్గే సమయంలో, మానసిక చురుకుదనాన్ని పెంచే చర్యలపై దృష్టి పెట్టాలనే ఉద్దేశమే దీనికి మూలం. నేడు ఈ దినోత్సవం అమెరికాకే పరిమితం కాకుండా, యూరప్, ఆసియా, ఆస్ట్రేలియా వంటి ప్రాంతాల్లోనూ గుర్తింపు పొందింది. పజిళ్ల రూపాలు కాలానుగుణంగా మారినా, వాటి లక్ష్యం మాత్రం ఒకటే ? ఆలోచనను ప్రేరేపించడం. జిగ్‌సా పజిళ్లు దృశ్య స్మృతి, సహనం, స్థలిక అవగాహనను పెంపొందిస్తాయి. క్రాస్‌వర్డ్ పజిళ్లు భాషా పరిజ్ఞానాన్ని, పదసంపదను విస్తరిస్తాయి. సూడోకు, మ్యాజిక్ స్క్వేర్ వంటి గణిత పజిళ్లు తార్కిక ఆలోచనకు పదును పెడతాయి. రిడిల్స్, బ్రెయిన్ టీజర్లు సృజనాత్మక ఆలోచనను ప్రోత్సహిస్తాయి. డిజిటల్ యుగంలో మొబైల్ యాప్‌లు, ఆన్లైన్ గేమ్స్ రూపంలో పజిళ్లు మరింత విస్తరించాయి. ప్రపంచ వ్యాప్తంగా గణాంకాలను పరిశీలిస్తే, పజిల్ గేమ్స్ మార్కెట్ విలువ 2024 నాటికి సుమారు 11 బిలియన్ అమెరికన్ డాలర్లకు చేరిందని అధ్యయనాలు చెబుతున్నాయి. ఇది పజిళ్లపై పెరుగుతున్న ఆసక్తికి స్పష్టమైన సూచిక.పజిళ్లు మానవ మెదడుపై చూపే ప్రభావాన్ని శాస్త్రీయంగా పరిశీలించిన పరిశోధనలు కూడా అనేకం ఉన్నాయి. అమెరికాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ నిర్వహించిన అధ్యయనాల ప్రకారం, నిరంతరం పజిళ్లు పరిష్కరించే వారిలో జ్ఞాపకశక్తి మెరుగ్గా ఉండటమే కాకుండా, మానసిక ఒత్తిడి స్థాయి సగటున 20 నుంచి 30 శాతం వరకు తగ్గినట్లు గుర్తించారు. బ్రిటన్‌లో నిర్వహించిన మరో పరిశోధనలో, వృద్ధుల్లో సూడోకు, క్రాస్‌వర్డ్ వంటి పజిళ్లను అలవాటు చేయడం వల్ల అల్జీమర్స్ లక్షణాలు సగటున ఐదు నుంచి ఏడు సంవత్సరాల వరకు ఆలస్యంగా కనిపించినట్లు తేలింది. ఈ గణాంకాలు పజిళ్లు కేవలం వినోద సాధనాలు కాకుండా, మానసిక ఆరోగ్యానికి ఔషధాల్లాంటివని నిరూపిస్తున్నాయి. విద్యా రంగంలో పజిళ్ల పాత్ర మరింత కీలకంగా మారుతోంది. సంప్రదాయ బోధన పద్ధతుల్లో విద్యార్థి వినే స్థితిలో ఉంటే, పజిల్ ఆధారిత బోధనలో విద్యార్థి ఆలోచించే స్థితిలో ఉంటాడు. యునెస్కో నివేదికల ప్రకారం, పజిల్ ఆధారిత బోధనను అమలు చేసిన పాఠశాలల్లో విద్యార్థుల సమస్య పరిష్కార సామర్థ్యం సుమారు 40 శాతం వరకు మెరుగైనట్లు తేలింది. భారతదేశంలో కూడా నూతన విద్యా విధానం ఆలోచనా నైపుణ్యాలపై దృష్టి పెట్టడం, పజిల్ సంస్కృతికి అనుకూలమైన మార్పుగా భావించవచ్చు.సామాజికంగా చూస్తే, పజిళ్లు వ్యక్తిగత వినోదాన్ని దాటి సామూహిక అనుభూతిగా మారాయి. కుటుంబ సభ్యులు కలిసి పజిల్ పరిష్కరించడం ద్వారా పరస్పర సంభాషణ పెరుగుతుంది. కార్యాలయాల్లో టీమ్ బిల్డింగ్ కార్యక్రమాల్లో పజిళ్లను ఉపయోగించడం ద్వారా సమన్వయం, సహకారం పెరుగుతుందని కార్పొరేట్ అధ్యయనాలు సూచిస్తున్నాయి. పజిల్ అనేది ఒక సమస్య మాత్రమే కాదు; అది ఒక సంభాషణకు, ఒక ఆలోచనా ప్రయాణానికి ప్రారంభ బిందువు. జాతీయ పజిల్ దినోత్సవం ఇచ్చే ప్రధాన సందేశం చాలా సరళమైనదే అయినా లోతైనది. వేగంగా మారుతున్న ప్రపంచంలో తక్షణ పరిష్కారాల కోసం పరుగులు తీస్తున్న మనిషికి, పజిళ్లు ఓర్పు, క్రమబద్ధత, లోతైన ఆలోచన అవసరమని గుర్తు చేస్తాయి. ప్రతి సమస్యకు బలం, శక్తి అవసరం లేదని; సరైన ఆలోచన ఉంటే పరిష్కారం దొరుకుతుందనే నమ్మకాన్ని పజిళ్లు నాటుతాయి.జనవరి 29న జరుపుకునే జాతీయ పజిల్ దినోత్సవం, మేధస్సు ఆరోగ్యాన్ని పండుగలా జరుపుకునే అరుదైన సందర్భం. వినోదం పేరుతో ఆలోచనను పక్కన పెట్టే కాలంలో, ఆలోచననే వినోదంగా మార్చిన సంస్కృతికి ఇది ప్రతీక. పజిళ్లు మనిషిని ఆటలో ముంచుతూనే, ఆలోచనలో నిలిపేస్తాయి. అందుకే ఈ దినోత్సవం ఒక తేదీ మాత్రమే కాదు; మానవ మేధస్సు విలువను గుర్తు చేసే ఒక నిరంతర సందేశం.

ఇరాన్ దిశగా మరిన్ని యుద్ధనౌకలు

హైదరాబాద్ పెన్ పవర్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు మరోసారి హెచ్చరికలు చేశారు. మరిన్ని యుద్ధనౌకలు ఆ దేశం దిశగా కదులుతున్నాయని పేర్కొన్నారు. వాటిని వినియోగించే అవసరం రాకూడదని తాను ఆశిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే యూఎస్‌కు చెందిన విమాన వాహకనౌక యూఎస్ఎస్ అబ్రహం లింకన్ పశ్చిమాసియాకు చేరుకొన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో మరిన్ని యుద్ధనౌకల గురించి ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ఉద్రిక్తతలను మరింత పెంచాయి. 'ప్రస్తుతం మరో అందమైన యుద్ధనౌక ఇరాన్ వైపు ప్రయాణిస్తోంది. వారు ఒక ఒప్పందం చేసుకుంటారని ఆశిస్తున్నాం. ఇప్పటికే వారు దాన్ని చేసుకోవాల్సి ఉంది. అయితే అందుకు వారు సిద్ధంగా ఉన్నారని నాకు తెలుసు. వాళ్లు నాకు చాలాసార్లు ఫోన్ చేశారు' అని ట్రంప్ అన్నారు. అదనపు వైమానిక రక్షణ వ్యవస్థలను ఈ ప్రాంతానికి తరలిస్తున్నట్లు అమెరికా అధికారి ఒకరు తెలిపారు. ఇరాన్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా జరిగిన ఘర్షణల్లో వేల మంది ప్రాణాలు కోల్పోయారు. దీనిపై ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో అబ్రహం లింకన్ వాహక నౌకతో సహా పలు యుద్ధ నౌకలను పశ్చిమాసియాలో మోహరించారు. దీంతో ఇరాన్‌పై యూఎస్ ఏ క్షణాన దాడి చేస్తుందోనన్న భయాందోళనలు నెలకొన్నాయి.

పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కు చూపు పోయే ముప్పు..!

హైదరాబాద్ పెన్ పవర్: పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ ఆరోగ్య పరిస్థితిపై ఆందోళన వ్యక్తమవుతోంది. తమ నేతకు వెంటనే చికిత్స అందించకపోతే.. కంటిచూపు పోయే ప్రమాదం ఉందని పాకిస్థాన్ తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్ (పీటీఐ) వర్గాలు పేర్కొన్నాయి. స్థానిక మీడియా కథనాల ప్రకారం.. ఇమ్రాన్‌ఖాన్ కుడి కంటిలో సమస్య తలెత్తిందని, దానికి వెంటనే చికిత్స అందించకపోతే చూపుపోయే ప్రమాదం ఉందని పార్టీ వర్గాలు ఆందోళన వ్యక్తంచేశాయి. వెంటనే ఆయన్ను ఆసుపత్రికి తరలించాలని డిమాండ్ చేశాయి. వైద్యుల సూచనను పట్టించుకోకుండా జైల్లోనే ఆయనకు చికిత్స అందించాలని జైలు అధికారులు పట్టుబడుతున్నారని ఆరోపించాయి. 2024 అక్టోబర్‌లో ఇమ్రాన్ తన వ్యక్తిగత వైద్యుడి వద్ద పరీక్షలు చేయించుకున్నారని, ఆ తర్వాత నుంచి ఆ డాక్టర్‌ను కలిసేందుకు అనుమతించడం లేదని వెల్లడించాయి.

వినాశనానికి మరింత దగ్గరైన ప్రపంచం!

హైదరాబాద్ పెన్ పవర్: ప్రపంచం మునుపెన్నడూ లేనంతగా విధ్వంసానికి చేరువైందని 'బులెటిన్ ఆఫ్ ద అటామిక్ సైంటిస్ట్స్' అనే స్వచ్ఛంద సంస్థ పేర్కొంది. అమెరికా, రష్యా, చైనా, ఇతర దేశాలు దుందుడుకుగా వ్యవహరించడం, శత్రుభావాలు, జాతీయవాదం పెరగడం వంటివి ఇందుకు కారణమని వివరించింది. దీంతో 'డూమ్స్‌డే గడియారం'లో అర్ధరాత్రికి 85 సెకన్ల దూరంలోనే ఉంది. వినాశనానికి మానవాళి ఎంత దూరంలో ఉందన్నది బులెటిన్ ఆఫ్ ద అటామిక్ సైంటిస్ట్స్ విశ్లేషిస్తుంది. ఒక ఊహాజనిత గడియారంపై అర్ధరాత్రి 12 గంటల సమయాన్ని వినాశనానికి సూచికగా అభివర్ణిస్తుంది. దీన్ని డూమ్స్‌డే క్లాక్‌గా పిలుస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిస్థితులకు అనుగుణంగా ఈ సమయాన్ని ముందుకు, వెనక్కి జరుపుతుంటుంది. గత ఏడాది గడియారాన్ని అర్ధరాత్రికి 89 సెకన్లకు చేరువ చేసింది. అణ్వస్త్ర దేశాలతో ప్రమేయమున్న ఘర్షణలు పెరిగే ప్రమాదం ఉందని సంస్థ తెలిపింది. ఈ సందర్భంగా రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ప్రస్తావించింది. భారత్, పాకిస్థాన్ మధ్య గత ఏడాది మే నెలలో జరిగిన ఘర్షణలనూ ఉదహరించింది. అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన దాడుల తర్వాత ఇరాన్ అణ్వాస్త్రాన్ని సమకూర్చుకోవచ్చన్న ఆందోళన పెరిగిందని తెలిపింది. మొత్తంమీద అణుయుద్ధం ముప్పు, వాతావరణ మార్పులు, బయోటెక్నాలజీని దుర్వినియోగం చేసే అవకాశం, సరైన నియంత్రణలు లేకుండా కృత్రిమ మేధ(ఏఐ) వాడకం వంటివి పెరిగాయని వివరించింది. ఈ నేపథ్యంలో డూమ్స్‌డే గడియారంలోని సమయాన్ని అర్ధరాత్రికి మరో 4 సెకన్ల మేర ముందుకు జరిపినట్లు వివరించింది.

అమెరికాలో మంచు తుఫాను వల్ల 38 మంది మృతి

హైదరాబాద్ పెన్ పవర్: అమెరికాలో మంచు తుఫాను విరుచుకుపడింది. మధ్య, తూర్పు అమెరికాలోని చాలా ప్రాంతాల్లో మంచు గడ్డకట్టింది. ఈ మంచు తుఫాను వల్ల మంగళవారం నాటికి 14 రాష్ట్రాల్లో 38 మంది మృతి చెందారు. ఈ విషయాన్ని స్థానిక మీడియా వెల్లడించింది. ఈ మంచు తుఫాను జనవరి 23వ తేదీ నుంచే ప్రారంభమైంది. విపరీతమైన మంచు వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జనవరి 26వ తేదీన విద్యుత్ అంతరాయమేర్పడింది. పలు విమానాలు రద్దయ్యాయి. రోడ్లపై వాహనాల రాకపోకల్ని నిలిపివేయడం జరిగింది. ఇక జనవరి 27 మంగళవారం నాటికి దేశవ్యాప్తంగా 550,000 కంటే ఎక్కువ ఇళ్లకు, వ్యాపారాలకు విద్యుత్ సరఫరా లేదు. అయితే రెస్క్యూ ఆపరేషన్స్ ద్వారా నివాసితుల్ని, ప్రత్యేకంగా ఇళ్లులేని ప్రజలను సురక్షితంగా ఉండేలా నగర అధికారులు చర్యలు చేపట్టారు. నగరవాసుల్ని సురక్షితంగా ఉంచి, వారికి తగిన వనరుల్ని సమకూర్చారు. కాగా, న్యూయార్క్ నగరంలో మంచు తుఫాను వల్ల పదిమంది మృతి చెందారు. న్యూయార్క్‌లో గత ఎనిమిదేళ్లలో ఎన్నడూ లేనంత ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మంగళవారం ఆ నగరంలో 8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ విషయంపై నగర మేయర్ జోహ్రాన్ మమ్దానీ మీడియాతో మాట్లాడుతూ.. మంచు తుఫాను వల్ల న్యూయార్క్‌లో పదిమంది మృతి చెందారు. అయితే వారు నిరాశ్రయులా కాదా అనేది స్పష్టంగా తెలియలేదు అని అన్నారు.

ఇమ్మిగ్రేషన్ విధానంపై అమెరికన్ల ఆగ్రహం

హైదరాబాద్ పెన్ పవర్: అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న ఇమ్మిగ్రేషన్ విధానాన్ని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. రాయిటర్స్/ ఇప్సోస్ నిర్వహించిన పోల్‌ను పరిశీలిస్తే ట్రంప్ విధానానికి మద్దతు ఇచ్చే వారి సంఖ్య తగ్గుతూ వస్తున్నట్లు స్పష్టమవుతోంది. ముఖ్యంగా ఇమ్మిగ్రేషన్ ఏజెంట్లు ఈ నెలలో మిన్నెపొలిస్‌లో ఇద్దరిని కాల్చి చంపడంపై అమెరికన్లు ఆగ్రహిస్తున్నారు. ఈ నెల 23-25 తేదీల మధ్య అమెరికా వ్యాప్తంగా ఈ పోల్‌ను నిర్వహించారు. రెండోసారి అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన తర్వాత ట్రంప్ అవలంబిస్తున్న వలసవాద విధానాలపై ప్రజల్లో సానుకూలత కనిష్ట స్థాయికి చేరడం ఇదే మొదటిసారి. అమెరికాలోని వివిధ నగరాలకు ఇమ్మిగ్రేషన్ ఏజెంట్లను పంపడాన్ని నిరసిస్తూ మిన్నెపొలిస్‌లో కిందటి వారం నిరసన ప్రదర్శనలు జరిగాయి.. రాయిటర్స్/ఇప్సోస్ పోల్‌పై ఈ ఘటన ప్రభావం చూపింది. ట్రంప్ ఇమ్మిగ్రేషన్ విధానాన్ని ఏకంగా 53 శాతం మంది అమెరికన్లు వ్యతిరేకించారు. 39 శాతం మంది మాత్రమే సానుకూలంగా స్పందించారు. ఈ పోల్‌కు ముందు ఈ సానుకూలత 41 శాతంగా నమోదైంది. పోల్ సందర్భంగా 1,139 మంది పౌరుల అభిప్రాయాలను సేకరించారు. గత సంవత్సరం ఫిబ్రవరిలో నిర్వహించిన పోల్‌లో ఇమ్మిగ్రేషన్ విధానాన్ని 50 శాతం మంది సమర్థించగా 41 శాతం మంది వ్యతిరేకించారు. ఇదిలావుండగా తాజాగా ఆసంస్థలు జరిపిన సర్వేలో అధ్యక్షుడు ట్రంప్ రేటింగ్ కూడా దారుణంగా పడిపోయింది. కేవలం 38 శాతం మంది మాత్రమే ఆయనను సమర్థించారు. రెండోసారి అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన తర్వాత ట్రంప్ రేటింగ్ ఈ స్థాయికి పడిపోవడం ఇదే మొదటిసారి. ఈ నెల 12, 13 తేదీలలో నిర్వహించిన పోల్‌లో ఆయనకు 41 శాతం మంది మద్దతు తెలిపారు. ఇమ్మిగ్రేషన్స్-కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అతిగా ప్రవర్తిస్తున్నారని 58 శాతం మంది అభిప్రాయపడ్డారు. ప్రతి పది మంది రిపబ్లికన్లలో ఇద్దరు కూడా ఇదే అభిప్రాయంతో ఉన్నారు.

తెలంగాణ విమోచన పోరాట యోధుడు

నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, ఖాసిం రజ్వీ ఆధ్వర్యంలో రజాకార్ల దౌర్జన్యాలను ఎదిరించడానికి, నైజాం సర్కారు అంతానికి, హైదరాబాద్ రాజ్య, తెలంగాణ ప్రాంత విమోచోద్యమం నిర్వహించారు. ఎందరో ఎన్నో పోరాట రూపాలను నిర్వహించారు. ఎందరో ఎన్నో త్యాగాలు చేశారు. అలాంటి త్యాగమూర్తులలో చోళ లింగయ్య ఒకరు. నేతాజీ స్ఫూర్తితో, ఇండియన్ నేషనల్ ఆర్మీ లో పని చేస్తున్న లింగయ్య తన ఉద్యోగానికి తృణప్రాయంగా త్యజించి, ఆర్మీలో తనకున్న అనుభవంతో, సాయుధ పోరాటానికి తెర లేపి, రక్షణ దళాలను ఏర్పాటు చేశారు. హైదరాబాదు సంస్థానాధీశుడు ఏడవ నిజాం నవాబు ఉస్మాన్ ఆలీ ఖాన్ నుంచి విముక్తి కోసం సంస్థాన ప్రజలు 1946 నుంచి 1948 మధ్య చేసిన వీరోచిత పోరాటమే తెలంగాణ విమోచనోద్యమం. భారత దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించినా, నిజాం సంస్థానంలోని ప్రజలకు మాత్రం స్వాతంత్ర్యం లేకపోవడాన్ని ఇక్కడి ప్రజలు జీర్ణించు కోలేక పోయారు. దేశమంతటా స్వాతంత్ర్యోత్సవాలతో ప్రజలు ఆనందంతో మునిగి తేలగా, నిజాం సంస్థాన ప్రజలు మాత్రం నిరంకుశ బానిసత్వం నుండి స్వేచ్ఛా వాయువులు పీల్చ లేక పోయారు. నిజామ్ మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ రాజ్యాన్ని సొంతం చేసుకోవడానికి విశ్వప్రయత్నం చేస్తూ రజాకార్లను ఉసిగొల్పాడు. నిజాం ఇచ్చిన స్వేచ్ఛ తో, ఖాసిం రజ్వీ నేతృత్వంలోని రజాకార్లు గ్రామాలపైబడి దోపిడి చేయడం, ఇండ్లు తగలబెట్టడం, మాన భంగాలు, లూటీలు లాంటి నానా అరాచకాలు సృష్టించారు. మతోన్మాద చర్యల కారణంగా ప్రజల నుండి బలవంతపు వసూలు చేసుకున్న సొమ్ముతో విలాసాలు, జల్సాలు, భోగభాగ్యాలు చేసుకొనేవారు. దీనితో రామానందతీర్థ నేతృత్వంలో ఆర్యసమాజ్ ఉద్యమాలు, కమ్యూనిష్టుల ఆధ్వర్యంలో సాయుధ పోరాటాలు ఉధృతమయ్యాయి. మొదట నల్గొండ జిల్లాలో ప్రారంభమైన ఉద్యమం శరవేగంగా నైజాం సంస్థానం అంతటా విస్తరించింది. తెలంగాణ సాయుధ పోరాటంలో పురుషులు, స్త్రీలు, పిల్లలు అనే తేడాలు లేకుండా తుపాకులు, బడిసెలు పట్టి రజాకార్ల మూకలను తరిమి కొట్టారు. మహబూబ్ నగర్ జిల్లాలో అప్పంపల్లి, ఆదిలాబాదు జిల్లాలో నిర్మల్, సిర్పూర్, కరీంనగర్ జిల్లాలో మంథని, మహమ్మదాపూర్, నల్గొండ జిల్లాలో మల్లారెడ్డిగూడెం, నిజామాబాదు జిల్లా ఇందూరు, తదితర ప్రాంతాలలో పోరాటం పెద్దఎత్తున సాగింది. జమలాపురం కేశవరావు, లక్ష్మీ నరసయ్య, ఆరుట్ల కమలా దేవి, రావి నారాయణరెడ్డి, ధర్మభిక్షం, చండ్ర రాజేశ్వరరావు, బద్దం ఎల్లారెడ్డి, మగ్దూం మొహియుద్దీన్, షోయబ్ ఉల్లాఖాన్, మల్లు స్వరాజ్యం రాంజీగోండ్, విశ్వనాథ్ సూరి, దొడ్డి కొమరయ్య, బెల్లం నాగయ్య, కిషన్ తదితరులు తెలంగాణ విమోచనానికి కృషిచేశారు. వీరందరి కృషి, దాశరథి, కాళోజీల కవితల స్ఫూర్తితో సామాన్య ప్రజలు సైతం ఊరుఊ రున, వాడవాడన నిజాం పాలనపై తిరగబడ్డారు. కర్రలు, బరిసెలు, గుత్పలు, కారం ముంతలు, చేతికి అందుబాటులో ఉందల్లా ఆయుధాలుగా మలుచుకొని పోరాడారు. తుపాకులను సంపాదించుకొని యుద్ధరంగం లోకి దిగారు. ఇలా వివిధ జిల్లాలలో తెలంగాణ విమోచన పోరాటాలు కొనసాగాయి. అందులో భాగంగానే మెదక్ పట్టణానికి చెందిన చోళ లింగయ్య ఇండీయన్ నేషనల్ ఆర్మీలోని ఇంజనీర్ ఉద్యోగానికి రాజీనామా చేసి తనకున్న మిలటరీ పరిజ్ఞానంతో రజాకార్ల దాడులను తిప్పికొట్టడం కోసం రక్షణ దళాన్ని ఏర్పాటు చేశారు. తెలంగాణ విమోచన పోరాట యోధునిగా పేరుపొందిన చోళ లింగయ్య జూన్ 13, 1913న మెదక్ పట్టణంలో జన్మించారు. పాఠశాల దశలోనే విద్యార్థి సంఘాలను ఏర్పాటు చేశారు. గాంధీ - నెహ్రూ చిత్రపటాలను అవిష్కరించి నందుకు పాఠశాల నుంచి బహిష్కృతులైనారు. 1942లో భారత వైమానిక దళంలో చేరారు. ఇండియన్ నేషనల్ ఆర్మీ ఎయిర్ ఫోర్స్ గ్రౌండ్‌లో పనిచేసిన చోళ లింగయ్య... సుభాష్ చంద్రబోస్ పిలుపును అందుకొని ఉద్యోగానికి రాజీనామా చేశారు. బోస్ ఆచూకీ లభ్యం కాని స్థితిలో ఆయన హైదరా బాదుకు వచ్చి తెలంగాణ విమోచన ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. 1947, ఆగస్టు 15న మెదక్ పట్టణంలోని పటేల్ కుంటలో జాతీయ జెండాను ఆవిష్కరించిన పిదప అరెస్ట్ వారెంట్ జారీ కావడంతో అజ్ఞాతంలోకి వెళ్ళారు. నిజాం సర్కారు లింగయ్యను 1947 సెప్టెంబరు 10న అరెస్ట్ చేసి 7 నెలల పాటు హైదరాబాదులోని చంచల్‌గూడ జైలులో ఉంచింది. విమోచన అనంతరం లింగయ్య హైదరాబాదు రాష్ట్ర కాంగ్రెస్ సభ్యులుగా, ఆలిండియా కాంగ్రెస్ డెలిగేట్‌గా, 1977లో మెదక్ జిల్లా పార్టీ కోశాధికారిగా పనిచేశారు. 2010 జనవరి 29న పోరాట యోధుడు లింగయ్య మరణించారు. చివరికి భారత ప్రభుత్వం సర్దార్ పటేల్ నేతృత్వంలో సైనిక చర్యతో నైజాం సంస్థానాన్ని 1948 సెప్టెంబర్ 18న భారత్ యూనియన్‌లో విలీనం చేసుకుంది.

దక్షిణ కొరియా మాజీ ప్రథమ మహిళకు జైలు శిక్ష

హైదరాబాద్ పెన్ పవర్: అవినీతి కేసులో దక్షిణ కొరియా మాజీ ప్రథమ మహిళ కిమ్ కియోన్ హీకి కోర్టు బుధవారం 20 నెలల జైలు శిక్ష విధించింది. వ్యాపార ప్రయోజనాల కోసం యూనిఫికేషన్ చర్చి నుండి లంచాలు తీసుకున్నందుకు సియోల్ సెంట్రల్ డిస్ట్రిక్ట్ కోర్టు తీర్పునిచ్చింది. గతేడాది మాజీ అధ్యక్షుడు యూన్‌సుక్ యోల్ దేశంలో మార్షల్ లా విధించినందుకు, కుంభకోణాలకు పాల్పడిన కేసుల్లో మరో మూడు వారాల్లో తీర్పు వెలువడనున్న సంగతి తెలిసిందే. స్టాక్ ధరల తారుమారు మరియు రాజకీయనిధుల చట్టాన్ని ఉల్లంఘించిన ఆరోపణలపై మాజీ అధ్యక్షుడు యున్ సుక్ యోల్ భార్య కిమ్‌కి కోర్టు ఈ శిక్ష విధించింది.రాజకీయ ప్రయోజనాల కోసం దక్షిణ కొరియా యునిఫికేషన్ చర్చి నుండి లగ్జరీ చానెల్ బ్యాగ్‌లు మరియు డైమండ్ నెక్లెస్‌ను స్వీకరించడం వంటి ఆరోపణలపై ఆమెకు న్యాయవా దులు 15 ఏళ్ల జైలుశిక్ష, 2.9బిలియన్ల జరిమానా (2మిలియన్ డాలర్లు) విధించాలని డిమాండ్ చేశారు. స్టాక్ ధరలను మార్చడం, రాజకీయ నిధుల చట్టాలను ఉల్లంఘించిన కేసుల్లో కిమ్‌ను దోషిగా నిర్ధారించడానికి తగిన ఆధారాలు లేవని కోర్టు పేర్కొంది.

ఇంధన మార్కెట్లలో భారత్ కీలక వృద్ధి: కెనడా

హైదరాబాద్ పెన్ పవర్: గోవాలో జరుగుతున్న భారత ఇంధన వారోత్సవాలకు కెనడా ఇంధన శాఖా మంత్రి టిమ్ హోడ్గ్సన్ హాజరయ్యారు. ఈ వారోత్సవాల్లో పాల్గొన్న టిమ్ మాట్లాడుతూ.. భారతదేశం ప్రపంచంలోని అత్యంత కీలకమైన ఇంధన మార్కెట్లలో ఒకటిగా అభివృద్ధి చెందుతోంది. ప్రపంచ డిమాండ్ పెరుగుతున్న కొద్దీ కెనడా భారత్‌తో వాణిజ్యాన్ని పెంచుకుంటుంది అని ఆయన అన్నారు. ఇరు దేశాలు ఇంధన సహకార మద్దతుకు ఈ వారోత్సవం మంచి అవకాశమని ఆయన అన్నారు. కాగా, ఇండియాలో ఎనర్జీ వీక్‌లో తాను పాల్గొంటున్నాని, ఈ సందర్భంగా తాను తొలిసారిగా భారత్‌లో పర్యటిస్తున్నట్లు.. టిమ్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. గత ఎనిమిది సంవత్సరాల్లో కెనడా- భారత్‌లు ఇంధనంపై చర్చలు జరపలేదు. ఈ ఇంధన వారోత్సవాల ద్వారా మొదటిసారిగా ఇరుదేశాలు ఇంధనంపై చర్చలకు ఉపయోగపడనుందని ఆయన అన్నారు. కెనడా ఎనర్జీ సూపర్ పవర్ కావాలనుకుంటే.. మా ఇంధనం, సహజ వనరులతో ప్రపంచంలోని అతిపెద్ద ఇంధన మార్కెట్లలో ఒకటైన భారతదేశంతో వ్యాపారం చేయాలి' అని టిమ్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.

తొలి రోజు పార్లమెంట్ షూరు

హైదరాబాద్ పెన్ పవర్: బడ్జెట్ సమావేశాల సందర్భంగా తొలి రోజు పార్లమెంట్ ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి దౌపది ముర్ము ప్రసంగించారు. సామాజిక న్యాయం, పురోగతి, అభివద్ధే ప్రాధాన్యతగా కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని కొనియాడారు. 25 కోట్ల మంది పేదరిక నుంచి విముక్తి లభించిందని, దళిత్, వెనుకబడిన తరగతుల, ఎస్టీ తెగల ఉన్నతికి కృషి చేస్తోందని,2047 ఏడాది నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ గుర్తింపు బడుతోందని దీమా వ్యక్తం చేశారు. అంతకముందు సభ ప్రారంభానికి ముందు పీఎం మోడీ, ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్, రాజ్యసభ ప్రతిపక్షనాయకుడు మల్లిఖార్జున ఖర్గే తదితరులు స్వాగతం పలికారు. బడ్జెట్ సమావేశాలు 65 రోజుల పాటు 30 సమావేశాలు జరుగుతాయి. ఫిబ్రవరి ఒకటో తేదీన కేంద్ర ఆర

ఆర్థిక సర్వే అంచనాలను వాస్తవ వృద్ధి అధిగమిస్తోంది!

హైదరాబాద్ పెన్ పవర్: మనదేశ ఆర్థిక వృద్ధి గణాంకాలను పరిశీలిస్తే, ఆర్థిక సర్వేలో ప్రకటించిన అంచనాలను తరచుగా అధిగమిస్తున్నాయి. బడ్జెట్ ముందస్తు పత్రం (ప్రీ-బడ్జెట్ డాక్యుమెంట్)లో అంచనా వేసిన 6.3-6.8% వృద్ధికి మించి 2025-26 ఆర్థిక సంవత్సరంలో 7.4% వృద్ధిరేటు నమోదవుతుందని అంచనా. 2023-24 ఆర్థిక సర్వేలో జీడీపీ వృద్ధి 6-6.8 శాతమని అంచనా వేయగా, అది 9.2 శాతంగా నమోదైంది. 2024-25లో మాత్రం ఆర్థిక సర్వే అంచనా 6.5-7 శాతానికి అనుగుణంగా, 6.5 శాతంగా నమోదైంది. 2022-23లో లక్ష్యం నెరవేరలేదు. వాస్తవిక ఆర్థిక వృద్ధి 7.65% ఉండగా, ఆర్థిక సర్వే అంచనా 8-8.5 శాతంగా ఉంది. 2021-22లో కొవిడ్ కారణంగా ఆర్థిక సర్వే ఎలాంటి అంచనాలను వేయలేదు. కానీ బేస్ ప్రభావం కారణంగా 9.7% వృద్ధి నమోదైంది. 2020-21లో కొవిడ్ ప్రభావం, తదనంతర లాక్‌డౌన్‌ల కారణంగా 5.8% ప్రతికూల వృద్ధి నమోదైంది. ఫిబ్రవరి 1న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుండగా, దీనికి ఒకరోజు ముందు ఆర్థిక సర్వేను వెల్లడిస్తారు.

ఆల్ టైం కనిష్టానికి ఇరాన్ కరెన్సీ.. డాలరుకు 15 లక్షల రియాల్స్

హైదరాబాద్ పెన్ పవర్: ఇరాన్ కరెన్సీ అయిన ఇరానియన్ రియాల్ మళ్లీ భారీగా పడిపోయింది. ఓపెన్ మార్కెట్‌లో ఒక అమెరికన్ డాలర్‌కు ఆల్ టైమ్ కనిష్టంగా సుమారు 14.7 లక్షల నుంచి 15 లక్షల రియాల్స్ వరకు డౌన్ అయింది. ఇది ఇరాన్ చరిత్రలోనే అత్యల్ప స్థాయి కావడం గమనార్హం. 2025 చివరితో పోలిస్తే రియాల్ విలువ దాదాపు 20 నుంచి 30 శాతం వరకు పడిపోయింది. అయితే ఇరాన్ సెంట్రల్ బ్యాంక్ ప్రకటించే అధికారిక రేటు సుమారు 42 వేల రియాల్స్‌గా ఉన్నప్పటికీ, ఆ రేటును సాధారణంగా ఎవరూ ఉపయోగించరు. దేశంలో వాస్తవంగా జరిగే లావాదేవీలు అన్నీ ఓపెన్ మార్కెట్ రేటు ప్రకారమే జరుగుతున్నాయి. ఇరాన్ కరెన్సీ పతనానికి అనేక కారణాలు ఉన్నాయి. ముఖ్యంగా అమెరికా సహా పశ్చిమ దేశాల ఆర్థిక ఆంక్షల వల్ల ఇరాన్‌కు చమురు ఎగుమతులు తగ్గాయి. విదేశీ కరెన్సీ దేశంలోకి రావడం బాగా తగ్గిపోయింది. మరోవైపు దేశంలో ద్రవ్యోల్బణం తీవ్రంగా పెరిగింది. 2025 డిసెంబర్ నాటికి ఇన్‌ఫ్లేషన్ 40 శాతానికి పైగా ఉండగా, ఆహార పదార్థాల ధరలు 70 శాతం కంటే ఎక్కువగా పెరిగాయి. ధరల పెరుగుదలతో ప్రజలు ఆందోళనకు గురై దేశవ్యాప్తంగా నిరసనలు కూడా చేశారు. ప్రభుత్వం తీసుకున్న కొన్ని ఆర్థిక నిర్ణయాలు, సబ్సిడీల తగ్గింపు, ఫారెక్స్ నియమాల్లో మార్పులు కూడా పరిస్థితిని మరింత దిగజారేలా మార్చాయి. ఇది సాధారణ ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఒక డాలర్‌కు 15 లక్షల రియాల్స్ అంటే దిగుమతి చేసుకునే ఆహారం, మందులు, టెక్నాలజీ వస్తువుల ధరలు భారీగా పెరిగిపోయినట్టేనని నిపుణులు చెబుతున్నారు. బ్రెడ్, మాంసం, ఔషధాలు వంటి అవసరమైన వస్తువులు కూడా సామాన్యులకు అందని స్థితికి చేరుతున్నాయి. ఇరాన్ ఇప్పుడు హైపర్ ఇన్‌ఫ్లేషన్ దశకు చేరిందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. అందుకే ప్రజలు తమ డబ్బు విలువ కాపాడుకోవడానికి డాలర్లు, బంగారం, క్రిప్టో కరెన్సీల్లో పెట్టుబడి పెడుతున్నారు. ప్రభుత్వం, సెంట్రల్ బ్యాంక్ మాత్రం దీనిని సహజ ప్రక్రియగా చెబుతున్నా, ఆర్థిక నిపుణులు ఇది తీవ్రమైన ఆర్థిక సంక్షోభమని, రాబోయే రోజుల్లో మరిన్ని నిరసనలకు దారితీసే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. మరోవైపు ఇరాన్ రియాల్ ప్రపంచంలోనే అతి తక్కువ విలువ గల కరెన్సీల జాబితాలో ఒకటిగా చేరింది.

ఎఫ్‌టీఏతో యూరప్‌లో భారతీయ ఐటీ సంస్థలకు మెరుగైన అవకాశాలు

హైదరాబాద్ పెన్ పవర్: ప్రతిష్టాత్మక ఇండియా-యూరోపియన్ యూనియన్(ఈయూ) స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం(ఎఫ్‌టీఏ) జరగడం పట్ల ఐటీ పరిశ్రమల సంఘం నాస్కామ్ హర్షం వ్యక్తం చేసింది. ఈ ఒప్పందం ద్వారా దేశంలోని టెక్ పరిశ్రమకు మెరుగైన ఈయూ మార్కెట్ యాక్సెస్ లభిస్తుంది. ప్రస్తుతం యూరప్ భారతీయ ఐటీ సేవల సంస్థలకు ఆశాజనకమైన కేంద్రంగా అభివృద్ధి చెందుతోంది. టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సీఎల్ టెక్ లాంటి సంస్థలు విస్తరిస్తున్నాయి. ఎఫ్‌టీఏ ద్వారా ఆయా కంపెనీలకు మరిన్ని ఒప్పందాలను సాధించడానికి సహాయపడుతుంది. వస్తువులపై గణనీయంగా సుంకాలు తగ్గనున్నప్పటికీ, సేవల రంగ లాభాల వల్ల మార్కెట్లో మరింత యాక్సెస్ లభిస్తుందని, నిబంధనల సడలింపు కలిసొస్తుందని నాస్కామ్ అభిప్రాయపడింది. ముఖ్యంగా ఎఫ్‌టీఏ ఖరారు కావడంతో భారతీయ ఐటీ ప్రొఫెషనల్స్‌కు అవకాశాలు మెరుగుపడతాయి. స్కిల్స్ ఉన్న ఉద్యోగులను సులభంగా బదిలీ చేయవచ్చని, సేవలను సజావుగా సరిహద్దు దాటేందుకు, సురక్షితమైన డేటా సరఫరాకు వీలవుతుంది. ఈ ఒప్పందంలో టెక్నాలజీ చిన్న భాగం కాదని నిపుణులు అంటున్నారు. ఇది భారత్‌ను ప్రపంచ ఐటీ లీడర్‌గా గుర్తిస్తుంది. డిజిటల్ వాణిజ్యం, ఈ-సేవలు, డేటా భద్రత, డిజిటల్ అథంటికేషన్‌ను ప్రోత్సహిస్తుంది. భారతీయ టెక్ కంపెనీలు యూరప్ డిజిటల్ ఆర్థిక వ్యవస్థతో మరింత లోతుగా కనెక్ట్ అవ్వడానికి సహాయపడుతుందని నాస్కామ్ పేర్కొంది.

ఒక్కరోజే రూ. 23 వేలు పెరిగిన వెండి

హైదరాబాద్ పెన్ పవర్: దేశీయ మార్కెట్లో వెండి ధరలు మరో కొత్త మైలురాయిని అధిగమించాయి. ఒక రోజు సెలవు తర్వాత ప్రారంభమైన ట్రేడింగ్ సెషన్‌లో ఎంసీఎక్స్ వెండి కిలో ఏకంగా రూ. 23 వేలకు పైగి రూ. 3.65 లక్షలకు కొత్త జీవితకాల గరిష్ఠానికి చేరాయి. ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ ప్రకారం, హైదరాబాద్ మార్కెట్లో మంగళవారం వెండి కిలో రూ. 22 వేలు పెరిగి రూ. 3.87 లక్షలకు చేరింది. ఇదే సమయంలో స్వచ్ఛమైన బంగారం 10 గ్రాములు స్వల్పంగా రూ. 770 తగ్గి రూ. 1,62,060కి చేరింది. ఆభరణాల తయారీ ఉపయోగించే 22 క్యారెట్ల పసిడి రూ. 700 తగ్గి రూ. 1,48,450 వద్ద ఉంది. ప్రపంచ ఆర్థిక, భౌగోళిక రాజకీయ అనిశ్చితి, పారిశ్రామిక డిమాండ్ వంటి పరిస్థితుల కారణంగా వెండి ధరలు ఈ నెలలో ఇప్పటివరకు 18 శాతం పెరిగాయి. సరఫరా పరిమితం కావడం, ఇన్వెస్టర్లలో రిస్క్ తీసుకునే సామర్థ్యం పెరగడం కూడా ఇందుకు మద్దతిచ్చాయి. గ్లోబల్ మార్కెట్లలోనూ వెండి ధరలు భారీగా పెరిగాయి. గతేడాది జనవరిలో ఔన్స్ వెండి 30 డాలర్లు ఉండగా, ప్రస్తుతం ఇది ఏకంగా 111 డాలర్లకు చేరింది. కేవలం ఏడాది వ్యవధిలో వీటి ధరలు 270 శాతం పెరగడం గమనార్హం. ఈ ఏడాదిలోనే ఇప్పటివరకు 50 శాతం పెరిగింది. స్పాట్ గోల్డ్ ఔన్స్ ధర 5,071 డాలర్లతో స్వల్పంగా దిగొచ్చింది. మరోవైపు, భారత ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి అందించ సానుకూల సంకేతాలతో పాటు ప్రతిష్టాత్మక ఇండియా-ఈయూ డీల్ లాభాలకు కారణమయ్యాయి. ఇదే సమయంలో భారత కరెన్సీ రూపాయి కొంత బలపడటం, ముడిచమురు ధరలు దిగి రావడంతో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ పుంజుకుంది. దీంతో మార్కెట్లు ముగిసే సమయానికి సెన్సెక్స్ 319.78 పాయింట్లు పెరిగి 81,857 వద్ద, నిఫ్టీ 126.75 పాయింట్లు లాభపడి 25,175 వద్ద ముగిశాయి. అమెరికా డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ రూ. 91.58 వద్ద ఉంది.

కొత్త భారత్ యాత్ర ట్రావెల్ కార్డును విడుదల చేసిన క్విక్-కామర్

హైదరాబాద్ పెన్ పవర్: ప్రముఖ క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్ బ్లింకిట్ కొత్త ట్రావెల్ కార్డును విడుదల చేసింది. తన ప్లాట్‌ఫామ్ ద్వారా భారత యాత్ర పేరుతో తెచ్చిన ఈ కార్డు నేషనల్ కామన్ మొబిలిటీ కార్డ్(ఎన్‌సీఎంసీ) ఆధారంగా పనిచేస్తుంది. బ్లింకిట్ ఈ కార్డును ఢిల్లీ ఎన్‌సీఆర్, బెంగళూరు, ముంబై, చెన్నై, అహ్మదాబాద్‌లలో అందుబాటులోకి తెచ్చింది. దీని ధర రూ. 50 ఉంటుందని, ఎలాంటి కేవైసీ ప్రక్రియ అవసరం లేదని కంపెనీ తెలిపింది. ఇదే సమయంలో ఒక్కో సిటీలో ఒక్కో ట్రావెల్ కార్డుల అవసరాన్ని కూడా తొలగిస్తుందని బ్లింకిట్ మాతృ సంస్థ ఎటర్నల్ గ్రూప్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ)గా త్వరలో బాధ్యతలు స్వీకరించనున్న అల్బిందర్ ధిండ్సా అన్నారు.ఇది రూపే ఆధారిత కార్డు, తక్షణం యూపీఐ టాప్-అప్ సౌకర్యంతో పనిచేస్తుంది.

దేశంలో వివిధ నగరాల్లో మెట్రో, బస్సులు వంటి ప్రజా రవాణాలో కీలకంగా ఉంటుందని ధిండ్సా వివరించారు. ఈ కార్డును భారత్ యాత్ర మొబైల్ అప్లికేషన్ ఉపయోగించి లింక్ చేయడం ద్వారా యాక్టివేట్ చేసుకోవచ్చు. ఇది ఐదేళ్ల కాలపరిమితితో వస్తుందని, వ్యాలెట్‌లో రూ. 2,000 వరకు యాడ్ చేసుకోవచ్చని బ్లింకిట్ పేర్కొంది. ప్రస్తుత దీన్ని ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై, అహ్మదాబాద్‌లోని మెట్రోలకు, ముంబై, చెన్నైలోని బస్సు ప్రయాణాలకు ఉపయోగించవచ్చు. భారత్ యాత్ర కార్డ్ ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్ ఫ్లిప్‌కార్ట్‌లో కూడా అందుబాటులో ఉంది.

హల్వా వేడుకలో పాల్గొన్న ఆర్థిక మంత్రి నిర్మలమ్మ

హైదరాబాద్ పెన్ పవర్: మరో మూడు రోజుల్లో కేంద్ర బడ్జెట్ వెలువడనున్న నేపథ్యంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారంనాడు సాంప్రదాయ 'హల్వా' వేడుకలో పాల్గొన్నారు.ఫిబ్రవరి 1న లోక్‌సభలో ప్రవేశపెట్టనున్న 2026-27 కేంద్ర బడ్జెట్ తయారీకి ఇది చివరి దశను సూచిస్తుంది. కర్తవ్య భవన్-ఈలోని కొత్త ప్రాంగణంలో ప్రింటింగ్ ప్రెస్ లేకపోవడంతో ఆర్థిక మంత్రిత్వ శాఖ పాత కార్యాలయం రాయ్‌సినా హిల్‌లోని నార్త్ బ్లాక్‌లో ఈ వేడుక జరిగింది. ఆర్థిక మంత్రి, ఆమె బృందంలోని చాలా మందిని గతేడాది సెప్టెంబర్‌లో ప్రతిష్టాత్మక నార్త్ బ్లాక్ నుంచి కర్తవ్య భవన్‌లో ఉన్న కొత్త కేంద్ర సచివాలయ కార్యాలయానికి మారిన సంగతి తెలిసిందే. ఈ వేడుకలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో పాటు సహాయమంత్రి పంకజ్ చౌదరీ, ఆర్థిక శాఖలోని పలు విభాగాల కార్యదర్శులు, బడ్జెట్ రూపొందించడంలో భాగస్వామ్యం ఉన్న అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం తర్వాత బడ్జెట్ ప్రెస్‌ను పరిశీలించిన ఆర్థిక మంత్రి, ప్రింటింగ్ ఎర్పాట్లను పరిశీలించారు. హల్వా వేడుక అంటే బడ్జెట్ లాక్-ఇన్?పీరియడ్. ఈ ప్రక్రియ బడ్జెట్ తయారీలో ప్రత్యక్షంగా పాల్గొనే అధికారులు, సిబ్బంది పార్లమెంట్‌లో వార్షిక పద్దును ప్రవేశపెట్టేవరకు ఆ నార్త్ బ్లాక్‌లోనే ఉంటారు. బడ్జెట్ ప్రకటన ముగిసేంతవరకు ఎవ్వరూ బయటకు వెళ్లేందుకు అవకాశం ఉండదు. అందరూ సీసీటీవీ కెమెరాలు, భద్రతా సిబ్బంది నిఘాలో ఉంటారు. పార్లమెంట్‌లో నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగం పూర్తయిన తర్వాత వారందరూ బయటకు వస్తారు. ఐదురోజులపాటు వారు నార్త్ బ్లాక్‌లోనే ఉంటారు. 1950లో బడ్జెట్ ముద్రణ ప్రక్రియ కొనసాగుతున్న సమయంలో లీక్ అయిన ఘటన కారణంగా ఈ లాక్-ఇన్ ప్రక్రియ అమల్లోకి వచ్చింది. కేంద్ర బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టనున్నారు.

భారత పత్రిక రంగ పితామహుడు

హైదరాబాద్ పెన్ పవర్: ఉదయం తలుపులు తెరవగానే వార్తాపత్రిక శుభోదయం అంటూ ముడిచుకుపోయి పలకరిస్తుంది. ప్రతి రోజు ఉదయం వార్తల విందును వడ్డిస్తుంది. దినపత్రిక చూడని రోజు ఏదో తెలియని వెలితి వెంటాడుతుంది. వార్తాపత్రిక రాని వేళ మనసు నిలవదు, దినచర్య సజావుగా సాగదు. కాఫీ చప్పరిస్తూ పేపర్ చదివితే ఆ మజానే వేరు. దినపత్రిక ఉషోదయాన చదవడమనే అలవాటు ఉన్న వారు ఎందరో. ప్రజాస్వామ్య సౌధానికి, పార్లమెంటరీ వ్యవస్థకు 4వ పిల్లర్‌గా పిలువబడే మీడియా నేడు పలు సవాళ్లను ఎదుర్కొంటున్నది. ఇలాంటి పలు రకాల మీడియాల్లో వార్తాపత్రికలు ప్రముఖంగా నిలబడుతూ ప్రతి దినం ప్రపంచ వార్తలను మన కళ్ల ముందు ఉంచుతాయి. దేశ గళాలుగా పత్రికలు నిలుస్తున్నాయి. ప్రజలకు, ప్రభుత్వాలకు మధ్య పటిష్టమైన వారధిగా పత్రికలు సేవలు చేస్తున్నాయి. అవినీతిని బయట పెట్టడం, అక్రమార్కుల భరతం పట్టడం, సమ్మిళిత అభివృద్ధికి ఉత్ప్రేరకంగా నిలవడం, పేదల పక్షాన నిలబడి పోరాడడం లాంటి ప్రధాన కర్తవ్యాలను నిర్వహిస్తున్న వార్తాపత్రికల మనుగడను నేటి డిజిటల్ సాంకేతిక వేదికలు మసకబార్చుతున్నాయి. భావ ప్రకటన స్వేచ్ఛకు ప్రతిరూపంగా వార్తాపత్రికలు నిలవాలి. నేటి ఆధునిక భారతంలో వార్తాపత్రికలు ప్రభుత్వాలకు వంత పలకడం, ఏదో ఒక పక్షాల నిలిచి వార్తలను తమకు అనుకూలంగా రాయడం లాంటి పోకడలతో ప్రజల్లో వార్తాపత్రికల మీద ఉన్న సదాభిప్రాయాన్ని సన్నగిల్లేలా చేస్తున్నానే వాదనలు కూడా వినిపిస్తున్నాయి. విలువలతో కూడిన నిష్పక్షపాత వార్తలను అందించే పత్రికలు రోజు రోజుకు తగ్గుతున్నాయనే అభిప్రాయం కూడా క్రమంగా బలపడుతున్నదని నిపుణులు, విశ్లేషకులు వాపోతున్నారు.మానవాళి ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు, సామాజిక న్యాయాలు, ప్రభుత్వ పాలనలో మంచి చెడ్డలు, పౌరసమాజాన్ని జాగృత పరచడం, పౌరులకు అవసర సమాచార వితరణ లాంటి ప్రధాన భూమికలు నిర్వహిస్తున్న నేటి వార్తాపత్రిక ప్రాధాన్యాన్ని ప్రచారం చేయడంతో పాటు జర్నలిస్టులు, ఎడిటర్లు, పబ్లిషర్ల అమూల్య సేవలను ప్రస్తుతించడానికి ప్రతి ఏట 29 జనవరి రోజున మన దేశంలో "భారతీయ వార్తాపత్రికల దినోత్సవం(ఇండియన్ న్యూస్ పేపర్స్ డే)" నిర్వహించుట ఆనవాయితీగా మారింది. భారతదేశంలో తొలిసారి జేమ్స్ ఆగస్టస్ హెక్కీ నాయకత్వంలో "హిక్కీస్ బెంగాల్ గెజిట్" అనే వారపత్రిక కలకత్తా నుంచి 29 జనవరి 1780న వెలువడింది. ఈ వార్తా పత్రిక నిష్పక్షపాతంగా, నిక్కచ్చిగా వార్తలను ప్రజలకు చేర్చడంతో భయపడిన నాటి బ్రిటీష్ ప్రభుత్వం 1782లో దానిని రద్దు చేయడం కూడా జరిగింది. భారతీయ వార్తాపత్రికల దినోత్సవం-2026 ఇతివృత్తంగా "సాధికారత, విషయ చైతన్యం కలిగిన సమాజం కోసం విశ్వసనీయమైన జర్నలిజం" అనబడే అంశాన్ని తీసుకోవడం ద్వారా దాని ప్రాముఖ్యతను తెలియజేసినట్లు అవుతున్నది. ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ, ప్రభుత్వ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచడం, ప్రజలకు ప్రభుత్వాలకు మధ్య అనుసంధాన కర్తలుగా నిలవడం, భావప్రకటనా స్వేచ్ఛను కాపాడడం, అవినీతి అక్రమాలు జరుగకుండా 'వాచ్‌డాగ్' వలె పని చేయడం, పేదల పక్షపాతిగా నిలవడం, సమయానుకూలంగా ప్రపంచ వార్తలను మన ఇంటికి/కంటికి/మనసు లోతుల్లోకి చేర్చడం, ప్రజలను బలోపేతం చేయడం, ప్రభుత్వాలు నిర్ణయాలను తీసుకోవడంలో సహకరించడం, ప్రజల బతుకు వెతలను వేలెత్తి చూపడం, ప్రజలను చైతన్యవంతం చేయడం లాంటి అనేక ప్రధాన ప్రయోజనాలను కలిగిస్తున్న వార్తాపత్రికలు మానవాళి నిత్యజీవితంగా ఓ ప్రధానమైన భాగమై మన జీవితాలతో అవిభాజ్యమైన అనుబంధాలను కలిగి ఉన్నాయి. ఇలాంటి ప్రయోజనాలకు తోడుగా ప్రజలను విద్యావంతులుగా మార్చడం, చదివే కళను పెంచి పోషించడం, సమాచార జ్ఞాన నైపుణ్యాలను పెంచడం, పారిభాషిక పదకోశాలను పెంచడం, భాషపై పట్టు సాధించే సాధనాలుగా ఉపయోగం, సమకాలీన సమస్యలను లోతుగా విశ్లేషించడం, పౌరసమాజ మంచి చెడ్డలను బయట పెట్టడం, రహస్య చీకటి ఒప్పందాలను బయట పెట్టడం లాంటి పలు అదనపు ప్రయోజనాలను వార్తాపత్రికలు కలిగి ఉన్నాయి. పత్రికా స్వేచ్ఛయే ప్రజాస్వామ్యం అని, జర్నలిజం లేకుండా నిజమైన స్వేచ్ఛరాదని తెలుసుకుందాం. సమ్మిళిత సామాజిక అభివృద్ధికి పత్రికలు ఉత్ప్రేరకాలు అని, వార్తాపత్రికలు ప్రజలకు అమూల్య సేవకులని భావించాలి. డిజిటల్ టెక్నాలజీ వరదలో సంప్రదాయ వార్తాపత్రికల ఆదరణ క్రమంగా కొట్టుకుపోతున్నది. ఆన్‌లైన్ పత్రికలు, సోషల్ మీడియా పోస్టింగ్స్‌తో పాఠకుల్లో వార్తాపత్రికల పట్ల దృష్టికోణం మారుతున్నది. క్షణాల్లో డిజిటల్ వేదికల్లో ప్రపంచ వార్తలు ప్రజలకు చేరుతున్నాయి. టివీ చానెల్స్ 24 గంటల వార్తలతో పేపర్ చదవాలనే వాంఛ కూడా క్రమంగా తగ్గుతున్నది. వార్తాపత్రికల్లో ప్రకటనల రెవిన్యూ తగ్గడం, వినియోగదారుల అభిరుచులు మారడం, వార్తాపత్రికల మధ్య పోటీతత్వం పెరగడం, వార్తాపత్రికల ముద్రణ/నిర్వహణ ఖర్చులు పెరగడం, ప్రాంతీయ భాషలు పుట్టుకురావడం, డిజిటల్ వేదికలు ఏకీకరణ కాకపోవడం, వార్తాపత్రికపై నమ్మకాలు సన్నగిల్లడం,

పర్యావరణ అంశాలు, ఎల్లో జర్నలిజం, కరోనా విపత్తు లాంటి సవాళ్ల నడుమ వార్తాపత్రికల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది, మారుతూనే ఉన్నది. రానున్న రోజుల్లో వార్తాపత్రిక మనుగడ సుసాధ్యం కావడానికి నిక్కచ్చి వార్తలను అందించడం, నాణ్యమైన సమాచారం చేరవేయడం, డిజిటల్ ఇంటిగ్రేషన్ సాధించడం, ప్రతిభావంతులైన నిజాయితీపరులు మాత్రమే విలేకరులుగా సేవలు అందించడం, తటస్థ పాత్రలో పత్రికలను నడపడం, పాఠకుల అభిరుచుల ఆధారంగా పత్రికల్లో సమయానుకూలంగా మార్పులు చేయడం, ప్రభుత్వాలు తమ ప్రకటనలతో ప్రోత్సహించడం, మెరుగైన ఖచ్చితమైన సమాచారాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకోవడం లాంటి చర్యలు తీసుకోవడం పత్రికా యాజమాన్యాలకు తప్పనిసరి అని గమనించాలి. వేగవంతమైన డిజిటల్ నరుడికి పేపరు చదివే ఓపిక సన్నగిల్లడంతో సంప్రదాయ వార్తాపత్రికల మనుగడ ప్రమాదకరంగా మారుతున్నది. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని "భారతీయ వార్తాపత్రికల దినోత్సవ" వేదికగా పౌర సమాజం పత్రికను ఆదరిస్తూ, అన్ని విషయాలను అంశాలను అవగాహన చేసుకుంటూ బాధ్యతగల పౌరులుగా నిలుద్దాం, మన వార్తాపత్రికలను మనమే కాపాడుకుందాం.

దక్షిణ కొరియా దిగుమతులపై సుంకాలు 25శాతానికి పెంపు

హైదరాబాద్ పెన్ పవర్: ఆటోలు, కలప మరియు ఫార్మాస్యూటికల్స్ సహా దక్షిణ కొరియా వస్తువులపై సుంకాలు పెంచనున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సోమవారం ప్రకటించారు. అమెరికాతో కుదుర్చుకున్న గత వాణిజ్య ఒప్పందానికి అనుగుణంగా దక్షిణ కొరియా వ్యవహరించడం లేదని ఆరోపించారు. తాజా పెంపుతో ఆ దేశంపై సుంకాలు 15శాతం నుండి 25శాతానికి చేరనున్నాయి. వారి ప్రత్యేక హక్కు అయిన మా చారిత్రక వాణిజ్య ఒప్పందాన్ని దక్షిణ కొరియా శాసనసభ అమలు చేయడం లేదని తన సోషల్ మీడియా ట్రూత్‌లో పేర్కొన్నారు.టారిఫ్‌ల పెంపు గురించి ముందస్తుగా తమకు తెలియదని దక్షిణ కొరియా అధ్యక్ష కార్యాలయం వెల్లడించింది. ప్రస్తుతం కెనడాలో ఉన్న వాణిజ్య మంత్రి కిమ్ జంగ్-క్వాన్, అమెరికా వాణిజ్య కార్యదర్శి హోవార్డ్ లుట్నిక్‌తో ఈ అంశంపై చర్చలు జరిపేందుకు వాషింగ్టన్ వెళ్లనున్నారని ఒక ప్రకటనలో పేర్కొంది. అమెరికా మరియు దక్షిణ కొరియా వాణిజ్యం మరియు భద్రతా ఒప్పందాన్ని కుదుర్చుకున్న కొన్ని నెలల తర్వాత, ఉద్రిక్త చర్చలు ముగిసిన అనంతరం ట్రంప్ నుండి ఈ ప్రకటన వెలువడటం గమనార్హం. గతేడాది అక్టోబర్‌లో ట్రంప్ దక్షిణ కొరియా అధ్యక్షుడు లీజే మ్యూంగ్‌తో సమావేశమైన తర్వాత ఈ ఒప్పందం ఖరారైంది. అమెరికా సుంకాల తగ్గింపులతో పాటు దక్షిణకొరియా పెట్టుబడి వాగ్దానాలను కూడా చేర్చింది. అయితే ఈ ఒప్పందానికి దక్షిణకొరియాలో చట్టపరమైన అవరోధం ఎదురవుతోంది. అమెరికాకు దక్షిణకొరియా ఎగుమతుల్లో ఆటో పరిశ్రమ 27శాతం వాటాను కలిగి ఉంది. ఇది దేశం యొక్క కార్ల ఎగుమతుల్లో సుమారు సగం ఉంటుంది.

యూరిక్ యాసిడ్ తగ్గించే బెస్ట్ ఫ్రూట్స్

ఈ మధ్య కాలంలో చాలా మంది అధిక యూరిక్ యాసిడ్ సమస్యతో బాధపడుతున్నారు. దీనిని హైప్ యూరిసెమియా అని కూడా అంటారు. దీని వలన కీళ్లు, మూత్రపిండ సమస్యలు ఎక్కువగా వస్తుంటాయి. కొన్ని సార్లు ఇది చాలా ప్రమాదకరం కూడా కావచ్చు. అందుకే అధిక యూరిక్ యాసిడ్ సమస్య తగ్గిపోవాలి అంటే తప్పకుండా ఆహారం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలంట. ముఖ్యంగా కొన్ని రకాల పండ్లు తినడం వలన యూరిక్ యాసిడ్ అనేది కంట్రోల్ అవుతుందంట. సిట్రస్ ఫ్రూట్స్ : సిట్రస్ ఫ్రూట్స్ అంటే, నిమ్మకాయ, నారింజ వంటి పండ్లు. వీటిలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. అంతే కాకుండా ఇవి ఆరోగ్యానికి చాలా విధాలుగా మేలు చేస్తాయి. ముఖ్యంగా అధిక యూరిక్ యాసిడ్ స్థాయిలను తగ్గించడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయి. ప్రతి రోజూ మీ డైట్‌లో వీటిని చేర్చుకోవడం వలన ఇవి మూత్ర పిండాల పనితీరును మెరుగు పరిచి, మూత్రం ద్వారా యూరిక్ యాసిడ్ విసర్జనను పెంచుతుంది. అలాగే శరీరంలోని విషపదార్థాలను బయటకు పంపిస్తుంది. అందుకే ప్రతి ఒక్కరూ తప్పకుండా మీ డైట్‌లో నిమ్మకాయను చేర్చుకోవాలంట.

బెర్రీస్ : బెర్రీస్‌లలో విటమిన్స్, యాంటీ ఆక్సిడెంట్స్, విటమిన్ సి, పాలీఫెనాల్స్ వంటివి పుష్కలంగా ఉంటాయి. అంతే కాకుండా ప్రతి రోజూరూ వీటిని తినడం వలన ఇది శరీరానికి తక్షణ శక్తిని అందించి రోగిరోధక శక్తిని పెంచుతాయి. అయితే అంతే కాకుండా ఇవి యూరిక్ యాసిడ్ ప్రమాదాన్ని కూడా తగ్గిస్తాయంట. బెర్రీలలో నీటి శాతం ఎక్కువగా ఉండటం వలన ఇవి మూత్రపిండాల ద్వారా విషాన్ని బయటకు పంపి, శరీరానికి మేలు చేస్తాయి. అరటి పండ్లు : అరటి ఆరోగ్యానికి చేసే మేలు గురించి ఎంత చెప్పినా తక్కువే. వీటిలో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. అందువలన రోజుకు ఒక అరటి పండు తినడం వలన ఇది యూరిక్ యాసిడ్ స్థాయిలను చాలా త్వరగా తగ్గిస్తుందంట. అంతేకాకుండా వాపులు, కీళ్ల నొప్పుల నుంచి కూడా ఉపశమనం కలిగిస్తుందని చెబుతున్నారు ఆరోగ్య నిపుణులు.

పైనాపిల్ : పైనాపిల్ ఆరోగ్యానికి చాలా మంచిది. ఇందులో బ్రోమెలైన్ అనే ఎంజైమ్ ఉండటమే కాకుండా, సహజ శోథ నిరోధక లక్షణాలను కలిగి ఉంటుంది. అందువలన దీనిని తీసుకోవడం వలన ఇది కీళ్ల నొప్పుల నుంచి ఉపశమనం కలిగించి, మూత్రపిండాల ఆరోగ్యానికి దోహద పడుతుంది.

ఎండు చేపలు ఇష్టంగా తింటున్నారా? ఈ నిజాలు తెలిస్తే షాక్ అవుతారు!

నాన్ వెజ్‌ప్రియులు చాలా మందికి చేపలంటే మరింత ఇష్టం..చేపలలో పచ్చివి, ఎండు చేపలు రెండు రకాలు తినేవారు కూడా చాలా మంది ఉంటారు. పచ్చి చేపలు ఆరోగ్యానికి ఎంత మేలు చేస్తాయో, ఎండు చేపలు కూడా ప్రయోజనకరం అంటున్నారు పోషకాహార నిపుణులు. వీటిలో అనేక పోషకాలు పుష్కలంగా ఉంటాయని చెబుతున్నారు. అయినప్పటికీ కొందరు మాత్రం వీటిని పొరపాటున కూడా తినకూడదని చెబుతున్నారు. చేపలను బాగా ఎండిబెట్టి అమ్ముతారు.. వీటిని ఎండు చేపలు అంటారు. వీటిని సాధారణంగా ఉప్పు కలిపి ఎండలో బాగా ఎండబెట్టి తయారు చేస్తారు. ఇలా తయారు చేసిన చేపలు మార్కెట్లో కూడా అమ్ముతారు. ఇక వీటితో రకరకాల వంటకాలు తయారు చేసుకుంటారు ఫిష్ ప్రియులు. ఇలా చేపలను ఎండ బెట్టడం వల్ల వాటిల్లో ఉండే నీరు పోతుంది. కానీ, పోషకాలు మాత్రం అలాగే ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఎండు చేపలు తింటే బ్రెయిన్ హెల్త్, కంటి చూపు, ఎముకల ఆరోగ్యం బాగుంటుంది. అయితే వీటిని అతిగా తినడం ఆరోగ్యానికి హానికరమని వైద్యులు చెబుతున్నారు. గుండె జబ్బులు ఉన్నావారు జీర్ణ సమస్యలతో ఇబ్బంది పడేవారు, చర్మ సమస్యలు, మూత్రపిండాల సమస్యలు

ఉన్నవారు ఎండు చేప తినకూడదని నిపుణులు చెబుతున్నారు.. ముఖ్యంగా, రక్తపోటు, షుగర్ ఎక్కువగా ఉన్నవారు కూడా ఎండు చేపను తినకూడదని అంటున్నారు. చర్మ సమస్యలు లేదా అలెర్జీలు ఉన్నవారు కూడా ఎండు చేపను తినకూడదట. అలా తింటే దద్దుర్లు, దురద, పొక్కులు లాంటి సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఎండు చేప తినేటప్పుడు మజ్జిగ, పెరుగు, ఆకుకూరలు లాంటి ఆహారాలను తినకూడదు. ఇది శరీరానికి హానికరం. కొన్నిసార్లు ఫుడ్ పాయిజన్ కూడా కావచ్చు. తలకు నూనె రాసుకుని స్నానం చేసే రోజున ఎండు చేప తినకూడదు. ముఖ్యంగా సైనస్ సమస్య, జలుబు, దగ్గు, ఆస్తమా సమస్య ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలి. తలకు నూనె రాసుకుని స్నానం చేసిన తర్వాత ఎండు చేప తింటే సమస్య మరింత పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు.

రాత్రి పడుకునే ముందు నీళ్లు తాగితే ఏమవుతుంది..?

నీరు జీవనాధారం.. ఇది మనందరికీ తెలిసిన సత్యం. రోజంతా తగినంత నీరు తాగడం ఆరోగ్యానికి ఎంతో మేలని వైద్యులు చెబుతుంటారు. అయితే రాత్రి పడుకునే ముందు గ్లాసుడు నీళ్లు తాగడం వల్ల అద్భుత ప్రయోజనాలు ఉంటాయని కొందరు.. కాదు కాదు, అది నిద్రను చెడగొడుతుందని మరికొందరు వాదిస్తుంటారు. అసలు వాస్తవం ఏంటి? మానవ శరీరంలో నీరు ఎంత కీలకమైన పాత్ర పోషిస్తుందో మనందరికీ తెలిసిందే. మన శరీరంలో దాదాపు 60 నుండి 70 శాతం వరకు నీరే ఉంటుంది. అందుకే రోజూ కనీసం 8 గ్లాసుల నీరు తాగాలని వైద్యులు సూచిస్తుంటారు. అయితే రాత్రి పడుకునే ముందు నీరు తాగే విషయంలో మాత్రం భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఈ అలవాటు వల్ల ప్రయోజనాలు ఉన్నప్పటికీ, కొన్ని జాగ్రత్తలు పాటించకపోతే నిద్రకు భంగం కలిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

రాత్రి వేళ శరీరానికి సరైన మోతాదులో నీరు అందడం వల్ల అనేక లాభాలు ఉన్నాయి. రాత్రి పడుకునే ముందు నీరు తాగడం వల్ల శరీరంలోని విషతుల్యాలు బయటకు వెళ్లిపోతాయి. ఇది రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. శరీరం తన ఉష్ణోగ్రతను సమతుల్యం చేసుకోవడానికి హైడ్రేషన్ అవసరం. నీరు తాగడం వల్ల శరీరం చల్లబడి, ప్రశాంతమైన నిద్రకు సహకరిస్తుంది. గోరువెచ్చని నీరు తాగడం వల్ల కండరాల నొప్పి తగ్గడమే కాకుండా, జీర్ణక్రియ మెరుగుపడుతుంది. నిమ్మరసం కలిపిన నీరు తాగితే రోగనిరోధక శక్తి పెరిగి, చర్మం ప్రకాశవంతంగా మారుతుంది. ప్రయోజనాలు ఉన్నాయని చెప్పి, పడుకునే ముందు అతిగా నీరు తాగితే నోక్టోరియా అనే సమస్య వచ్చే అవకాశం ఉంది. ఎక్కువ నీరు తాగడం వల్ల రాత్రిపూట పదే పదే మూత్ర విసర్జనకు వెళ్లాల్సి వస్తుంది. దీనివల్ల గాఢ నిద్రకు భంగం కలుగుతుంది. సరైన నిద్ర లేకపోవడం వల్ల మరుసటి రోజు అలసట, తలనొప్పి, ఏకాగ్రత లోపించడం వంటివి జరుగుతాయి. దీర్ఘకాలంలో ఇది గుండె ఆరోగ్యంపై కూడా ప్రభావం చూపవచ్చు. నీరు తాగిన వెంటనే పడుకోవడం కంటే ఒక క్రమపద్ధతిని పాటించడం ఉత్తమమని నిపుణులు చెబుతున్నారు. నిద్రపోవడానికి కనీసం 2 గంటల ముందే చివరిసారిగా నీరు తాగడం మంచిది.రాత్రి భోజనం చేసిన గంట తర్వాత నీరు తాగడం వల్ల జీర్ణక్రియ సజావుగా సాగుతుంది.పడుకునే ముందు దాహం వేస్తే గ్లాసుల కొద్దీ కాకుండా కేవలం కొన్ని గుక్కల నీరు మాత్రమే తాగాలి. హైడ్రేటెడ్‌గా ఉండటం ఆరోగ్యానికి మేలు చేస్తుంది, కానీ అది మన నిద్రను పాడుచేయకూడదు. కాబట్టి పడుకునే ముందు సమయాన్ని బట్టి నీరు తాగుతూ ఆరోగ్యాన్ని కాపాడుకోండి.

అవిసె గింజలతో లాభాలెన్నో..?

అవిసె గింజలు.. కేవలం ఆహారపు పదార్థమే కాక, ఆరోగ్యానికి విస్తృత ప్రయోజనాలను అందిస్తాయని ఆరోగ్య నిపుణులు కూడా పేర్కొంటున్నారు. అందుకే మనం తీసుకునే ఆహారంలో అవిసె గింజలను తప్పనిసరిగా చేర్చుకోవాలని సూచిస్తున్నారు. అవిసె గింజలు చిన్న గోధుమరంగు గింజల్లా ఉంటాయి.. కానీ వాటిలో పోషకాలు చాలా గొప్పగా ఉంటాయి. అవిసె గింజలు ఆహారంగా తీసుకోవడం వల్ల మన శరీరానికి ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. శరీరానికి అనేక విటమిన్లు, ప్రోటీన్లు అందించడంతోపాటు శక్తిని అందిస్తాయి. అంతేగాక, అనేక వ్యాధుల నుంచి కాపాడుతుంది. అవిసె గింజలు.. కేవలం ఆహారపు పదార్థమే కాక, ఆరోగ్యానికి విస్తృత ప్రయోజనాలను అందిస్తాయని ఆరోగ్య నిపుణులు కూడా పేర్కొంటున్నారు. అందుకే మనం తీసుకునే ఆహారంలో అవిసె గింజలను తప్పనిసరిగా చేర్చుకోవాలని సూచిస్తున్నారు. గుండెకు మేలు.. అవిసె గింజలలో ఉన్న ఒమెగా-3 ఫ్యాటీ ఆమ్లాలు (ఒఒం) హృదయ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. ఇవి రక్తనాళాల్లోని కొవ్వును తగ్గించి, రక్తప్రవాహాన్ని సులభతరం చేస్తాయి. దీంతో గుండె సంబంధ వ్యాధులు తగ్గిపోతాయి.రక్తనాళాల్లో లిపిడ్ స్థాయిల సమతుల్యం.. హృదయపోటు, అథెరోస్క్లెరోసిస్ ప్రమాదాన్ని తగ్గిస్తాయి. జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి.. అవిసె గింజలు సెల్‌ఫైబర్ (పరిమితి, అఇు ఫైబర్)లో ధనంగా ఉంటాయి. ఇవి జీర్ణక్రియను సులభతరం చేస్తాయి. అంతేగాక, కడుపు నొప్పి, కట్జ్ సమస్యలను తగ్గిస్తాయి. ఆహారంలోని పాడైన ఫ్యాట్లు, చక్కెరలను శరీరంలో సమీకరించి నిల్వ చేసుకోవడాన్ని తగ్గిస్తాయి. మధుమేహం నియంత్రణ.. అవిసె గింజలలో ఘన ఫైబర్, లిగ్నాన్లు ఉంటాయి. ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తాయి. రక్తంలో గ్లూకోజ్ పెరుగుదలని తగ్గిస్తాయి. టైప్ 2 డయాబెటిస్ ఉన్న వ్యక్తులకు ఉపయోగకరంగా ఉంటాయి. కేన్సర్ నివారణ.. అవిసె గింజలలో ఉండే లిగ్నాన్లు అనేవి ఫైటోఎస్ట్రోజెన్స్‌గా పనిచేస్తాయి. ఇవి కొన్ని కేన్సర్ రకాల (మొదటి స్థానంలో ప్రొస్టేట్, స్తన కేన్సర్) యొక్క వృద్ధి అవకాశాలను తగ్గిస్తాయి.బరువు నియంత్రణ.. అవిసె గింజలు ఆకలిని నియంత్రించడంలో సహాయపడతాయి. ఫైబర్ ఎక్కువగా ఉండటం వల్ల పొట్ట పొడవుగా నిండినట్లు ఉంటుంది. తక్కువ కాలరీలు తీసుకోవడంలో సహాయపడుతుంది.

చాప కింద నీరులా కబలిస్తున్న సైలెంట్ కిల్లర్!

ఈ భూమిపై ఒత్తిడి లేని వారు ఉండటం సాధ్యమే? అనేంతగా ఇదీ మన జీవితాలను ఆక్రమించింది. ఆర్థిక సమస్యలు, ఆఫీసు పని, కుటుంబ బాధ్యతలు వంటి వివిధ కారణాలు లోపలి నుంచి మసల్ని కుంగదీస్తూ ఉంటాయి. కానీ మీకు తెలుసా... మీరు అనుభవించే ఈ ఒత్తిడి మీకు తెలిసినా.. తెలియకపోయినా.. అకాల వృద్ధాప్యానికి దారితీస్తుంది. నేటి కాలంలో స్ట్రెస్ జీవితంలో ఒక భాగమైపోయింది. ఎంతగా అంటే.. ఈ భూమిపై ఒత్తిడి లేని వారు ఉండటం సాధ్యమే? అనేంతగా ఇదీ మన జీవితాలను ఆక్రమించింది. ఆర్థిక సమస్యలు, ఆఫీసు పని, కుటుంబ బాధ్యతలు వంటి వివిధ కారణాలు లోపలి నుంచి మనల్ని కుంగదీస్తూ ఉంటాయి. కానీ మీకు తెలుసా? మీరు అనుభవించే ఈ ఒత్తిడి మీకు తెలిసినా.. తెలియకపోయినా.. అకాల వృద్ధాప్యానికి దారితీస్తుంది. అవును.. అతిగా ఆలోచించడం వల్ల జుట్టు రాలడం నుంచి గుండె జబ్బుల వరకు అనేక సమస్యలు వస్తాయి. అంతేకాకుండా ఒత్తిడికి నిరంతరం గురికావడం వల్ల మన శరీరంలో 'కార్టిసాల్' వంటి ఒత్తిడి హార్మోన్లు అధికంగా విడుదలవుతాయి. ఇవి విషం కంటే ప్రమాదకరమైనవి. గుండె, మెదడు, జీర్ణవ్యవస్థను దెబ్బతీస్తాయి. ఆరోగ్యానికి హాని కలిగించే ఒత్తిడి వల్ల శరీరానికి ఏమి జరుగుతుందో? దానిని నివారించడానికి ఏమి చేయాలో? ఒత్తిడి పెరిగినప్పుడు, కార్టిసాల్, అడ్రినలిన్ అనే హార్మోన్లు అధికంగా విడుదలవుతాయి. ఇది రక్తపోటుని పెంచుతుంది. గుండెపై ఒత్తిడిని కలిగిస్తుంది.ఒత్తిడి వల్ల అసిడిటీ, మలబద్ధకం, జీర్ణవ్యవస్థ మందగిస్తుంది. కొంతమందికి ఆకలి తగ్గుతుంది. మరికొందరు అతిగా తిని బరువు పెరుగుతారు. స్త్రీలకు పీరియడ్స్ సమస్యలు ఎదురవుతాయి. పురుషులు హార్మోన్ల అసమతుల్యతను అనుభవించవచ్చు. ఇది వంధ్యత్వానికి కూడా దారితీస్తుంది. జ్ఞాపకశక్తి కోల్పోవడం, ఏకాగ్రత లేకపోవడం, నిర్ణయాలు తీసుకోలేకపోవడం వంటివి సంభవించవచ్చు. ఒత్తిడిని నివారించడానికి చిట్కాలు? ప్రతిరోజూ కనీసం 30 నిమిషాలు వ్యాయామం లేదా యోగా చేయాలి. ప్రతిరోజూ 7-8 గంటలు మంచి నిద్ర పోవాలి. సానుకూల మనస్తత్వాన్ని అలవర్చుకోవాలి. అవసరమైతే చికిత్స కూడా తీసుకోవాలి.

రక్తపోటు సరిగ్గానే చెక్ చేసుకుంటున్నారా?

రక్తపోటు తరచూ ఇంట్లోనో లేక ఆస్పత్రికి వెళ్లో చెక్ చేసుకోవడం నేటి కాలంలో సాధారణం అయిపోయింది. ముఖ్యంగా బీపీ చెకింగ్‌కి చాలా మంది ఇంట్లోనే చెక్ చేసుకోవడానికి ప్రయత్నిస్తుంటారు. అధిక రక్తపోటుతో బాధపడుతున్న వ్యక్తులు రక్తపోటును తనిఖీ చేయడంలో కొన్ని తప్పులు చేస్తుంటారు. దీని వల్ల తప్పుడు రీడింగ్ వస్తుంది. జనరల్ ప్రాక్టీషనర్ డాక్టర్ విశాఖ ఖచ్చితమైన రీడింగ్ పొందడానికి అనుసరించే పద్ధతి గురించి చెబుతున్నారు. సాధారణంగా రక్తపోటును తనిఖీ చేసేటప్పుడు తెలిసో.. తెలియకో.. చేసే తప్పులు రీడింగ్‌ను ఎలా పెంచుతాయో లేదా తగ్గిస్తాయో ఆమె ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో వివరించారు. శారీరక శ్రమ లేదా భావోద్వేగ ఒత్తిడి తర్వాత వెంటనే రక్తపోటును కొలవడం సాధారణంగా అందరూ చేసే తప్పు. ఇది సిస్టోలిక్ రక్తపోటును తప్పుగా పెంచుతుంది. ఇటువంటి రీడింగ్‌లు వ్యక్తి వాస్తవ బేస్‌లైన్ స్థాయిలను వెల్లడించదు. బీపీ చెకప్ చేసుకునే ముందు ఐదు నిమిషాలు నిశ్శబ్దంగా కూర్చోవడం మంచిది. చెకప్ సమయంలో కూర్చునే తప్పుడు భంగిమ కూడా రీడింగ్‌ను ప్రభావితం చేస్తుంది. కాళ్ళు అడ్డంగా పెట్టుకుని, వేలాడిస్తూ.. తగినంత వీపు మద్దతు లేకుండా కూర్చున్నప్పుడు రక్తపోటు రీడింగ్‌లు 10 ఎఎఱుణ నుంచి 15 ఎఎఱుణ వరకు పెరుగుతాయి. రీడింగ్ సమయంలో వీపు భాగం కుదురుగా ఉంచాలి. రెండు పాదాలు నేలపై ఉంచాలనే విషయాలు నిర్ధారించుకోవాలి. ఇలా చేస్తే చెకప్ సక్రమంగా ఉంటుంది. చేయి వేలాడదీయడం లేదా సపోర్ట్ లేకుండా ఉండటం మరొక సాధారణ తప్పు. చేయి గుండె స్థాయి కంటే తక్కువగా ఉంచినట్లయితే తప్పుగా అధిక రక్తపోటు రీడింగ్ వస్తుంది. అదేవిధంగా చేయి చాలా ఎత్తుగా పైకి లేపినా తప్పుగా తక్కువ రీడింగ్ వస్తుంది. చేయి గుండె స్థాయిలో సౌకర్యవంతంగా ఉండేలా ఉంచాలి. ఇది రక్తపోటును కొలవడానికి సరైన భంగిమ. కఫ్ సైజు అనేది రక్తపోటు రీడింగ్‌లను ప్రభావితం చేసే మరో ముఖ్యమైన అంశం. చాలా చిన్నగా ఉన్న కఫ్ తప్పుగా రీడింగ్‌లను పెంచుతుంది. అలాగే పెద్దగా ఉన్న కఫ్ కూడా తప్పుగా తక్కువ రీడింగ్‌కు దారితీస్తుంది. ఖచ్చితమైన కొలత కావాలంటే చేయి చుట్టుకొలతకు తగిన కఫ్‌ను మాత్రమే ఉపయోగించాలి. ఒకే రక్తపోటు రీడింగ్ ఆధారంగా రోగ నిర్ధారణ లేదా చికిత్స చేయడం తగినది కాదు. రోజంతా రక్తపోటు హెచ్చుతగ్గులకు లోనవుతూ ఉంటుంది. కేవలం ఒకే రీడింగ్‌పై ఆధారపడటం తప్పుడు చికిత్సకు దారితీయవచ్చు. చికిత్సకు ముందు కనీసం రెండు రీడింగ్‌లను తీసుకోవాలి. ఒకటి పడుకున్నప్పుడు, మరొకటి కూర్చున్నప్పుడు తీసుకోవాలి

వరల్డ్ కప్ ముందు క్రేజీ సిరీస్: ఆస్ట్రేలియాతో పాకిస్థాన్ టీ20 సిరీస్.. లైవ్ స్ట్రీమింగ్, స్క్వాడ్, టైమింగ్ వివరాలు!

హైదరాబాద్ పెన్ పవర్: వరల్డ్ కప్ ముందు మరో క్రేజీ సిరీస్ క్రికెట్ ఫ్యాన్స్ ను అలరించడానికి సిద్ధంగా ఉంది. పాకిస్థాన్, ఆస్ట్రేలియా జట్లు మూడు మ్యాచ్ ల టీ20 సిరీస్ ఆడేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఇందులో భాగంగా తొలి మ్యాచ్ గురువారం (జనవరి 29) జరగనుంది. ఈ మ్యాచ్ కు లాహోర్‌లోని గడాఫీ స్టేడియం ఆతిథ్యమివ్వనుంది. ఆస్ట్రేలియా జట్టును మిచెల్ మార్ష్ లీడ్ చేయనున్నాడు. మరోవైపు పాకిస్థాన్ జట్టుకు సల్మాన్ అలీ అఘా నడిపించనున్నాడు. సొంతగడ్డపై ఆస్ట్రేలియాను ఓడించాలని పాకిస్థాన్ గట్టి పట్టుదలగా ఉంది. మరోవైపు వరల్డ్ కప్ ముందు ఉపఖండపు పరిస్థితులు అర్థం చేసుకొని వరల్డ్ కప్ కు బరిలోకి దిగాలని కంగారూల జట్టు భావిస్తుంది.

ఓ వైపు ఇండియా, న్యూజిలాండ్ జట్లు విశాఖపట్నం వేదికగా ఈ రోజు నాలుగో టీ20 ఆడుతుంటే మరోవైపు ఆస్ట్రేలియా, పాకిస్థాన్ జట్లు రేపు లాహోర్ లో తొలి టీ20 ఆడనున్నాయి. ఈ రెండు రోజులు ఫ్యాన్స్ కు డబుల్ కిక్ ఖాయంగా కనిపిస్తుంది. ఆస్ట్రేలియా జట్టులో కీలక స్టార్లు జోష్ హాజిల్‌వుడ్, పాట్ కమ్మిన్స్, గ్లెన్ మాక్స్‌వెల్, టిమ్ డేవిడ్ స్వల్ప గాయాల కారణంగా సిరీస్ కు అందుబాటులో ఉండడం లేదు. ట్రావిస్ హెడ్, మిచెల్ మార్ష్, కామెరాన్ గ్రీన్, జోష్ ఇంగ్లిస్, మార్కస్ స్టోయినిస్, కూపర్ కొన్నోలీ, మిచ్ ఓవెన్ రూపంలో ఆస్ట్రేలియా బ్యాటింగ్ పటిష్టంగా కనిపిస్తుంది.

పాక్ జట్టులో బాబర్, అఫ్రిది:

ఇటీవలే జరిగిన బిగ్ బాష్ లీగ్ లో రాణించకపోయినా పాకిస్థాన్ టీ20 జట్టులో బాబర్ అజామ్ కు చోటు కల్పించారు. బిగ్ బాష్ లీగ్ లో బాబర్ 11 మ్యాచ్‌ల్లో 103.06 స్ట్రైక్ రేట్‌తో కేవలం 202 పరుగులు మాత్రమే చేశాడు. వరల్డ్ కప్ ముందు టోర్నీ కావడంతో బాబర్ అనుభవాన్ని పాక్ క్రికెట్ బోర్డు వినియోగించుకోవాలని చూస్తున్నట్టు అర్థమవుతోంది. బాబర్ తో పాటు స్టార్ ఫాస్ట్ బౌలర్ షాహీన్ అఫ్రిది కూడా ఎంపికయ్యాడు. కొంతకాలంగా పాకిస్థాన్ టీ20 జట్టుకు దూరంగా ఉన్న అఫ్రిది జట్టులో చేరాడు. స్టార్ ప్లేయర్స్ మహ్మద్ రిజ్వాన్, హరిస్ రౌఫ్ వంటి సీనియర్ ఆటగాళ్లను పాకిస్థాన్ జట్టు నుండి తొలగించింది.

ఆస్ట్రేలియాతో తలపడే పాకిస్తాన్ 16 మంది సభ్యుల జట్టు:

సల్మాన్ అలీ అఘా (కెప్టెన్), అబ్రార్ అహ్మద్, బాబర్ ఆజం, ఫహీమ్ అష్రఫ్ , ఫఖర్ జమాన్,
ఖవాజా మహ్మద్ నఫాయ్ (వికెట్ కీపర్), మహ్మద్ నవాజ్, మహ్మద్ సల్మాన్ మీర్జా, మహ్మద్ వసీం జూనియర్, నసీమ్ షా, సాహిబ్జాదా ఫర్హాన్, సైమ్ అయూబ్, షహీన్ షా అఫ్రిది, షాదాబ్ ఖాన్, ఉస్మాన్ ఖాన్, ఉస్మాన్ తారిఖ్

ఆస్ట్రేలియా జట్టు:

మిచెల్ మార్ష్ (కెప్టెన్), సీన్ అబాట్, జేవియర్ బార్ట్‌లెట్, మష్లి బియర్డ్‌మాన్, కూపర్ కొన్నోలీ, బెన్ డ్వార్షుయిస్, జాక్ ఎడ్వర్డ్స్, కామెరాన్ గ్రీన్, ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిస్, మాథ్యూ కుహ్నెమాన్, మిచ్ ఓవెన్, జోష్ ఫిలిప్, మాథ్యూ రెన్షా మాథ్యూ షార్ట్, మార్కస్ స్టోయినిస్, ఆడమ్ జంపా

లైవ్ స్ట్రీమింగ్. లైవ్ టెలికాస్టింగ్ ఎందులో చూడాలంటే..?

భారత కాలమాన ప్రకారం ఆస్ట్రేలియా, పాకిస్థాన్ జట్ల మధ్య తొలి టీ20 రాత్రి 8:30 గంటలకు ప్రారంభమవుతుంది. సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్ ఛానెల్‌లలో ప్రత్యక్ష ప్రసారం చేయబడుతుంది. ఆన్‌లైన్ స్ట్రీమింగ్ వెబ్ బ్రౌజర్‌లలోని సోనీ లివ్ యాప్ లో చూడొచ్చు.

హై స్కోరింగ్ థ్రిల్లర్‌కు రంగం సిద్ధం.. నాలుగో టీ20కి పిచ్ రిపోర్ట్, వాతావరం ఎలా ఉందంటే..?

హైదరాబాద్ పెన్ పవర్: ఇండియా, న్యూజిలాండ్ జట్ల మధ్య మరికొన్ని గంటల్లో నాలుగో టీ20 జరగనుంది. బుధవారం (జనవరి 28) ఇరు జట్ల మధ్య విశాఖపట్నం ఈ మ్యాచ్ కు వేదిక కానుంది. ఇప్పటికే ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 3-0తో కైవసం చేసుకున్న సూర్యకుమార్ సేన బుధవారం (జనవరి 28) జరిగే నాలుగో టీ20లోనూ గెలిచి క్లీన్ స్వీప్ లక్ష్యంగా బరిలోకి దిగుతోంది. మరోవైపు ఇప్పటికే సిరీస్ కోల్పోయిన కివీస్ నాలుగో టీ20లో ఇండియాకు షాక్ ఇచ్చి ఎలాగైనా బోణీ కొట్టాలని కసరత్తులు చేస్తుంది. ప్రస్తుతం 5 మ్యాచ్ ల టీ20 సిరీస్ లో ఇండియా 3-0 ఆధిక్యంలో నిలిచింది. నాలుగో టీ20 బుధవారం (జనవరి 28) సాయంత్రం 7:00 గంటలకు ప్రారంభమవుతుంది. అభిషేక్ శర్మ, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, ఇషాన్ కిషన్ ధనాధన్ షాట్లతో ప్రత్యర్థి బౌలర్లను ముప్పుతిప్పలు పెడుతున్నారు. ముఖ్యంగా యంగ్ ఓపెనర్ అభిషేక్ శర్మ 300 ప్లస్ స్ట్రైక్ రేట్‌తో రన్స్ రాబడుతుండటం విశేషం. 200 ప్లస్ టార్గెట్‌ను 15 ఓవర్లలో.. 150 పైచిలుకు లక్ష్యాన్ని పది ఓవర్లోనే ఛేజ్ చేయడం చూస్తుంటే, కివీస్ బౌలర్లకు ఈ మ్యాచ్‌లోనూ నిద్రలేకుండా చేసేలా కనిపిస్తోంది. నాలుగో టీ20లో ఇండియా రెండు మార్పులతో బరిలోకి దిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. స్టార్ ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యకు నాలుగో టీ 20లో రెస్ట్ ఇవ్వనున్నట్టు తెలుస్తుంది. పనిభారం కారణంగా ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా వైజాగ్ టీ20కు దూరం కానున్నాడు.

వైజాగ్ వాతావరం రిపోర్ట్:

అక్యూవెదర్ యాప్ ప్రకారం.. బుధవారం (జనవరి 28) ఉదయం ఉష్ణోగ్రత 26 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉంది. మధ్యాహ్నం తర్వాత ఉష్ణోగ్రత కొద్దిగా 27 డిగ్రీలకు పెరిగి సాయంత్రం 21 డిగ్రీలకు పడిపోతుంది. ఎలాంటి వర్ష సూచనలు మ్యాచ్ కు ఉండవు. నైట్ ఎక్కువగా మంచు పడేఅవకాశాలు ఉన్నాయి.

పిచ్ రిపోర్ట్ ఎలా ఉందంటే..?

పిచ్ విషయానికి వస్తే వైజాగ్ టీ20కు పరుగుల వరద ఖయాంగా కనిపిస్తుంది. సాధారణంగా ఇక్కడ వికెట్ బ్యాటర్లకు అనుకూలంగా ఉంటుంది. దీంతో ఈ మ్యాచ్ లో హై స్కోరింగ్ అని ఫ్యాన్స్ ఫిక్సయిపోయారు. మొదటి బ్యాటింగ్ సమయంలో పిచ్ కొంచెం నెమ్మదిగా ఉండి స్పిన్నర్లకు అనుకూలంగా ఉంటుంది. రెండో ఇన్నింగ్స్ సమయంలో మంచు ప్రభావం ఎక్కువగా ఉంటుంది. దీంతో టాస్ గెలిచిన జట్టు మొదట బౌలింగ్ తీసుకునే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

ఐసీసీ ర్యాంకింగ్స్... టాప్ 10లోకి సూర్యకుమార్ యాదవ్, నెంబర్ 1 స్థానంలోనే అభిషేక్

- న్యూజిలాండ్ సిరీస్‌లో అదరగొడుతున్న సూర్యకుమార్, అభిషేక్ శర్మ
- 929 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానాన్ని పదిలం చేసుకున్న అభిషేక్
- ర్యాంకింగ్స్‌లో బుమ్రా, హార్దిక్ పాండ్య, శివమ్ దుబేలకు చోటు



హైదరాబాద్ పెన్ పవర్: ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో భారత క్రికెట్ జట్టు సారథి సూర్యకుమార్ యాదవ్ టాప్ టెన్ బ్యాట్స్‌మెన్ జాబితాలో తిరిగి చోటు దక్కించుకున్నాడు. న్యూజిలాండ్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో అదరగొడుతున్న సూర్యకుమార్ ఐదు స్థానాలు ఎగబాకి 717 రేటింగ్ పాయింట్లతో ఏడో స్థానానికి ఎగబాకాడు. పొట్టి క్రికెట్‌లో పరుగులు సాధించడానికి ఇబ్బంది పడుతున్న సూర్యకుమార్, ఫామ్‌లోకి వచ్చాడు. న్యూజిలాండ్‌తో జరిగిన రెండవ టీ20లో 82, మూడో టీ20లో 57 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. భారత ఓపెనర్ అభిషేక్ శర్మ కూడా మూడో టీ20లో 68 పరుగులతో అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. కేవలం 14 బంతుల్లోనే అర్ధ సెంచరీ చేశాడు. నాగపూర్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో 35 బంతుల్లో 84 పరుగులు చేశాడు. తాజా ఐసీసీ ర్యాంకింగ్స్‌లో 929 రేటింగ్ పాయింట్లతో తన అగ్రస్థానాన్ని పదిలం చేసుకున్నాడు. భారత బౌలర్లలో జస్‌ప్రీత్ బుమ్రా నాలుగు స్థానాలు ఎగబాకి 13వ ర్యాంకులో నిలిచాడు. మూడో టీ20లో మూడు వికెట్లు తీసి రాణించాడు. ఆల్ రౌండర్ల విభాగంలో హార్దిక్ పాండ్య ఒక స్థానం ఎగబాకి మూడో ర్యాంకుకు, శివమ్ దుబే ఐదు స్థానాలు ఎగబాకి పదకొండవ ర్యాంకుకు చేరుకున్నారు. అక్షర్ పటేల్ 3 స్థానాలు పడిపోయి 13వ ర్యాంకులో ఉన్నాడు.

శివంగి వర్మ తాజా స్నాప్‌లలో ఉష్ణోగ్రతను పెంచారు

హీరో నేనే విలనూ నేనే.. 'యానిమల్' 3 భాగాలుగా!

రణబీర్ కపూర్ - సందీప్ వంగా కాంబినేషన్‌లో -యానిమల్- సంచలన విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఇది కేవలం ఒక సీక్వెల్‌తో ముగిసిపోయేది కాదు.. మొత్తం మూడు భాగాలుగా రాబోతోంది. ఆ మేరకు రణబీర్ కపూర్ స్వయంగా ఈ విషయాన్ని ధృవీకరించారు.

దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ఈ కథను ఒక ట్రయాలజీగా ప్లాన్ చేశారు. మొదటి భాగం -యానిమల్- కాగా, రెండో భాగం -యానిమల్ పార్క్-. మూడవ భాగానికి సంబంధించిన వివరాలు వెల్లడి కావాల్సి ఉంది. ఇంతలోనే ఇప్పుడు యానిమల్ సీక్వెల్ -యానిమల్ పార్క్- షూటింగ్ 2027 లో ప్రారంభం కానుందని రణబీర్ ధృవీకరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో కొన్నాళ్ల పాటు వేచి చూడక తప్పదని కూడా రణబీర్ అన్నారు. దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ప్రస్తుతం ప్రభాస్ హీరోగా -స్పిరిట్- సినిమా పనుల్లో బిజీగా ఉన్నారు. ఆ సినిమా పూర్తయిన తర్వాతే సీక్వెల్ పట్టాలెక్కుతుంది. యానిమల్ రెండో భాగంలో రణబీర్ కపూర్ ద్విపాత్రాభినయం చేస్తారు. మొదటి భాగం చివరలో చూపించిన నెగటివ్ క్యారెక్టర్ (అజీజ్) కి, రణవిజయ్ కి మధ్య జరిగే పోరు చాలా భయంకరంగా ఉండబోతుందని సమాచారం.రెండో భాగంలో విలన్ ఎవరంటే..? మొదటి భాగం చివరిలో అజీజ్ అనే పాత్ర ప్లాస్టిక్ సర్జరీ ద్వారా రణబీర్ (రణవిజయ్) పోలికలను పొందుతుంది. అంటే రెండో భాగం -యానిమల్ పార్క్-లో రణబీర్ తనతో తనే యుద్ధం చేసుకోబోతున్నారు. ఈ సినిమాలో విలన్ -అజీజ్- పాత్ర రణవిజయ్ కంటే క్రూరంగా ఉంటుందని సమాచారం. --ఇది చాలా థ్రిల్లింగ్‌గా ఉంది. హీరో, విలన్.. ఈ రెండు పాత్రలనూ నేనే పోషిస్తున్నాను-- అని రణబీర్ స్వయంగా వెల్లడించారు.మొదటి భాగంలో తండ్రి (అనిల్ కపూర్) కోసం రణవిజయ్ చేసిన విధ్వంసాన్ని చూశాం. రెండో భాగంలో ఈ బంధం ఇంకా ఏ మలుపులు తిరుగుతుందో, తండ్రిని కాపాడుకోవడానికి ఈ -డబుల్ రోల్- చిక్కుముడులను రణవిజయ్ ఎలా విప్పుతాడో అనేది కథలో కీలకం కానుంది. 2027లో యానిమల్ పార్క్ షూటింగ్ మొదలవుతుంది. అయితే అంతకంటే ముందే రణబీర్ నుండి మరికొన్ని భారీ చిత్రాలు రానున్నాయి. వీటిలో భన్సాలీ -లవ్ అండ్ వార్- జూన్ 2026లో విడుదల కానుంది. అటుపై నితీష్‌తివారీతో -రామాయణం- 2026 దీపావళికి విడుదలవుతుంది.సీక్వెల్ ఆలస్యానికి కారణమేమిటి? అని ప్రశ్నిస్తే, సినిమా నాణ్యతను పెంచడానికే తప్ప వెనకడుగు వేయడం కాదని రణబీర్ స్పష్టం చేశారు. సందీప్ వంగా ఈ పాత్రల మనస్తత్వాలను ఇంకా లోతుగా విశ్లేషించాలని భావిస్తున్నారు. సందీప్ రెడ్డి వంగా సినిమాల్లో ఉండే ఆ -తీవ్రమైన డ్రామా-ను మళ్ళీ పెద్ద తెరపై చూడాలంటే 2027 వరకు ఓపిక పట్టాల్సిందే!

కావ్య థాపర్ టైమ్‌లెస్ ఎత్నిక్ స్టైల్‌తో ఆకట్టుకుంది

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965